సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 13
శుక్రవారం 5-4-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



అగ్ని ప్రైమ్ బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

దేశీయంగా అభివృద్ధి చేసిన నూతన తరం 'అగ్ని ప్రైమ్' బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది. ఒడిశా సముద్ర తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం రాత్రి ఈ క్షిపణిని పరీక్షించినట్లు రక్షణ శాఖ ప్రకటించింది. దీని స్ట్రైక్ రేంజ్ 1,000 కిలోమీటర్ల నుంచి 2,000 కిలోమీటర్ల దాకా ఉంటుంది. -6లో




సోనియా ప్రమాణం

కాంగ్రెస్ మాజీ చీఫ్ సోనియా గాంధీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా 14 మంది రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు.
- వివరాలు 6లో



లక్క గాజులకు జీఐ గుర్తింపు

హైదరాబాద్‌కు ప్రత్యేకమైన లక్క గాజులకు ప్రతిష్టాత్మక భౌగోళిక సూచిక (జీఐ) గుర్తింపు లభించింది.
- వివరాలు 2లో



చంద్రబాబే ప్రధాన నిందితుడు

టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణానికి పాల్పడ్డారని సీఐడీ తేల్చింది.
- వివరాలు 12లో



డొనాల్డ్ ట్రంప్ ముందంజ

అమెరికా అధ్యక్ష ఎన్నికల కోసం ఏడు కీలక రాష్ట్రాల్లో సర్వే చేయగా ఆరు రాష్ట్రాల్లో డొనాల్డ్ ట్రంప్ వైపు మొగ్గు కనిపించింది.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

సమ్మర్ సలసల!



రాష్ట్రంలో ఈ నెల తొలివారం నుంచి క్రమంగా పెరగాల్సిన గరిష్ట ఉష్ణోగ్రతలు ఇప్పటికే అత్యధిక స్థాయిలో నమోదవుతున్నాయి. సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి 4.3 డిగ్రీల సెల్సియస్ అధికంగా రికార్డవుతున్నాయి. దీంతో ఇక నడి వేసవి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన అందరిలో కలుగుతోంది.
- వివరాలు 5లో

కవితకు బెయిల్‌పై 8న తీర్పు



ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. ఈ నెల 8వ తేదీ సోమవారం తీర్పు వెలువరిస్తామన్నారు. రెగ్యులర్ బెయిలు పిటిషన్‌పై ఈ నెల 20న విచారణ చేపడతామని తెలిపారు.
- వివరాలు 2లో

ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్‌లోని బావిలో పూడిక తీస్తున్న గ్రామస్తులు



ఆశలు.. అడుగంటి

గణనీయంగా పడిపోయిన భూగర్భ జలమట్టాలు

వట్టిపోయిన బోర్లు, బావులు...
లక్షల ఎకరాల్లో ఎండిన పంటలు

సాక్షి ప్రతినిధులు మహబూబ్‌నగర్/ కరీంనగర్/ ఖమ్మం: రాష్ట్రంలో ఎండలు మండిపోతుండటం, భూగర్భ జలాలు అడుగంటడంతో పలు జిల్లాల్లో పంటలు ఎండి పోతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. నీటి కొరత మామిడి లాంటి పంటల దిగుబడిపై ప్రభావం చూపిస్తోందని రైతులు చెబుతున్నారు. అప్పులు చేసి వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో బోర్లు వట్టిపోవడంతో నీరందక ఇప్పటివరకు లక్షకు పైగా ఎకరాల్లో పంటలు ఎండినట్లు అంచనా.
- వివరాలు 11లో

గొంతెండిపోతోంది

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడుగంటిన బావులు, చేతి పంపులు
- 'భగీరథ'నీటి సరఫరాకు సమస్యలు

- వివరాలు 11లో

ఈ ఊరు మాది.. ఖాళీ చేయండి!

గద్వాల జిల్లా చమన్‌ఖాన్‌దొడ్డి ఉన్న భూమి తమదేనంటున్న కొందరు వ్యక్తులు

గ్రామాన్ని ఖాళీ చేయాలంటూ హుకుం.... రాజకీయ నేతలు, పోలీసుల ద్వారా ఒత్తిడి


ఆందోళనలో 200 కుటుంబాలు.. జిల్లా ఎస్పీకి వినతిపత్రం

మూడు తరాల నుంచీ ఇక్కడే ఉంటున్నాం..
ఊరొదిలి పొమ్మంటే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కిషోర్‌కుమార్ పెరుమాండ్ల, మహబూబ్‌నగర్

ఆ గ్రామానికి 80 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఐదేళ్ల క్రితం గ్రామపంచాయతీగా ఆవిర్భవించింది. 200 కుటుంబాలు.. 1,000 మంది జనాభా. ఇందులో నాలుగు సామాజిక వర్గాలకు చెందిన వారు ఉండగా.. ఎక్కువగా బోయ, ఆ తర్వాత కుర్వ, ముస్లిం, గౌడ్‌లు ఉన్నారు. చాలావరకు వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారు. అంతా బాగానే ఉన్న ఆ ఊరుకు ఇప్పుడు ఆపదొచ్చింది. కొందరు వ్యక్తులు గ్రామం మొత్తాన్ని ఖాళీ చేయించి, 200 కుటుంబాల్ని నిరాశ్రయుల్ని చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి రాజకీయ నాయకులు, పోలీసులు తోడుకావడంతో పల్లెవాసులు ఎప్పుడు ఇల్లు వదిలి పోవాల్సి వస్తుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని చమన్‌ఖాన్‌దొడ్డి వాసుల దీన గాథపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

అనుబంధ గ్రామం నుంచి పంచాయతీగా..
చమన్‌ఖాన్‌దొడ్డి మొదట్లో మల్లంపల్లి గ్రామపంచాయతీకి అనుబంధంగా ఉండేది. శాసనసభ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈ గ్రామంలోని ఓటర్లు మల్లంపల్లికి వెళ్లి మిగతా 2వ పేజీలో ▶



చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామం



ప్రముఖ ఇంగ్లిష్ న్యూస్ చానల్ టైమ్స్ నౌ-ఈటీజీ సర్వేలో వెల్లడి

వైఎస్సార్‌సీపీ | టీడీపీ, బీజేపీ, జనసేన

'ఫ్యాన్' ప్రభంజనమే

ఏపీలో 21-22 ఎంపీ సీట్లు కైవసం చేసుకోవడం ఖాయం

సాక్షి, అమరావతి: సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతోంది. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని ప్రముఖ జాతీయ మీడియా ఇంగ్లిష్ న్యూస్ చానల్ టైమ్స్ నౌ–ఈటీజీ తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశంలో అన్ని రాష్ట్రాలతోపాటు ఏపీలోనూ ప్రజల అభిప్రాయాన్ని టైమ్స్ నౌ సంస్థ నెల రోజులపాటు విస్తృతంగా సర్వే చేసింది. ఈ సర్వే ఫలితాలను గురువారం రాత్రి టైమ్స్ నౌ చానల్ ప్రసారం చేసి చర్చ నిర్వహించింది. అత్యంత శాస్త్రీయంగా నిర్వహించిన ఈ సర్వేలో రాష్ట్రంలో 21 నుంచి 22 లోక్‌సభ స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకుంటుందని వెల్లడైంది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కట్టి జట్టుగా వచ్చినప్పటికీ ఘోర పరాభవం తప్పదని సర్వేలో తేలింది. బీజేపీకి రాష్ట్రంలో మిగతా 12వ పేజీలో ▶



వాహనాల రాకపోకలకు వీలుగా ర్యాంప్ నిర్మాణం
ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తీరుతాయంటున్న బీఆర్‌ఎస్ వర్గాలు
వీధిపోటును దృష్టిలో పెట్టుకుని దక్షిణ గేటు వద్ద లక్ష్మీనరసింహ స్వామి ఫొటో

ఈశాన్యం వైపు నడుద్దాం

తెలంగాణ భవన్‌లో వాస్తు మార్పులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో భారత్ రాష్ట్ర సమితి కార్యాలయం తెలంగాణ భవన్‌లో వాస్తు రీత్యా మార్పులు చేస్తున్నారు. పార్టీ అధికారం కోల్పోవడంతో పాటు అధినేత కేసీఆర్ ప్రమాదం బారిన పడటం, నేతలు పార్టీ వీడటం, కవిత అరెస్టు తదితర ఘటనల నేపథ్యంలో వాస్తు నిపుణుల సూచనల మేరకు పలు మార్పులు చేస్తున్నారు. ఇన్నాళ్లు తెలంగాణ భవన్ తూర్పు అభిముఖంగా ఉండగా వాయవ్య దిశలో ఉన్న గేటు నుంచి రాకపోకలు జరుగుతున్నాయి. వాస్తు నిపుణుల సలహా మేరకు ఇకపై ఈశాన్యం వైపు ఉన్న గేటును రాకపోకలకు వినియోగించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఈశాన్యం వైపు ఉన్న గేటును తెరిచి వాహనాల రాకపోకలకు వీలుగా ర్యాంపు నిర్మిస్తున్నారు. మరోవైపు వీధి పోటును దృష్టిలో పెట్టుకుని దక్షిణభాగంలో ఉన్న గేటు వద్ద యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి చిత్రంతో కూడిన ఫ్లెక్సీని మిగతా 2వ పేజీలో ▶



నలుగురు ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాప్ చేసిన ప్రణీత్‌రావు
బేరసారాలు వెలుగులోకి వచ్చాక పక్కా స్కెచ్... కీలకంగా వ్యవహరించిన రాధాకిషన్, మరో అధికారి
పోలీసు కస్టడీలోకి వచ్చిన సిటీ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ

ట్యాపింగ్ ద్వారానే 'ఎమ్మెల్యేలకు ఎర' వెలుగులోకి!

సాక్షి, హైదరాబాద్: ఎస్ఐబీ అధీనంలోని స్పెషల్ ఆపరేషన్ టీమ్ చేసిన ఫోన్ ట్యాపింగ్ ద్వారానే బీజేపీ అగ్రనేత బీఎల్.సంతోష్ సహా పలువురు ప్రముఖులు నిందితులుగా ఉన్న 'ఎమ్మెల్యేలకు ఎర'వ్యవహారం వెలుగులోకి వచ్చినట్టు తేలింది. నందకుమార్, రామచంద్రభారతి, సింహయాజి స్వామి ట్రాప్ కావడం, పట్టుబడటంలో అప్పట్లో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా (ఓఎస్డీ) పనిచేసిన పి.రాధాకిషన్‌రావుతోపాటు సైబరాబాద్‌కు చెందిన మరో అధికారి కీలకంగా వ్యవహరించినట్టు సిట్ గుర్తించింది. రాధాకిషన్‌ను వారంరోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించడంతో గురువారం వైద్య పరీక్షల అనంతరం బంజారాహిల్స్ ఠాణాకు తరలించారు. ఈయన నుంచి కేసుకు సంబంధించి కీలక సమాచారం సేకరించాల్సి ఉందని పశ్చిమ మండల డీసీపీ విజయ్‌కుమార్ ప్రకటించారు.
భారీ స్కెచ్...: 2022లో మునుగోడు ఉపఎన్నిక సమీపిస్తున్న వేళ.. మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో అప్పటి మిగతా 10వ పేజీలో ▶



కార్మికుల ఆత్మహత్యలను పట్టించుకోరా?
వెంటనే బతుకమ్మ చీరలకు ఆర్డర్లు ఇవ్వండి
పాత బిల్లులు చెల్లించండి
సంక్షోభం తీవ్ర రూపం దాల్చక ముందే శాశ్వత పరిష్కారం చూపండి

నేతన్నలపై ఎందుకీ కక్ష?

ముఖ్యమంత్రికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లుగా కళకళలాడిన చేనేత రంగం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 4 నెలల్లోనే తిరిగి సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు విమర్శించారు. ప్రభుత్వ కక్షపూరిత వైఖరితో నేత కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు.
కార్మికుల పొట్టకొట్టొద్దు..!: 'ఉపాధి కోల్పోయిన నేత కార్మికులు ఆత్మహత్యల బాట పడుతున్నారు. రైతాంగ సంక్షోభం తరహాలో నేత కార్మికుల సంక్షోభం తీవ్ర రూపం దాల్చక ముందే శాశ్వత పరిష్కారం చూపండి. గత ప్రభుత్వంపై కోపంతో నేత కార్మికుల పొట్ట కొట్టకుండా గత ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలు కొనసాగిస్తూనే అదనపు సాయం అందేలా చూడండి. ప్రభుత్వ కక్షపూరిత వైఖరితో కార్మికులు నేత పనికి దూరం కావడంతోపాటు పవర్ లూమ్స్‌కు ఆర్డర్లు లేక మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



'పొత్తు' ప్రచారమట!

నేడు కరీంనగర్‌కు కేసీఆర్

- కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఎండిన పంటల పరిశీలన
- ఈ సందర్భంగా కీలక ప్రకటన చేసే అవకాశం
- పార్టీ మారేది లేదని స్పష్టం చేసిన మాజీ మంత్రి గంగుల



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం పర్యటించనున్నారు. సాగు నీటి కొరతతో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం రోడ్డుమార్గంలో ప్రత్యేక బస్సులో రానున్న కేసీఆర్ ముందుగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం, కరీంనగర్ రూరల్ మండలాల్లో ఎండిన పొలాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంట్లో భోజనం చేస్తారు. ఆ తరువాత సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి మండలం, వేములవాడ నియోజకవర్గాల్లో పంటలను మిగతా 10వ పేజీలో ▶

అంజివేడులో ఏపీ సీఎం జగన్‌కు పల్లీలు తినిపిస్తున్న మహిళా వ్యవసాయ కూలీ



వలంటీర్ల సేవలు ఆగవు

మళ్లీ మన ప్రభుత్వంలో ఆ ఫైల్‌పైనే నా తొలి సంతకం: ఏపీ సీఎం జగన్

వలంటీర్ వ్యవస్థతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు
అందుకే నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించి అడ్డగింత

- బాబు తీరుతో 2 రోజుల్లో 31 మంది వృద్ధులు మృత్యువాత
- ఇలా చేసిన బాబును హంతకుడు అందామా?
- నాడు జన్మభూమి కమిటీలు.. లంచాలు ఇస్తేనే పథకాలు
- ఈ 58 నెలల్లో ఇంటింటికీ మంచి చేశాం..
- మీ బిడ్డ అబద్ధాలు చెప్పడు... మోసం చెయ్యడు
- నాయుడుపేట బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్

12లో

వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూస్తారా?

- ప్రజల ధన, మాన, ప్రాణాలను హరిస్తారా?... ఇంతకంటే అన్యాయం, ద్రోహం ఇంకేముంది
- అలాంటి బీఆర్‌ఎస్ నేతలను ఎవరూ క్షమించరు... అంతా చేసి సంబంధం లేదంటే ఎలా?
- ప్రతిపక్షంగా కూడా ఆ పార్టీ పనికి రాదు: ఉప ముఖ్యమంత్రి భట్టి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: "తీవ్రవాదుల గుర్తింపు, దేశ భద్రత కోసం ఏర్పాటు చేసిన చట్టాలను నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం పణంగా పెట్టింది. ఇది ఎంత వరకు కరెక్ట్? ప్రతిపక్షాలు, పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడ్డారు. భార్యాభర్తలు, వ్యాపారులు, అధికారులు, జడ్జీల ఫోన్లు ట్యాప్ చేశారు. ఇంతా చేసి తీరా ఫోన్ ట్యాపింగ్‌తో మాకేం సంబంధం అని తప్పించుకుంటారా? వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూసిన మిమ్మల్ని ఎవరూ క్షమించరు"అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బీఆర్‌ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "వ్యక్తిగత సమాచారం ట్యాప్ చేసి మిగతా 10వ పేజీలో ▶



తుక్కుగూడలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, మహేశ్‌కుమార్‌గౌడ్

'జనజాతర' అదరాలి!

- రేపు తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ సభను 10 లక్షల మందితో నిర్వహించాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- ఖర్గే, రాహుల్, ప్రియాంక హాజరయ్యే సభను విజయవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి
- సభాస్థలి వద్ద ఏర్పాట్ల పరిశీలన.. అక్కడే గంటన్నరపాటు సమావేశం
- పార్కింగ్‌కు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశం

10లో



లక్కగాజుల తయారీదారులతో కలసి జీఐ సర్టిఫికెట్ చూపిస్తున్న జయేశ్ రంజన్

లక్క గాజులకు జీఐ గుర్తింపు

లక్కగాజుల తయారీదారులకు సర్టిఫికెట్ అందజేసిన పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్




సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు ప్రత్యేకమైన లక్క గాజులకు ప్రతిష్టాత్మకమైన భౌగోళిక సూచిక (జియోగ్రాఫికల్ ఇండికేషన్–జీఐ) గుర్తింపు లభించింది. ఈ ప్రత్యేక గుర్తింపు ద్వారా లక్క గాజుల తయారీ కళాకారులకు డిమాండ్‌తో పాటు పరిశ్రమ విస్తరణకు ఉపయోగపడుతుంది. లక్క గాజులు తయారు చేసే నాలుగు వేలకు పైగా కళాకారుల జీవితాలపై జీఐ గుర్తింపు సానుకూల ప్రభావం చూపనుంది. ఇప్పటివరకు తెలంగాణకే ప్రత్యేకమైన 16 ఉత్పత్తులకు జీఐ గుర్తింపు దక్కగా ప్రస్తుతం లక్కగాజులు కూడా జీఐ గుర్తింపు జాబితాలో చోటు చేసుకున్నాయి. సచివాలయంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ లక్కగాజుల తయారీపై ఆధారపడిన చేతివృత్తుల వారికి జీఐ సర్టిఫికెట్ అందజేశారు. జీఐ సర్టిఫికేషన్ ద్వారా లక్కగాజుల తయారీలో నిమగ్నమై ఉన్న నాలుగు వేలకు పైగా కళాకారులకు ప్రయోజనం కలుగుతుంది.

ఈశాన్యం వైపు నడుద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేశారు.

అబ్బే.. వాస్తు మార్పులు కాదు కానీ..: అయితే పార్టీ వర్గాలు మాత్రం వాస్తు మార్పులు కాదని అధినేత కేసీఆర్‌తో పాటు కేటీఆర్ ఇతర కీలక నేతలు తెలంగాణ భవన్‌కు వస్తున్న సందర్భాల్లో వాయవ్య దిశలో ఉన్న గేటు ఎదురుగా రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని చెప్తున్నాయి. దీంతో వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈశాన్యం గేటు నుంచి రాకపోకలు సాగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ నేతలు చెప్తున్నారు. ఇన్నాళ్లూ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఈశాన్యం గేటును ఉపయోగించుకోలేకపోయామని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ భవన్‌ను ఆనుకుని నిర్మించిన విశాలమైన రోడ్డుతో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తీరుతాయని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.



గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరిగిన సాక్షి ఆపరేషన్స్ డైరెక్టర్ పీవీకే ప్రసాద్, శ్రీదేవిల కుమార్తె వివాహానికి హాజరై వధూవరులు స్నేహ, సాయి చరణ్‌లను ఆశీర్వదించిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి

కవితకు బెయిల్‌పై 8న తీర్పు

ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వెల్లడి
- మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై వాదనలు.. తీర్పు రిజర్వ్
- బయటకు వెళ్తే సాక్షుల్ని ప్రభావితం చేస్తారు: ఈడీ న్యాయవాది
- కుమారుడికి పరీక్షలు.. తల్లి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు: కవిత న్యాయవాది



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. ఈనెల 8వ తేదీ సోమవారం తీర్పు వెలువరిస్తామన్నారు. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 20న విచారణ చేపడతామని తెలిపారు. కుమారుడి పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్, బెయిల్ మంజూరు చేయొద్దంటూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా విచారించారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ఈడీ తరఫున జొహెబ్ హొస్సేన్‌లు వాదనలు వినిపించారు.

తల్లి పర్యవేక్షణ అవసరం: సింఘ్వీ

కవిత కుమారుడికి పరీక్షలు ఉన్నాయని, 16 ఏళ్ల కుమారుడికి తల్లి పర్యవేక్షణ, భావోద్వేగ మద్దతు ఈ సమయంలో ఎంతో అవసరమని సింఘ్వీ పేర్కొన్నారు. తల్లి అరెస్టుతో కుమారుడు ఎంతో దిగ్భ్రాంతి చెందిన పరిస్థితిని మనం చూడాలన్నారు. కవిత కుమారుడు పరీక్షలు రాసే సబ్జెక్టులు ప్రస్తావిస్తూ.. తల్లి స్థానాన్ని తండ్రి లేదా సోదరుడు భర్తీ చేయలేరని, మానసిక ప్రత్యామ్నాయం సాధ్యం కాదని చెప్పారు. తల్లి దగ్గర ఉంటే ఆ పరిస్థితి వేరుగా ఉంటుందని తెలిపారు. కవితకు బెయిల్ ఇచ్చినా ఈడీకి వచ్చే ఇబ్బందేమీ లేదని, ఆమెను తిరిగి సులభంగానే అదుపులోకి తీసుకోవచ్చని అన్నారు. తండ్రి ఢిల్లీలో ఉండి న్యాయపోరాటం చేస్తున్నారని కుమారుడు తెలంగాణలో ఉన్నారని సింఘ్వీ తెలిపారు. ఈ నేపథ్యంలో కవితకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పరీక్షల సమయంలో ప్రధాని ఆల్ ఇండియా రేడియోలో ఉపన్యాసాలు ఇస్తున్నారని, ఆ సమయంలో విద్యార్థులపై ఒత్తిడి ఊహకు మించి ఉంటుందని వ్యాఖ్యానించారు.

అన్నీ చూసి కోర్టు నిర్ణయం తీసుకోవాలి: హొస్సేన్

సెక్షన్ 45 నిబంధనలు సింఘ్వీ నొక్కి చెబుతున్నారని, అయితే ప్రజా జీవితంలో ఉండే ప్రముఖ రాజకీయ నాయకురాలికి అవి వర్తించవని ఈడీ తరఫు న్యాయవాది జొహెబ్ హొస్సేన్ అన్నారు. ఈ కేసులో లంచం ఇచ్చినట్టుగా ఆరోపణలున్న ప్రధాన వ్యక్తుల్లో ఒక మహిళను ప్రశ్నిస్తున్నామని, ప్రాక్సీల ద్వారా ఆమె లబ్ధి పొందారని వాదించారు. కేవలం ఇతర నిందితుల స్టేట్‌మెంట్ల ఆధారంగానే ఈ విషయం చెప్పడం లేదని, సంబంధిత పత్రాలు, వాట్సాప్ చాట్‌లు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రమేయం, ఆమెకు వ్యతిరేకంగా ఉన్న అన్ని విషయాలు చూసి న్యాయస్థానం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. తన దగ్గర ఉన్న ఎఫ్ఎస్ఎల్ నివేదిక సాక్ష్యాలు ఎలా నాశనం చేశారో నిరూపిస్తుందన్నారు. కవిత పలు ఫోన్ల నుంచి సమాచారం డిలీట్ చేశారని, మొత్తంగా 100 కంటే ఎక్కువ ఫోన్లు నాశనం చేశారని ఆరోపించారు. ఈ కేసులో చాలా పెద్ద పురోగతి సాధించే దశలో ఉన్నామని, తాత్కాలిక ఉపశమనం కల్పిస్తే దర్యాప్తు పక్కకు వెళ్లే అవకాశం ఉందన్నారు. కవిత చాలా ప్రభావవంతమైన వ్యక్తి అని, ప్రజలను కూడా ఆమె ప్రభావితం చేస్తారన్నారు. సాక్షుల్ని పిలిచి వారి వారి వాంగ్మూలాలు మార్చుకోవాలని బెదిరించే అవకాశం ఉందంటూ హొస్సేన్ వాదించారు. ఈ దశలో కవిత న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మరోసారి జోక్యం చేసుకొని కవిత కుమారుడికి 12 పేపర్లలో ఏడు పూర్తయ్యాయని భారతీయతలో తల్లి ఒకరే తగిన సాన్నిహిత్యాన్ని అందించగలరని తెలిపారు. ఇరు పక్షాల వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

'కృష్ణా' త్రిసభ్య కమిటీ భేటీకి

తెలుగు రాష్ట్రాలు గైర్హాజరు

12కి సమావేశాన్ని వాయిదా వేసిన కృష్ణాబోర్డు



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు అడుగంటిపోయిన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడానికి గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరగాల్సిన కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం ఈ నెల 12కి వాయిదా పడింది. కమిటీలో సభ్యులైన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఈఎన్‌సీలు గైర్హాజరు కావడంతో కృష్ణాబోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. తమ రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడికాల్వ ద్వారా 5 టీఎంసీల జలాలను ఈ నెల 8 నుంచి విడుదల చేయాలని ఏపీ చేసిన విజ్ఞప్తిపై కృష్ణాబోర్డు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చించిన తర్వాతే ఈ అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నిల్వల నుంచి ఏపీకి 45 టీఎంసీలు, తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయిస్తూ గతేడాది అక్టోబర్‌లో కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయించగా ఇప్పటి వరకు 42.391 టీఎంసీలను వాడుకుంది. దీనిపై ఏపీ ఫిర్యాదు చేయడంతో తక్షణమే నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుంచి నీటి తరలింపును నిలుపుదల చేయాలని తెలంగాణకు కృష్ణాబోర్డు ఇటీవల ఆదేశించింది. హైదరాబాద్ జంటనగరాలతో పాటు నల్లగొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి కోసం సాగర్ నుంచి నీళ్లను తరలిస్తున్నట్టు తెలంగాణ అధికారులు చెపుతున్నారు.

ఎండతో భక్తులు ఇబ్బందులు పడొద్దు

అధికారులకు దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అన్ని దేవాలయాల్లో భక్తులకు ఎండ తీవ్రత వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశించారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు పూర్తయి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించిన దృష్ట్యా రాష్ట్రంలో దేవాలయాలను సందర్శించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రధాన దేవాలయాల్లో భక్తులు ఎండబారిన పడకుండా షామియానాలు, ఆలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం, లాక్టేషన్ గదులు, వృద్ధులు, వికలాంగులకు వీల్ చైర్లు, క్యూకాంప్లెక్స్‌ల వద్ద షెడ్ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ప్రధాన ఆలయమైన యాదగిరి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో భక్తులకు విస్తృత ఏర్పాట్లను కల్పించారు.

పట్టభద్రుల ఓటర్లు 4,61,806 మంది

- ఖమ్మం – వరంగల్ – నల్లగొండ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో గతంలోకంటే తగ్గిన సంఖ్య
- తుది జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం

నల్లగొండ: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య తేలింది. గురువారం ప్రకటించిన తుది జాబితాలో 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. 2021లో జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లు ఉండగా.. ఈసారి 43,759 మంది తగ్గారు. గత ఎన్నికల సమయంలో 731 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. ప్రస్తుతం 600 పోలింగ్ స్టేషన్లను అధికారులు గుర్తించారు. కాగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలై, నామినేషన్ ప్రక్రియకు పది రోజుల ముందు వరకు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

రాష్ట్రానికి 'టెస్లా' కోసం ప్రయత్నిస్తున్నాం

- కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటుపై ఆ సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నాం
- 'ఎక్స్'వేదికగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో 'టెస్లా'కార్ల తయారీ ప్లాంటు ఏర్పాటుకు సంప్రదింపులు జరుగుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'ద్వారా గురువారం వివరాలు వెల్లడించారు. 'అంతర్జాతీయ దిగ్గజ సంస్థల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై 2023 డిసెంబర్ నుంచి తెలంగాణ ప్రభుత్వం చురుగ్గా ప్రయత్నాలు సాగిస్తోంది. భారత్‌లో పెట్టుబడుల ప్రణాళికలను టెస్లా సిద్ధం చేసుకుంటోందనే సమాచారం నేపథ్యంలో ఆ సంస్థతో సంప్రదింపులు ప్రారంభించాం. తెలంగాణకు పెట్టుబడులు రప్పించేందుకు కొంతకాలంగా అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నాం. తెలంగాణలో టెస్లా కర్మాగారం ఏర్పాటు చేసేలా చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాలతో పాటు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులు, సులభతర అనుమతులు టెస్లా వంటి సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనువుగా ఉంటాయి'అని శ్రీధర్‌బాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు. అంతకుముందు మాజీ మంత్రి కేటీఆర్ టెస్లా పెట్టుబడుల అంశాన్ని 'ఎక్స్'లో ప్రస్తావించారు. టెస్లా మోటార్స్ భారత్‌లో 2–3 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విద్యుత్ కార్ల తయారీ ప్లాంటు ఏర్పాటుకు ఓ బృందాన్ని పంపిస్తున్నట్లు వచ్చిన ఓ కథనాన్ని అందులో ట్యాగ్ చేశారు. టెస్లాను తెలంగాణకు రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలని కోరారు.

అడుగంటిన పాలేరుకు జీవం

సాగర్ జలాల విడుదల
- ఏప్రిల్, మే నెలలకు సరిపడా జలాలు
- తప్పిన తాగునీటి గండం



అడుగంటిన పాలేరు జలాశయం

సాక్షి, మహబూబాబాద్: మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించే పాలేరు జలాశయంలో నీరు అడుగంటడంతో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా నీరు వదిలారు. ఎడమ కాల్వనుంచి రోజుకు 3,300 క్యూసెక్కుల నీటిని పాలేరు జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో నాలుగు జిల్లాలకు పొంచి ఉన్న తాగునీటి ముప్పు తప్పింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట జిల్లాల్లోని 2,439 గ్రామాలకు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు, నర్సంపేట మున్సిపాలిటీలకు గోదావరి జలాలను సరఫరా చేస్తున్నారు. వీటి పరిధిలోని సుమారు 22లక్షల జనాభాకు పాలేరు నుంచి వచ్చే గోదావరి నీరే ఆధారం. ఇటీవల పాలేరు జలాశయం అడుగంటే పరిస్థితికి చేరుకుంది. 2.55 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ జలాశయంలో నీరు బుధవారం నాటికి 0.49 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం ఉన్న నీటితో రెండు, మూడు రోజులకు మించి తాగునీరు అందదని అధికారులు భావించి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు, రాష్ట్ర ఉన్నతాధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో సాగర్ జలాలు విడుదల చేయడంతో ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు విడుదల చేసే నీరు ఏప్రిల్, మే నెలలకు సరిపోనుందని, ప్రస్తుతానికి గండం తప్పినట్లేనని పాలేరు గ్రిడ్ డీఈ మురళీకృష్ణ చెప్పారు.

ఈ ఊరు మాది.. ఖాళీ చేయండి!

▶ మొదటి పేజీ తరువాయి

ఓటు వేసేవారు. ఐదేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినప్పుడు చమన్‌ఖాన్‌దొడ్డి కూడా నూతన గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రస్తుతం 450 మంది ఓటర్లు ఉన్నారు.

భూమి మొత్తం మాదేనంటూ..

ఇప్పుడు ఈ గ్రామానికి సంబంధించిన భూమి మొత్తం తమదేనంటూ.. ఈ ప్రాంత పూర్వీకుల వారసులుగా చెప్పుకుంటున్న ముగ్గురు వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. వీరికి ఎక్స్‌పార్టీ డిక్రీ ఆర్డర్ వచ్చింది. దీంతో వారు కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఊరు ఖాళీ చేయమంటూ గ్రామస్తులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం మారిన పరిస్థితుల నేపథ్యంలో.. రాజకీయ నాయకులు, పోలీసులు కూడా వారికే దన్నుగా నిలవడంతో స్థానికులు లబోదిబోమంటున్నారు. మేము మూడు తరాలుగా ఇక్కడే ఉంటున్నామని, మా పెద్దలు ఇక్కడే పుట్టి, ఇక్కడే చనిపోయారని.. ఉన్నఫళంగా ఊరు వదిలి పొమ్మంటే ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎస్పీ రితిరాజ్‌కు వినతిపత్రం అందజేశారు.

మరి ప్రభుత్వం ఎలా అభివృద్ధి పనులు చేపట్టింది?!

గ్రామంలో ప్రభుత్వ పంచాయతీ కార్యాలయం, ఐదో తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గ్రామంలో బ్రహ్మంగారి గుడి, కనకదాసు గుడి, దర్గా, మసీదు, పీర్లగుడి, ఆంజనేయస్వామి, శివాలయాలతో పాటు గ్రామ దేవతలైన మారెమ్మ, సుంకులమ్మ, బొడ్రాయి, సావిడి వంటి నిర్మాణాలు ఏళ్ల క్రితమే ఉన్నాయి. అదేవిధంగా గ్రామంలో అంతర్గత రహదారులు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంకులు వంటివి కూడా ప్రభుత్వం ఎప్పుడో ఏర్పాటు చేసింది. గ్రామ కంఠానికి చెందిన భూముల్లో ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు రికార్డులు ఉండగా.. ఇప్పుడు ఎవరో వచ్చి ఈ భూమి తమదే అని ఎలా అంటారని, ఎలా ఖాళీ చేయమంటున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.



ఊరొదిలి పొమ్మంటే ఎలా?



నేను ఈ గ్రామంలోనే పుట్టా. మా తాత, ముత్తాతలు కూడా ఇక్కడే పుట్టి, ఇక్కడే చనిపోయారు. ప్రస్తుతం మా కుటుంబ సభ్యులమే 30 మంది వరకు ఉన్నాం. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాం. అకస్మాత్తుగా ఊరు వదిలిపొమ్మంటే ఎలా కుదురుతుంది?

– భీమయ్య

గ్రామకంఠం కిందే ఉంది..



గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసినప్పుడు అప్పటి తహసీల్దార్ వచ్చి మా ఊరు మొత్తం 9 ఎకరాల వరకు ఉంటుందని చెప్పారు. రెవెన్యూ రికార్డులో భూమి మొత్తం గ్రామ కంఠం కిందే ఉందన్నారు. అలాంటిది మా ఊరి ముఖం ఒక్కసారి కూడా చూడని వారు వచ్చి.. గ్రామం మొత్తం మాదే, ఖాళీ చేసి వెళ్లిపొమ్మంటున్నారు. ఇదెక్కడి న్యాయం?

– ఆంజనేయులు

ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతాం

చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామానికి సంబంధించిన అంశం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. దీనిపై గ్రామస్తులు ఎవరూ ఫిర్యాదు చేయ లేదు. ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– రాంచందర్, ఆర్డీఓ, గద్వాల

నేతన్నలపై ఎందుకీ కక్ష?

▶ మొదటి పేజీ తరువాయి

మూతపడ్డాయి. ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో కార్మికులు రోజూ దీక్షలు, ధర్నాలతో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వంలో చలనం కనిపించడం లేదు. నేత కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరేసుకొని చనిపోవడాన్ని ప్రభుత్వ హత్య గానే కార్మికులు భావిస్తున్నారు'అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

మా పాలనలో రూ. కోట్ల విలువైన ఆర్డర్లిచ్చాం: 'సమైక్య రాష్ట్రంలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్న నేత కార్మికులను ఆదుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. నేతన్నల వేతనాలు రెట్టింపు చేసి గౌరవప్రదమైన జీవితం గడిపేలా చూడటంతోపాటు చేనేత మిత్ర, నేతన్నకు చేయూత వంటి పథకాలను ప్రారంభించాం. బతుకమ్మ చీరల పథకం ద్వారా కార్మికులకు చేతి నిండా పని దొరికింది. బీఆర్ఎస్ హయాంలో రూ.కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చాం. కానీ కాంగ్రెస్ వచ్చాక కార్మికుల జీవితాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తోంది. బతుకమ్మ చీరల ఆర్డర్లకు సంబంధించిన జీవోను విడుదల చేయాలి. యార్న్ సబ్సిడీ విడుదల, చేనేత మిత్ర కొనసాగింపు, పరిశ్రమకు రావాల్సిన రూ. 270 కోట్ల బకాయిల విడుదలకు సంబంధించి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి'అని కేటీఆర్ లేఖలో కోరారు.



పెళ్లి చేసుకుంటే లడ్డూలిస్తా.. 'ఎవరు పెళ్లి చేసుకుంటే వారికి లడ్డూలు ఇస్తా..' అంటూ చిన్నారులను ఆట పట్టించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో కేటీఆర్ గురువారం సాయంత్రం పర్యటించారు. కొత్తపల్లి గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరైనప్పుడు చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు. – గంభీరావుపేట (సిరిసిల్ల)

బార్, బెంచ్ బంధం బలోపేతం చేస్తాం

జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ మౌషుమి భట్టాచార్య • బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ

సాక్షి, హైదరాబాద్: బార్, బెంచ్ బంధం మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ మౌషుమి భట్టాచార్య పేర్కొన్నారు. న్యాయవాదులంతా స్నేహపూర్వకంగా పని చేయడం అభినందనీయమన్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ మౌషుమి భట్టాచార్య అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎ.దీప్తి, ప్రధాన కార్యదర్శులు ఉప్పల శాంతిభూషణ్, జిల్లెల సంజీవ్, జాయింట్ సెక్రటరీ నవీన్‌కుమార్ వాసిరెడ్డి, ట్రెజరర్ శ్రావ్య, అభిలాష్‌తో పాటు అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహ శర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) గాడి ప్రవీణ్‌కుమార్, ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి, జీపీలు తదితరులు పాల్గొన్నారు. కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ మౌషుమి భట్టాచార్య, మధ్యప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ సుజోయ్ పాల్ తెలంగాణ హైకోర్టుకు బదిలీపై వచ్చి ఇటీవల బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.



అభినందన సభలో జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ మౌషుమి భట్టాచార్యతో హెచ్‌సీఏఏ కార్యవర్గం, ఏఏజీ రజనీకాంత్‌రెడ్డి



అనుమతి లేకుండా మందుల తయారీ

- జీడిమెట్లలోని ఓటీడీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో డీసీఏ దాడులు

సాక్షి, హైదరాబాద్: అనధికారికంగా మందులు తయారు చేస్తున్న ఫార్మా కంపెనీపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు దాడులు నిర్వహించారు. జీడిమెట్లలోని ఓవాయిడ్ ఫార్మాకెమ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అనుమతి లేకుండానే మందులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ సోదాల్లో రూ. 23.93 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నట్లు డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు. మొత్తం 19 డ్రమ్ములలోని 87 కిలోల ఇట్రాకోనజోల్, 800 కిలోల యాక్టివేటెడ్ చార్‌కోల్ ఇతర మందులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సాహిల్‌పై లుక్‌అవుట్ నోటీసులు.. సస్పెండ్ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై పోలీసులు జారీ చేసిన లుక్‌ఔట్ నోటీసుల (ఎల్‌ఓసీ)ను కోర్టు సస్పెండ్ చేసింది. అయితే ఈ నెల 19లోగా విచారణాధికారి ముందు లొంగిపోవాలని సాహిల్‌ను ఆదేశించింది. అప్పటివరకు అతన్ని అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. డిసెంబర్‌లో ప్రగతిభవన్ ఎదురుగా ఉన్న బారికేడ్లను ఢీకొట్టిన కేసులో సాహిల్‌పై పంజాగుట్ట పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేశారు. ఏ-1 ఉన్న అతను అప్పటి నుంచి పరారీలోనే ఉన్నాడు. దుబాయ్ పారిపోయి ఉంటాడనే అనుమానాల నేపథ్యంలో అధికారులు సాహిల్‌పై లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. తనపై అధికారులు జారీ చేసిన ఎల్‌ఓసీని రద్దు చేయాలని కోరుతూ సాహిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎల్‌వోసీని సస్పెండ్ చేస్తూ, విచారణను 19కి వాయిదా వేశారు.







"సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా ఆయనకే చెందుతుంది. మరియు పరలోకంలో కూడా సర్వస్తోత్రాలకు అర్హుడు ఆయనే! ఆయన మహా వివేకవంతుడు, సర్వం తెలిసిన వాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 5 ఏప్రిల్ 2024

వృద్ధ జంబూకం 'నాటో'

రెండు ఖండాలను కలుపుతూ ప్రపంచానికి శాంతినీ, సుస్థిరతనూ, రక్షణనూ వాగ్దానం చేస్తూ బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో ఏర్పడిన నాటో కూటమి గురువారం తన 75 వసంతాల సంబరాలను జరుపుకొంది. అయితే ప్రకటిత సంకల్పానికీ, దశాబ్దాల దాని ఆచరణకూ ఎక్కడా పొంతన కనబడదు. నాటో నేపథ్యం, దాని ఉద్దేశాలు పూర్తిగా కొట్టిపారేయదగ్గవి కాదు. ఎందుకంటే రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ నియంత అడాల్ఫ్ హిట్లర్ సైన్యాన్ని మట్టికరిపించిన సోవియెట్ యూనియన్ సేనలు తూర్పు యూరప్ దేశాల్లో తిష్ఠవేసి కదల్లేదు. అవి తమవైపు చొచ్చుకు రావొచ్చన్న సందేహం పశ్చిమ యూరప్ దేశాలకుంది. తాము ఒక్కటై ఎదిరించకపోతే దురాక్రమణకు బలికావటం ఖాయమన్న భయం వాటికి పట్టుకుంది. నాటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ దీన్ని చక్కగా వినియోగించుకుని ఉత్తర అమెరికా ఖండంలో తన పొరుగు దేశమైన కెనడాను కలుపుకొని పశ్చిమ యూరప్ దేశాలతో జతకట్టి పటిష్ఠమైన సైనిక కూటమి నాటోకు అంకురార్పణ చేశారు. సోవియెట్ సేనలకు వ్యతిరేకంగా దృఢమైన సైనిక కుడ్యం ఏర్పర్చటమే దీని ప్రధాన ధ్యేయం. నాటో దేశాలు రోజూ పరస్పరం సంభాషించుకుంటాయని, పరిస్థితులను సమీక్షించుకుంటూ నిరంతర సంసిద్ధతలో వుంటాయని, తగిన నిర్ణయాలు తీసుకుంటాయని నాటో వెబ్‌సైట్ ఘనంగా చెబుతోంది. మంచిదే. కానీ ఇన్నేళ్ల దాని ఉనికిలో ఒక్కసారైనా సోవియెట్ యూనియన్ నుంచీ లేదా దాని ప్రస్తుత రూపమైన రష్యా నుంచీ ప్రత్యక్షంగా కావొచ్చు... పరోక్షంగా కావొచ్చు ఏనాడూ సవాళ్లు ఎదురుకాలేదు. సైనిక కూటమి ఆవిర్భావం దానికదే ప్రత్యర్థిని హద్దు మీరకుండా చేసివుండొచ్చన్న వాదన కూడా కొట్టి పారేయలేం. కానీ నాటో హడావిడి గమనించాక 1955లో సోవియెట్ యూనియన్ సైతం తన ఆధ్వర్యంలోని తూర్పు యూరప్ దేశాలను కలుపుకొని వార్సా కూటమి పేరుతో మరో సైనిక కూటమి నిర్మించింది. ఇరుపక్షాలూ అణ్వాయుధాలనూ, ఇతర భారీ ఆయుధ సామగ్రిని మోహరించటంతో ప్రచ్ఛన్న యుద్ధ దశలో యూరప్ ఖండం మొత్తం నిరంతర యుద్ధ భయంతో వణికింది. మరి ప్రపంచ శాంతి, సుస్థిరతల జాడెక్కడ?

పరస్పర మోహరింపులతో నెలకొన్న ఒక రకమైన స్తబ్దతను శాంతిగా భావించటం సాధ్యమేనా? నాటో అంచనాకు తగ్గట్టు సోవియెట్ సేనలు దండయాత్రలు చేయకపోలేదు. 1956లో హంగరీ, 1968లో జెకొస్లొవేకియా, 1979లో అఫ్గానిస్తాన్ దేశాలను అవి దురాక్రమించాయి. కానీ యూరప్ ఖండంలోని తటస్థ దేశాలు ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, స్వీడన్, యుగోస్లేవియా, ఆస్ట్రియా వైపుగానీ... నాటో దేశాలవైపుగానీ చొచ్చుకొచ్చే ఆలోచన చేయలేదు. నిజానికి తాను కూడా నాటోలో చేరతానన్న సోవియెట్ యూనియన్ వినతిని 1954లో తోసిపుచ్చాకే వార్సా కూటమి ఏర్పడింది. 1989లో సోవియెట్ పతనం, అంతకుముందే తూర్పు యూరప్ దేశాలు ఒక్కొక్కటిగా దాన్నుంచి దూరం జరగటం, వార్సా కూటమి కనుమరుగవటం వంటి పరిణామాల తర్వాత వాస్తవానికి నాటో అవసరం ఎంతమాత్రం లేదు. చిత్రం ఏమంటే... సోవియెట్ పతనానికి బాటలు పరిచిన నాటి అధ్యక్షుడు గోర్బచెవ్, ఆ తర్వాతకాలంలో ప్రస్తుత రష్యా అధ్యక్షుడు పుతిన్ సైతం నాటోలో చేరటానికి సిద్ధపడ్డారు. కానీ ఆ ప్రతిపాదనను నాటో తోసిపుచ్చింది. అంతేకాదు... ఉభయ జర్మనీల విలీనానికి సహకరించాలంటూ పశ్చిమ యూరప్ దేశాల నేతలు గోర్బచెవ్‌ను అర్థించినప్పుడు ఆయనకొక హామీ ఇచ్చారు. నాటోను ఒక్క అంగుళం కూడా విస్తరించబోమన్నదే ఆ హామీ సారాంశం. కానీ జరిగిందంతా అందుకు విరుద్ధం. సోవియెట్ పతనం నాటికి నాటో సభ్య దేశాలు 16 కాగా, రష్యా అభ్యంతరాలనూ బేఖాతరు చేస్తూ మరో 15 దేశాలను చేర్చుకున్నారు. ఇందులో పూర్వపు వార్సా కూటమి దేశాలున్నాయి. కనీసం తన ఇరుగు పొరుగు దేశాలకు సభ్యత్వం ఇవ్వొద్దన్న రష్యా ప్రతిపాదన సైతం బుట్టదాఖలా అయింది. పొరుగునున్న కెనడా, మెక్సికో దేశాలకు వార్సా కూటమి సభ్యత్వం ఇస్తే అమెరికా చూస్తూ ఊరుకుంటుందా? నాటో పుట్టుకకు దారితీసిన మూలకారణమే మాయమైనప్పుడు విశాల యూరప్ భద్రత కోసం ఒక నూతన వ్యవస్థ ఏర్పాటు చేయటానికి బదులు రష్యాను ఏకాకి చేయాలన్న వ్యూహం వెనకున్న విజ్ఞతేమిటో ఆ కూటమి నేతలు చెప్పగలరా? నిజానికి నాటో చిత్తశుద్ధితో విశాల యూరప్ భద్రతపై దృష్టి సారించివుంటే పుతిన్ ఉక్రెయిన్ దురాక్రమణకు సాహసించేవారు కాదు. యూరప్ ఖండంలో అణ్వాయుధాల బెడద పూర్తిగా సమసిపోయేది.

అసలు ప్రపంచ శాంతి, సుస్థిరతలకు దోహదం కలగటం మాట అటుంచి నాటో వల్ల ప్రపంచానికి వచ్చిన సమస్యలే అధికం. ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకూ 200 సైనిక ఘర్షణలు చోటు చేసుకోగా అందులో 20 వరకూ విస్తృతమైనవి. వెళ్లినచోటల్లా విధ్వంసమే తప్ప నాటో సాధించిందేమీ లేదు. ఇందుకు లిబియా, సిరియా, అఫ్గానిస్తాన్, సూడాన్, సోమాలియా వగైరాలను ఉదాహరించవచ్చు. స్థానిక ప్రభుత్వాలను కూలదోసేందుకు విచ్చలవిడిగా మిలిటెంట్ సంస్థలకు నాటో ఆయుధాలందించటం పర్యవసానంగా ఐసిస్ అనే భయంకర ఉగ్రవాద సంస్థ పురుడుపోసుకుంది. కనిపించని శత్రువుపై కత్తి ఝుళిపించటం కోసం నాటో సభ్యదేశాల్లో ప్రతి ఒక్కటీ తమ జీడీపీల్లో 2 శాతం నాటోకు అర్పిస్తున్నాయి. తన ఉనికి కోసం శత్రువును 'సృష్టించుకునే' ధోరణి నుంచి నాటో బయటపడనంతకాలం ఈ పరిస్థితి మారదు. ప్రపంచంలో శాశ్వత శాంతి కోసం ప్రయత్నించటమా... నిరంతరం యుద్ధ భయంతో అణ్వాయుధాల నీడలో మనుగడ సాగించటమా అన్నది యూరప్ దేశాల ప్రజలే తేల్చుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.9.55 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ధనిష్ఠ ప.3.05 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.9.49 నుండి 11.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.21 నుండి 9.09 వరకు,తదుపరి ప.12.28 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.5.56 నుండి 6.47 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

తెలంగాణకు జలాభిషేకం

అభిప్రాయం


తన్నీరు హరీష్ రావు

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో చరిత్రాత్మకమైన పాత్ర పోషించిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే సంతృప్తితో చల్లబడలేదు. గోదావరి – కృష్ణమ్మలను మళ్లించి తెలంగాణకు జలాభిషేకం చేయాలని 'సమగ్ర సమీకృత సాగునీటి వ్యవస్థ' నిర్మాణానికి ఎంతో పట్టుదలతో, నిబద్ధతతో కష్టపడ్డారు. వీలైనంత త్వరగా అప్పులు, ఆత్మహత్యలు, వలసల బాధల నుంచి తెలంగాణ రైతాంగాన్ని బయట పడేయాలనే లక్ష్యంతో, తపనతో కేసీఆర్ నిపుణులైన ఇంజినీర్లు, కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే 'వ్యాప్కోస్' సహకారంతో ప్రాజెక్టులకు అవసరమైన రీ–డిజైనింగ్ చేశారు. ఫలితంగా కోటి ఎకరాలకు నీరు అంది తెలంగాణ అన్నపూర్ణగా మారింది. ఇది ఎవరూ చెరపలేని, చెరిగిపోని చరిత్ర!

ప్రజలిచ్చిన తీర్పుతో ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన రేవంత్ రెడ్డి తొలి వంద రోజుల పాలనలో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ఏ గతి పట్టించారో, ఏ విధానాలను అనుసరిస్తున్నారో... తెలంగాణ పల్లెల్లో ఎండుతున్న పొలాలు, అడుగంటుతున్న భూగర్భ జలాలు సజీవ సాక్ష్యాలుగా మన కండ్లకు కనిపిస్తున్నాయి. జీవితకాలంలో చూడలేమనుకున్న సజీవ గోదారి మళ్లీ ఎండిపోయింది. ఏడాది కిందట మండుటెండల్లోనూ నిండుకుండలైన చెరువులు అలుగు దుంకుతున్న దృశ్యాలు మనమింకా మరువనేలేదు. అప్పుడే ఎండి నెర్రెలు బారిన చెరువులు, కుంటలు మనల్ని వెక్కిరిస్తున్నాయి. నిండుగా నీళ్ల పారిన కాల్వలు, వాగుల్లో మళ్లీ పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. దినపత్రికలు తెరవగానే రైతుల ఆత్మహత్యల వార్తలు మనం చూస్తున్నాం. తమను రాజుగా చూడాలని కేసీఆర్ కల్పించిన 'భరోసా' ప్రస్తుత పాలకుల బుద్ధిహీనత మీ 'యాది'గానే మిగిలి 'మనాది'తో లక్షలాది రైతులను మరోసారి వలసబాట పట్టిస్తున్నది. ఎన్నో ఆశలతో లక్షల ఎకరాల్లో నాట్లేసుకున్న తెలంగాణ రైతులకు యాసంగి గోసనే మిగిల్చి, రానున్న ఉగాది చేదు రుచితోనే పచ్చడి పంచబోతున్నది.

తన ప్రాణాలనే పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో చరిత్రాత్మకమైన పాత్ర పోషించిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే సంతృప్తితో చల్లబడలేదు. విజయగర్వంతో విరామాన్ని కోరుకోలేదు. నెత్తురు పారిన నేలపై హరితవనాలు మొలిపించాలని, గోదావరి, కృష్ణమ్మలను మళ్లించి తెలంగాణకు జలాభిషేకం చేయాలని 'సమగ్ర సమీకృత సాగునీటి వ్యవస్థ' నిర్మాణానికి ఎంతో పట్టుదలతో, నిబద్ధతతో కష్టపడ్డారు. సాగునీటి శాఖ మంత్రిగా ఉన్న నాపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిపిన బాధ్యత ఎంత ముఖ్యమైనదో తెలంగాణ రాష్ట్ర తొలి క్యాబినెట్‌లో నాకర్థమైంది. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కేసీఆర్ ప్రతి ఏడాది బడ్జెట్‌లో సింహభాగం నిధులను సాగునీరు–వ్యవసాయ రంగానికి కేటాయించి, ఖర్చు చేశారు. వీలైనంత త్వరగా అప్పులు, ఆత్మహత్యలు, వలసల బాధల నుంచి తెలంగాణ రైతాంగాన్ని బయట పడేయాలనే లక్ష్యంతో, తపనతో కేసీఆర్ నిపుణులైన ఇంజినీర్లు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే 'వ్యాప్కోస్' సహకారంతో ప్రాజెక్టులకు అవసరమైన రీ–డిజైనింగ్ చేశారు.

తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే తెలంగాణ పునర్నిర్మాణానికి సుమారు 14 ఏండ్లుగా తన మదిలో రూపుదాల్చిన 'మిషన్ కాకతీయ', 'మిషన్ భగీరథ' వంటి పథకాలెన్నింటినో అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. అవసరమైన నిధులను సమీకరించారు. అప్పటికే పెండింగ్‌లో ఉన్న పాలమూరు ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయడానికి, వాటి ఆయకట్టును మరింత పెంచడానికి నిర్ణయం తీసుకున్నారు. ఎగువ నుంచి నదుల్లో



నీళ్లు రాని ప్రాజెక్టుల కింది ఆయకట్టు స్థిరీకరణకు ప్రణాళికలను సిద్ధం చేశారు. కృష్ణా, భీమా, గోదావరి, మంజీరా నదులు, వాటి ఉపనదులు ప్రారంభమైన మహారాష్ట్రలో, అవి ప్రవహిస్తున్న కర్ణాటక రాష్ట్రంలో వందలాది బ్రిడ్జి కమ్ బ్యారేజీలను నిర్మించి నిల్వ చేసే నీటిని ఇరుపక్కలా వందలాది ఎకరాల ఆయకట్టుకు ఎత్తిపోసే పథకాలను 2014కు పూర్వమే నిర్మించుకున్నారు. ఈ పరిస్థితి వల్ల ఆ యా నదుల నుంచి నాలుగేండ్లకోసారి తప్ప మన రాష్ట్ర సరిహద్దుల వరకు నీటి ప్రవాహాలు నిలిచిపోయాయి. ఈ విషయాలను శాసనసభ్యులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసెంబ్లీలో కేసీఆర్ వివరించారు.

శతాబ్దాలుగా రాజులు, రైతులు, నిరక్షరాస్యులు, నీరడిల సహాయంతో నిర్వహిస్తూ వచ్చిన గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ మనది. సుమారు 75 వేలకు పైగా ఉన్న జలాశయాలు (చిన్న, పెద్ద) 46 వేలకు పడిపోయాయి. వీటి పునరుద్ధరణే తొలి ప్రాధాన్యంగా భావించిన కేసీఆర్ 'మిషన్ కాకతీయ' పథకాన్ని ప్రారంభించి, నాలుగేండ్లలో విజయవంతంగా అమలు చేశారు. ఫలితంగా భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి ఏనాడో ఎండిపోయిన బావులు, బోర్లలోకి మళ్లీ ఊటలు పారాయి. దోసెడు నీళ్ల కోసం కోసెడు దూరం వరకు అక్కాచెల్లెళ్లు తాగునీటి కోసం పోయే దుఃస్థితిని రూపుమాపి, ఇంట్లోనే నల్లా కింద నీళ్లు పట్టుకునే విధంగా కోట్లాది ప్రజల దాహార్తిని తీర్చింది మిషన్ భగీరథ పథకం. రాష్ట్రంలోని పెద్ద చెరువులు, రిజర్వాయర్ల నీటిని, లక్షన్నర కిలోమీటర్ల పొడవైన పైపులను గ్రామీణ తెలంగాణలోని లక్షలాది ఇండ్ల దాకా తెచ్చి తాగునీటిని అందించిన ఘనత కేసీఆర్‌దే.

'కాళేశ్వరం', 'పాలమూరు – రంగారెడ్డి' వంటి భారీ ఎత్తిపోతల పథకాల ద్వారానే కాకుండా 242 చిన్ననీటి ఎత్తిపోతల పథకాల కింద గడచిన తొమ్మిదిన్నరేండ్లలో కొత్తగా 69,000 ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించి, 1.435 లక్షల ఎకరాలను స్థిరీకరించారు. అన్ని జిల్లాల్లో భూగర్భ జలాలు సుమారు 5–8 మీటర్ల వరకు పెరిగాయి.

మిషన్ కాకతీయ పథకంలో చెరువుల పునరుద్ధరణ, వాగులపై సుమారు రూ. 5,000 కోట్లతో 1,235 చెక్ డ్యామ్‌ల నిర్మాణం, కాళేశ్వరం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పూర్తి చేసిన కల్వకుర్తి వంటి ప్రాజెక్టుల ద్వారా చెరువులు, చెక్ డ్యామ్‌లలోకి నీటిని విడుదల చేయడం వల్లనే భూగర్భ జలాలు పెరిగాయనేది స్పష్టం. కొన్ని చెక్ డ్యామ్‌ల లోపల రీఛార్జింగ్ బోర్లు కూడా వేశారు. మిషన్ కాకతీయ ద్వారా పునర్వైభవాన్ని పొందిన సుమారు 5,000కు పైగా చెరువుల్లో ఏటా కోట్లాది చేప పిల్లలను గత ప్రభుత్వం వదిలేది. చేపల అమ్మకాల ద్వారా రూ. 3,000 కోట్ల ఆదాయం వచ్చిందని మత్స్యశాఖ అంచనా.

సీఎంగా బాధ్యతలు చేపట్టగానే 'కోటి ఎకరాల మాగాణం–నా స్వప్నం' అని ప్రకటించిన కేసీఆర్ గతంలో నిర్మించిన, నిర్మాణంలో ఉన్న, నిర్మించాలనుకున్న ప్రాజెక్టుల కింద ఒక కోటి 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సంకల్పించారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో 75.10 లక్షల ఎకరాలకు నికరంగా సాగునీరు అందించగలిగింది కేసీఆర్ ప్రభుత్వం. బోర్లు, బావుల కింద సాగైన ఆయ కట్టు కలిపితే కోటి ఎకరాల మాగాణంలో పంటలు పండాయి.

కేవలం సాగునీరు ఇస్తేనే రైతుల ఆత్మహత్యలు ఆగిపోతాయని కేసీఆర్ భ్రమపడలేదు. సాగునీరు 80–90 శాతం అందుబాటులో ఉన్న హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో కూడా రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్న సంగతి కేసీఆర్‌కు తెలుసు. అందుకే రైతుగా తన అనుభవాలు, నేర్చుకున్న గుణపాఠాలను విశ్లేషించుకుని.. వ్యవసాయ శాస్త్రవేత్తలను, రైతు నాయకులను, ప్రజాప్రతినిధులను, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి 'రైతుబంధు', 'రైతు బీమా' వంటి పథకాలను దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టారు. పంటలకు మార్కెటింగ్ సౌకర్యాలనూ, గిట్టుబాటు ధరలనూ కల్పించారు. నీటి తీరువాను రద్దు చేశారు. రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందించారు. ఫలితంగా రైతులకు బతుకుపై ఒక భరోసా ఏర్పడింది. ఆత్మహత్యలు బాగా తగ్గాయి. 'వ్యవసాయం దండుగ' అని అనుకున్న పరిస్థితి మారిపోయి హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా నగరం పొలిమేరల్లో భూమి కొనుక్కొనో, కౌలుకు తీసుకొనో... శని, ఆదివారాల్లో వ్యవసాయం చేసుకుంటున్నారంటే అది కేసీఆర్ పాలన ఫలితమే. రైతును రాజుగా చూడాలనుకున్న కేసీఆర్ ప్రస్థానానికి మధ్యలో కొద్దిగా విరామం వచ్చిందే తప్ప, ఇది విరమణ కాదు. ప్రతిపక్ష నాయకునిగా రైతుల పట్ల తనకున్న బాధ్యతను నిర్వర్తిస్తూనే, లక్ష్యసాధన దిశగా కేసీఆర్ ముందుకు సాగుతూనే ఉంటారు. విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ఆయనకు బాసటగా ఉంటూ, అనుసరిస్తూనే ఉంటారు. తెలంగాణ రాష్ట్ర సాధన, పునర్నిర్మాణం ఈ రాష్ట్ర ప్రజల విజయగాథ. అసత్యాలతో, అబద్ధాలతో మాసిపోని, ముగిసిపోని ముక్కోటి ప్రజల త్యాగాల, పోరాటాల చరిత్ర నవతరం మదిలో మారుమోగాలి.

వ్యాసకర్త రాష్ట్ర మాజీ మంత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



అరుదే కదా!



పోలీస్ స్టేషన్‌లో కూర్చుని ఉండగా, ఒక అధికారి నేనెవరినని అడిగారు. మహిళలు అక్రమంగా బనాయించిన కేసుల్లో మగవాళ్ల తరఫున పోరాడుతానని చెప్పగానే, దాదాపుగా కుర్చీలో ఎగిరిపడి, వెంటనే నా నంబరు అడిగి తీసుకున్నారు. 'మేడమ్! మహిళల కోసం పోరాడేవాళ్లను ఎందరినో చూశాను గానీ, మగవాళ్ల కోసం పోరాడేవాళ్లను మొదటిసారి చూస్తున్నా' అన్నారు.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, యాక్టివిస్ట్

స్నేహితులంటే...



మంచి స్నేహితులు దిండ్లవంటి వారు – మనం అలసిపోయినప్పుడు వాటి మీద విశ్రాంతి తీసుకోవచ్చు, బాధగా ఉన్నప్పుడు వాటి మీద కన్నీళ్లు జారవిడువొచ్చు, కోపంగా ఉన్నప్పుడు వాటిని కొట్టొచ్చు, సంతోషంగా ఉన్నప్పుడు హత్తుకోవచ్చు.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

చిన్నవైతేనే...



స్క్రీన్ ఎంత పెద్దదిగా ఉన్నప్పటికీ, ఫోన్‌లో ఎక్కువ మ్యాటర్ టైప్ చేయాలంటే నాకు ఇబ్బందిగా ఉంటుంది. ఇక అది ఇంగ్లీష్ కాని అక్షరాలైతే ఇంకా కష్టం.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

వాళ్ల అభిప్రాయలే ముఖ్యం



అసహనం అని ఎక్కువగా అరిచేవాళ్లే, ఇతరుల అభిప్రాయాల పట్ల ఎక్కువగా అసహనంగా ఉంటారని 'ఎక్స్' వేదికగా జరిగే వాదనలు మరోసారి పునరుద్ఘాటిస్తుంటాయి.

– నందితా అయ్యర్, రచయిత్రి

అదే రాజకీయం



ఐటీ పరిశ్రమలోని 35–45 వయసు వారిలో చాలామందిలో బీపీ, మధుమేహం, బరువు సమస్యలు, డిప్రెషన్ లాంటివి చూస్తుంటాను. 50 ఏళ్ల తర్వాత కూడా కొంతమందే చురుగ్గా ఉండగలుగుతారు. రాజకీయాలు చాలా కఠినతరమైనవి. ప్రయాణాలు, టెన్షన్, డబ్బులు, విచారణలు... అయినా చాలామంది 70ల దాకా బతుకుతారు. కొందరు 90ల దాకా కూడా! ఏంటి వాళ్ల రహస్యం?

– కిరణ్ కుమార్ ఎస్., వ్యాఖ్యాత

ప్రశ్నించే వైఖరి



రాజకీయ నాయకులు, రాజకీయాల మీద సామాన్య మానవుడి దృక్పథాన్ని సోషల్ మీడియా మార్చేసింది. కనీసం తమిళనాడు వరకు ఇది నిజం. జనాలు ఆగ్రహంతో ఉన్నారు. ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నారు. నాయకుల రిక్త వాగ్దానాలను నమ్మడానికి ఎంతమాత్రమూ సుముఖంగా లేరు. అన్ని పార్టీల మీద చాలాచోట్ల నిరసన కనబడుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

నియంత్రణ లేకుండానా?



ఎక్కువమంది పెద్దవాళ్లే తమ స్మార్ట్‌ఫోన్లనూ, సామాజిక మాధ్యమాల సంబంధ వ్యసనాలనూ, ఉద్వేగాలనూ నియంత్రించుకోలేరని అర్థమవుతున్నప్పుడు... ఏకంగా చిన్న పిల్లలకు వాటిని ఏ నియంత్రణలూ లేకుండా అందుబాటులో ఉంచడం అనే ఆలోచన నాకు పిచ్చితనంలా కనబడుతుంది.

– జూజీ, ర్యాపర్

వైజ్ఞానిక వేగుచుక్కలు

ఆధునిక భారత్‌లో తొలి వైద్యురాలు

బ్రిటిష్ సంతతికి చెందిన మేరీ స్కర్లీబ్ బ్రిటిష్ ఇండియాలో మొదటి వైద్యురాలుగా సేవలందించారు. 19 ఏళ్ల వయసులో విలియమ్ స్కర్లీబ్‌ను ప్రేమించి పెండ్లాడారు. భర్త ఇండియాలో ఉద్యోగం చేస్తుండడంతో 1865 డిసెంబర్‌లో మద్రాసు వచ్చేశారు. భారత్‌లో ప్రసూతి సమయంలో స్త్రీల అనారోగ్యం, పురిట్లో తల్లుల మరణాల వంటివాటిని చూసి మంత్రసానిగా శిక్షణ పొందాలని భావించారు. ఇంతలో 1875లో మద్రాసులో మెడికల్ కాలేజీ పెట్టారు. తొలుత అడ్మిషన్ పొందిన నలుగురు మహిళల్లో మేరీ ఒకరు. అలా మూడు సంవత్సరాల కోర్సు 'లైసెన్సియేట్ ఇన్ మెడిసిన్ సర్జరీ మిడ్ వైఫరీ' పూర్తి చేశారు.


మేరీ స్కర్లీబ్

తరువాత లండన్ తిరిగి వెళ్లి మెడిసిన్‌లో డిగ్రీ చేసి రావాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయం వెనక కీలకమైన విషయమేమిటంటే తర్వాత కాలంలో భారతదేశంలో స్త్రీలు మాత్రమే వైద్య సేవలందించే వ్యవస్థల ఏర్పాటుకు దోహదం చేయాలనేది. అదే సమయంలో ఇతర ప్రాంతాల్లో, దేశాల్లో వైద్య సేవలు అందించే రీతిలో శిక్షణను ఇచ్చే సంస్థలు కూడా లండన్‌లో ప్రారంభమయ్యాయి. 1878లో లండన్ రాగానే మేరీ, డాక్టర్ ఎలిజబెత్ గ్యారెట్ ఆండర్సన్‌ను కలిశారు. 1877 దాకా ఈమె ఒక్కరే లండన్‌లో క్వాలిఫైడ్ వైద్యురాలు. అంతేకాదు అప్పటికే (1874) 'లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ వుమన్' ప్రారంభించి ఉన్నారు. 37 ఏళ్ల వయసులో మేరీ 1882 నవంబర్‌లో 'బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ సర్జరీ' ఆనర్స్ డిగ్రీ కోర్సును గోల్డ్ మెడల్‌తో పూర్తి చేశారు. అంతే కాకుండా అనతి కాలంలోనే సర్జరీకి సంబంధించి వియన్నా నగరంలో పురుషులు చేసే కోర్స్‌ను కూడా పూర్తి చేశారు. పిమ్మట భారతదేశానికి తిరిగి ప్రయాణం అవుతూ క్వీన్ విక్టోరియాను కలిసి భారత దేశంలో స్త్రీల ఆరోగ్యం, ప్రసూతి సమయంలో వారికి అందించాల్సిన తోడ్పాటు గురించి ఎలిజబెత్ బెల్చేతో కలిసి చర్చించారు. ఈ చర్చే తర్వాతికాలంలో ఇండియాలో 'డఫ్రిన్ ఫండ్' రావడానికి కారణమైంది.

1883లో మద్రాస్ తిరిగి వచ్చిన మేరీ స్కర్లీబ్ మద్రాస్ మెడికల్ కళాశాలలో 'మిడ్ వైఫ్రీ', 'గైనకాలజీ'లో లెక్చరర్‌గా బాధ్యతలు స్వీకరించి ఐదేళ్లపాటు ఆ విభాగాలలో ఎగ్జామినర్‌గా కూడా సేవలు అందించారు. 1888లో యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లో చేరి మెడిసిన్‌లో ఎమ్‌డీ చేయడమే కాకుండా, ఎలిజబెత్ గ్యారెట్ అండర్సన్ హాస్పిటల్ లో సీనియర్ సర్జన్‌గా 1889 నుంచి ఓ దశాబ్దిన్నర కాలంపాటు సేవ చేశారు. కృత్రిమ సంతాన నిరోధం, విడాకులకు సంబంధించి మేరీ స్కర్లీబ్ చాలా స్పష్టమైన అభిప్రాయాలు కలిగి ఉండేవారు. అలాగే ఫెమినిజానికి సంబంధించి కూడా ఆమె చాలా లోతైన కృషి చేశారు. 'రెమినిసెన్సెస్' పేరున 1924లో ఆటోబయోగ్రఫీ రాయడమే కాకుండా, 'ఏ ఉమెన్స్ వర్క్స్ టు ఉమెన్', 'ది మదర్స్ గైడ్ టు ది హెల్త్ అండ్ కేర్ ఆఫ్ చిల్డ్రన్' వంటి రచనలు కూడా చేశారు. 85 ఏళ్ల వయసులో 1930 నవంబర్ 21న లండన్‌లో ఆమె కన్నుమూశారు.

– డా।। నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి । 94407 32392

పేదలు పణంగా బాబు రాజకీయం

రాజకీయాల్లో వ్యూహాలు – ప్రతి వ్యూహాలు, ఎత్తుకు పైఎత్తులు వేయటం, ప్రత్యర్థిని దెబ్బతీసి తాము అధికార పగ్గాలు చేపట్టాలనుకోవటం సహజం. దీని కోసం కొంతమంది స్ట్రైట్ పాలిటిక్స్ చేస్తే మరి కొంతమంది నాయకులు వెన్నుపోట్లు, కుట్రలు, కుతంత్రాలతో రాజకీయం చేస్తారు. ఇవి కూడా చర్చనీయాంశమే అయినా... పవర్ కోసం కొట్లాట రాజకీయ పార్టీలు, రాజకీయ ప్రత్యర్థుల మధ్య ఉండటం వరకు సమర్థించవచ్చు. కాని స్వార్థం హద్దులు దాటి అధికారం కోసం, ప్రత్యర్థిని దొంగ దెబ్బ తీయటం కోసం ప్రజల ప్రాణాలను సైతం పణంగా పెట్టాలనుకోవటం, బలహీన వర్గాల ప్రజలతో చెలగాటం ఆడే కుట్రలు... ఏ మాత్రం సహించదగినవి కాదు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కూటమి ఇప్పుడు ఇటువంటి ప్రమాదకర రాజకీయ క్రీడకు తెర తీశారు.

వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, తీవ్ర అనారోగ్యగ్రస్థులకు వారి ఇంటి దగ్గరే వాలంటీర్లు పెన్షన్ అందించే విధానాన్ని చంద్రబాబు అడ్డుకున్నారు. తన జేబులోని మనిషి, తన సామాజిక వర్గానికి చెందిన నిమ్మగడ్డ రమేష్ కుమార్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి వాలంటీర్లు పెన్షన్లను లబ్ధిదారులకు పంచకూడదని ఫిర్యాదు చేయించారు. వీరి ఫిర్యాదుకు అనుగుణంగా ఈసీ ఆదేశాలు ఇవ్వటంతో ఇప్పుడు 66 లక్షల మంది పెన్షనర్లు మూడు నెలల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది.

రాష్ట్ర చరిత్రలో, బాబు హయాంలో పెన్షన్ల కోసం ప్రభుత్వ ఆఫీసుల వద్ద పండుటాకులు ఎలా పడిగాపులు పడేవారో పత్రికల్లో ఫోటోలతో సహా వార్తలు నిత్యం వస్తూ ఉండేవి. వారం, పది రోజుల పాటు చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది ఆ రెండు వందల రూపాయల పెన్షన్ కోసం. పూట గడవని స్థితిలో బడుగు బలహీన వర్గాలకు చెందిన అవ్వా తాతలు అలానే అంతటి కష్టాన్నీ భరించేవారు. కాస్త కాలు చేయి బాగానే ఉన్నవారు సరే. మరి మంచాన పడిన వారు, నాలుగడుగులు కూడా వేయలేని వారు, ఆసరా లేకుండా నిలబడ



లేని వారి పరిస్థితిని ఊహించగలమా?

జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్షలాది మంది నిస్సహాయులను ఇటువంటి దుఃస్థితి నుంచి బయటపడేశారు. పెన్షన్ కోసం మంచం దిగాల్సిన అవసరం రాకుండా సగౌరవంగా వాలంటీర్లే లబ్ధి దారుల ఇళ్ళకు వెళ్ళి అవ్వా, తాతల చేతుల్లో పెట్టే విధంగా వాలంటీర్–సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చారు. అది కూడా ఫస్ట్ తేదీనే, కోడి కూయక ముందే! ఇప్పుడు అక్షరాల 3 వేల రూపాయల పెన్షన్ 66 లక్షల మందికి అందుతోంది. వృద్ధులనే కాదు వికలాంగులు, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్థులు, క్యాన్సర్ వంటి తీవ్ర రోగాల పాలైన వారిని కూడ ప్రభుత్వం పెన్షన్ ఇచ్చి ఆదుకుంటోంది. గంటల కొద్దీ క్యూ లైన్లలో నిలబడేందుకు వీరి ఆరోగ్యం సహకరించదు. ఓ వైపు మండుతున్న ఎండలను తట్టుకునే శక్తీ ఉండదు. చంద్రబాబు చేసిన కుట్ర వల్ల మంచాన పడిన వారు కూడా పెన్షన్ కోసం సచివాలయం చుట్టూ తిరిగాల్సిన దుఃస్థితి ఏర్పడింది.

వాలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు ఉన్న భయం, ఆక్రోశం ఇవాళ్టిది కాదు. గత రెండు, మూడేళ్ల నుంచి రాష్ట్ర ప్రజలు చూస్తూనే ఉన్నారు. పట్టుమని పాతికేళ్లు నిండని ఈ పిల్లలను రెడ్ లైట్ ఏరియాకు మహిళలను సరఫరా చేసే బ్రోకర్లుగా, హ్యూమన్ ట్రాఫికర్లుగా, దొంగలుగా పవన్, చంద్రబాబు మొన్నటి వరకు చిత్రించిన విషయాన్ని ఎవరూ మరచిపోలేదు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి చేసిన మంచి వల్ల ప్రజలంతా జగన్‌కే మళ్లీ పట్టం కడతారన్న ఆందోళనతోనే చంద్రబాబు ఇంతటి క్రూరమైన క్రీడకు తెర తీశారు. దీని ద్వారా చంద్రబాబు రెండు విషయాలపై స్పష్టత ఇచ్చారు. రెండున్నర లక్షల మందికి పైగా ఉన్న వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయటం మొదటి లక్ష్యం. బడుగు బలహీన వర్గాలకు చెందిన పండుటాకులనూ, నిస్సహాయులనూ మళ్లీ రోడ్డున పడవేసి పెత్తందారీ, దురహంకారపూరిత ఆనందాన్ని పొందటం రెండో లక్ష్యం. వృద్ధులు, నిస్సహాయులను క్షోభ పెడితే ఆ పాపం ఊరకనే పోదు. ఇది నిజం!

– ఆర్ఎస్

ఉండాల్సిన శుద్ధి

ఈ వ్యాపార యుగంలో మనసు ఒకలా చెప్పుంటే, మాటను మరోలా వ్యక్త పరుస్తాం. చెప్పిన మాటకు కూడా విరుద్ధంగా పని చేస్తాము. ఇలా కాకుండా మనసు, మాట, పని ఒకే విధంగా ఉండటాన్ని త్రికరణ శుద్ధి అంటారు. అంటే మనసులో ఏముందో అదే మాటల్లోనూ చెప్పాలి; మాటల్లో ఏది వ్యక్తం చేశామో అదే మన చేతల్లో కూడా ఉండాలి.

జ్యోతిర్మయం

ఇప్పటి ఈ సమాజంలో ఇలా బతకడం చాలా కష్టంగానే ఉందని చాలామంది భావిస్తుంటారు. కానీ–

యథా చిత్తం తథా వాచో యథా వాచస్తథా క్రియా!

చిత్తే వాచి క్రియాయాం చ సాధూనా మేకరూపతా!!

సజ్జనులు మనసా వాచా కర్మణా ఒకే భావాన్ని కలిగి ఉంటారు అని పూర్వీకులు చెప్పారు. కానీ మనం లౌకిక వ్యవహారాల్లో మన మనసుపై ముసుగు వేసి మెలుగుతాము. ఉన్నది ఉన్నట్టు చెపితే బంధాలు పోతాయి అని భయపడతాము. మనసుపై, మాటలపై, పనులపై మనం వేసుకున్న ముసుగులు అవతలి వారికి తెలిసీ వారూ అలాగే ఉండటం దౌర్భల్యం. త్రికరణ శుద్ధి లేకుండా స్వార్థంతో జీవించడమే సమాజ పతనానికి కారణం.

– ధనిష్ఠ

క్లుప్తంగా...

ఎన్‌కౌంటర్ మృతుల్లో ఐదుగురి గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లేంద్రం – కొర్చేలి అటవీ ప్రాంతంలో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన 13 మంది మావోయిస్టుల్లో పోలీసులు ఐదుగురిని గుర్తించారు. వారిలో పీఎల్‌జీఏ కంపెనీ నంబర్–2కు చెందిన పీపీసీఎం (ఏరియా కమిటీ సభ్యుడి స్థాయి) సుక్రం హేమ్లా, మిలిటరీ సభ్యులు హుంగా పార్శీ, హుంగా కుంజం, సీతక్క, దూలా సోను ఉన్నారు. మృతదేహాలను గురువారం బీజాపూర్ జిల్లా పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎఫ్‌బీఓతో గొత్తికోయల ఘర్షణ


బానోత్ పూర

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చింతలపాడులో ఫారెస్టు బీట్ ఆఫీసర్ బానోత్ పూరతో గురువారం వలస గొత్తికోయలు ఘర్షణకు దిగారు. ఈ సందర్భంగా ఆయనపై దాడికి పాల్పడ్డారు. విధి నిర్వహణలో భాగంగా పూర.. ధర్మన్ననగర్ శివారు అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. అక్కడ వలస ఆదివాసీ సోడె చుక్కయ్య, మరో ఇద్దరు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి కుంటలో ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేసి కూరగాయలు సాగు చేస్తున్నారు. దీంతో అడవిలోని నీళ్ల వాడకూడదని, ఆయిల్ ఇంజన్ తీసేయాలని ఎఫ్‌బీఓ సూచించగా.. వారి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఎఫ్‌బీఓ తిరిగివస్తూ బైక్ ఎక్కుతుండగా చుక్కయ్య వెనక నుంచి వచ్చి పారతో ఆయన తలపై బలంగా కొట్టాడు. అక్కడి నుంచి తప్పించుకున్న పూర, ధర్మన్న నగర్ వచ్చి ఫారెస్ట్ సెక్షన్ అధికారి (ఎఫ్ఎస్ఓ) నాగేశ్వరరావుకు విషయం తెలిపారు. రక్తమోడుతున్న పూరను కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా తలలో ఎముక చిట్లిందని, రక్తం గడ్డ కట్టిందని వైద్యులు తెలిపారు. దీంతో అతడిని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

తరగతి గదిలోనే ఉరివేసుకుని..

- ఉపాధ్యాయుడు మందలించడంతో గురుకుల విద్యార్థి బలవన్మరణం


వివేక్

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయుడు మందలించడంతో మనోవేదనకు గురైన ఓ విద్యార్థి తరగతి గదిలోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం..నాదర్‌గుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కూకట్‌పల్లికి చెందిన డి.వివేక్ (15) 9వ తరగతి చదువుతున్నాడు. వివేక్ తండ్రి కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో విద్యార్థి ఉపాధ్యాయుల అనుమతి లేకుండానే అప్పుడప్పుడు తండ్రిని చూసేందుకు ఇంటికి వెళ్లి వచ్చేవాడు. విషయం తెలిసిన క్లాస్ టీచర్ పలుమార్లు విద్యార్థిని మందలించాడు. మనోవేదనకు గురైన విద్యార్థి బుధవారం రాత్రి అందరూ పడుకున్నాక టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పడంతో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లా రు. పరిశీలించిన వైద్యులు విద్యార్థి మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

జెండాగూడకు విద్యుత్ సౌకర్యం

- జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ చౌహాన్


గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

తాంసి: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కమట్‌వాడ గ్రామ పంచాయతీ పరిధి జెండాగూడ గిరిజన గ్రామాన్ని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ జయవంత్‌రావు చౌహాన్ గురువారం సందర్శించారు. జెండాగూడలో విద్యుత్ సౌకర్యం లేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై 'అంధకారం నుంచి స్వాతంత్య్రం ఎప్పుడో?' అనే శీర్షికన 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెండాగూడకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు 2021లో టెండర్లు పిలవగా ఎవరూ ముందుకు రాలేదని స్పష్టం చేశారు. మరోసారి టెండర్లు పిలిచి పనులు చేపడతామని తెలిపారు. ఎవరూ ముందుకు రాకపోతే నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ద్వారా పనులు పూర్తిచేసి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్లలో జిల్లాలో 1990 గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్‌తోపాటు 48 గ్రామాలకు సింగిల్ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించామని వివరించారు. జెండాగూడతోపాటు గోవింద్‌పూర్ గ్రామాన్ని ఖాళీ చేసి.. వేరే ప్రాంతంలో గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్న కుటుంబాలకు సైతం విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని చౌహాన్ వెల్లడించారు.

ఎస్‌బీ ఆర్గానిక్స్‌పై క్రిమినల్ కేసు

- రియాక్టర్ పేలుడు ఘటనలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య
- శిథిలాల కింద మరో మృతదేహం లభ్యం
- గాయాల పాలైన వారిలో ముగ్గురి పరిస్థితి విషమం
- 304ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు
- అధిక ఉష్ణోగ్రత వల్లే రియాక్టర్ పేలుడు
- ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన పరిశ్రమలశాఖ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఐజీ సుధీర్‌బాబు తదితరులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి, హత్నూర(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా చందాపూర్‌లో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం శిథిలాల కింద మరో కార్మికుడి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన వడ్డేపల్లి రమేశ్(34)గా గుర్తించారు. ఆరుగురు మృతికి కారణమైన ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన సుబ్రహ్మణ్యం బంధువులు పేర్ని వెంకటకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్యాక్టరీ యాజమాన్యంపై 304ఏ సెక్షన్ కింద హత్నూర పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్ సైన్స్ అండ్ లాబొరేటరీ క్లూస్ టీం నిపుణుల సహాయంతో సాంకేతిక ఆధారాలను సేకరించేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసు శాఖ ఐజీ సుధీర్‌బాబు తెలిపారు. కాగా ఈ పరిశ్రమలో చెలరేగిన మంటలు బుధవారం రాత్రి అదుపులోకి రాగా.. తిరిగి గురువారం కూడా మళ్లీ పొగలు రావడంతో ఫైర్ సిబ్బంది అలర్ట్ అయ్యారు. నైట్రేట్ పైపు లీకేజీ కావడంతో ఈ పొగలు రావడం ప్రారంభమైనట్లు గుర్తించి అదుపులోకి తెచ్చారు.

మరో ముగ్గురి పరిస్థితి విషమం

గాయాల పాలైన 17 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగానే ఉందని అంటున్నారు. కె.హన్మంతరావు, మల్లేశం, భాస్కర్ హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పరిమితికి మించి వేడి.. ప్రమాదానికి కారణమా?

రియాక్టర్‌లో కెమికల్స్‌ను పరిమితికి మించి వేడి చేయడంతోనే ఈ రియాక్టర్ పేలిపోయి.. మంటలు అంటుకున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చామని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్ 'సాక్షి'ప్రతినిధికి చెప్పారు. పూర్తి స్థాయి దర్యాప్తు ఇంకా కొనసాగుతోందన్నారు. రియాక్టర్ల పనితీరుపై పర్యవేక్షణ అధికారం తమ శాఖ పరిధిలో లేదని, థర్డ్‌పార్టీ ఏజెన్సీ ఈ రియాక్టర్ల పనితీరును పర్యవేక్షిస్తుందని ప్రవీణ్ తెలిపారు. మరోవైపు సుమారు రెండు వందల మంది కార్మికులు పనిచేస్తున్న ఈ ఫ్యాక్టరీకి అసలు అగ్నిమాపక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని తెలిసింది. అయితే ఈ ఫ్యాక్టరీకి అనుమతులు అవసరం లేదని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ 'సాక్షి'తో చెప్పారు.

మృతుల కుటుంబాలకు రూ.40లక్షల ఆర్థికసాయం: మంత్రి దామోదర

ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అండగా నిలిచారు. ఒక్కొక్కరికి రూ.40 లక్షల చొప్పున ఆర్థిక సహాయం కంపెనీ తరఫున అందించేందుకు యాజమాన్యంతో చర్చించి ఆమోదింపజేశారు. తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున తన సొంత డబ్బులను అందజేశారు. బాధిత కుటుంబాల్లోని అర్హులైన వారికి స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

బాధితులకు హరీశ్‌రావు పరామర్శ

అగ్నిప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతారెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరుక్రాంతికి ఫోన్ చేసి మాట్లాడారు.

డ్రగ్స్ వాడొద్దన్నాడని తండ్రిని చంపేశాడు

- పెట్రోల్ పోసి నిప్పంటించి.. బండరాయితో మోది తండ్రి హత్య
- తుర్కయాంజాల్‌లో ఘటన


రవీందర్

ఇబ్రహీంపట్నం రూరల్: డ్రగ్స్ వాడదన్నందుకు ఓ కొడుకు ఏకంగా తండ్రిపైనే పెట్రోల్ పోసి నిప్పంటించి, బండరాయితో మోది చంపాడు. ఈ ఘటన తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. రవీందర్– సుధ దంపతులు ఇద్దరు కొడుకులతో కలిసి ఆరెంజ్ అవెన్యూ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్నారు. రవీందర్‌ది నాగర్‌కర్నూల్ స్వగ్రామం కాగా, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. పెద్ద కుమారుడు అనురాగ్ కొంతకాలంగా డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో తరచూ ఇతరులతో ఘర్షణ పడుతుండేవాడు. డ్రగ్స్, గొడవలు తగదని తండ్రి రవీందర్ కొన్నాళ్లుగా కొడుకును హెచ్చరిస్తున్నాడు. గురువారం కూడా మందలించాడు. దీంతో ఆగ్రహానికి గురైన అనురాగ్ పెట్రోల్ తెచ్చి తండ్రిపై పోసి నిప్పంటించాడు. మంటలు అంటుకోవడంతో తప్పించుకునేందు కు పరుగెత్తుతూ రవీందర్ కొద్ది దూరంలో పడిపోయాడు. ఇది గమనించిన అనురాగ్ పక్కనే ఉన్న బండరాయిని తండ్రి తలపై వేసి హత్య చేశాడు. దీంతో రవీందర్ (65) అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. అనంతరం అనురాగ్ పారిపోయాడు. మృతుడి భార్య సుధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రవీందర్ మొదటి భార్య చనిపోగా సుధను రెండో వివాహం చేసుకున్నట్టు తెలిసింది. రవీందర్‌కు మొదటి భార్యతో కలిగిన ఇద్దరు సంతానంలో ఒక కొడుకు చనిపోగా, మరో కొడుకు విదేశాల్లో ఉన్నట్టు సమాచారం. సుధ–రవీందర్‌ల సంతానంలో అనురాగ్ పెద్దవాడు కాగా, చిన్న కొడుకు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నట్టు తెలిసింది. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు.

నీళ్ల ట్యాంకులో కోతుల కళేబరాలపై విచారణ

- కలెక్టర్ దాసరి హరిచందన ఆగ్రహం
- నందికొండ మున్సిపల్ కమిషనర్, నీటిపారుదల ఈఈకి షోకాజ్ నోటీసు

నల్లగొండ: నాగార్జునసాగర్ హిల్ కాలనీ తాగునీటి ట్యాంకులో కోతులు పడి చనిపోయిన సంఘటనపై కలెక్టర్ దాసరి హరిచందన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నందికొండ మున్సిపల్ కమిషనర్, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌ను విచారణాధికారిగా నియమించి వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పూర్ణచందర్ గురువారం హిల్ కాలనీని సందర్శించి విచారణ చేపట్టి నివేదికను సమర్పించారు. హిల్‌కాలనీలో కోతులు పడి చనిపోయిన వాటర్ ట్యాంక్ ద్వారా కేవలం 9 ఇళ్లకు మాత్రమే తాగునీరు సరఫరా అవుతున్నట్లు విచారణలో తేలిందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఇళ్లలో 49 మంది మాత్రమే ఉన్నారని వెల్లడించారు. హిల్ కాలనీలో మొత్తం మూడు పెద్ద ట్యాంకులున్నాయని, రెండు హిల్ కాలనీకి, మరొకటి పైలాన్ కాలనీకి నీరందిస్తాయని తెలిపారు. కోతులు పడి చనిపోయిన నీటి ట్యాంకు నుంచి నీరు రావటం లేదని ఈ నెల 3 తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారని వెల్లడించారు. తక్షణమే నీటి సరఫరా నిలిపివేసి చనిపోయిన కోతులను తొలగించినట్లు తెలిపారు. ఈ సంఘటన వల్ల ఇప్పటివరకు ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హిల్ కాలనీని సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించారని, ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన మందులు కూడా సిద్ధం చేశారని తెలిపారు. తొమ్మిది ఇళ్ల ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ పైపులైన్‌ను ఏర్పాటు చేసినట్టు తన నివేదికలో అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

వడదెబ్బకు బాలుడి మృతి


రామవత్ అఖిల్

ఇందల్వాయి (నిజామాబాద్ రూరల్): నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం డొంకల్ పంచాయతీ పరిధిలోని డొంకల్ తండాలో ఐదేళ్ల బాలుడు వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాలోని రమేశ్, అనిత దంపతుల రెండో కుమారుడు రామవత్ అఖిల్ (5) ఒకటో తరగతి చదువుతున్నాడు. రమేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. గురువారం సాయంత్రం స్కూల్ ముగియగానే అఖిల్ ఇంటికి వచ్చాడు. ఇంటివద్ద ఆరుబయట ఆడుకుంటూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తండావాసులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు పల్స్ రేటు పూర్తిగా పడిపోయి మృతి చెందాడని, మృతికి వడదెబ్బ కారణమని ధ్రువీకరించారు.

సమ్మర్ సలసల!

- నడి వేసవికి ముందే రాష్ట్రంలో మండుతున్న ఎండలు
- 30 ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌కుపైగా ఉష్ణోగ్రతలు నమోదు
- సగటున సాధారణం కంటే 2 నుంచి 4.3 డిగ్రీలు అధికం
- నిడమనూరులో అత్యధికంగా 43.5 డిగ్రీలుగా నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ నెల తొలివారం నుంచి క్రమంగా పెరగాల్సిన గరిష్ట ఉష్ణోగ్రతలు ఇప్పటికే అత్యధిక స్థాయిలో నమోదవుతున్నాయి. సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి 4.3 డిగ్రీల సెల్సియస్ అధికంగా రికార్డవుతున్నాయి. దీంతో ఇక నడి వేసవి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన అందరిలో కలుగుతోంది. వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. రానున్న మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. అత్యవసర పరిస్థితిలో తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ప్రయాణాలు మానుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

గతేడాది కంటే 2.5 డిగ్రీలు అధికంగా...

నల్లగొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది ఇదే రోజున 41 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గురువారం రాష్ట్రంలోని 30 ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాది ఈ ప్రాంతాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతతో పోలిస్తే ప్రస్తుతం సగటున 1 డిగ్రీల సెల్సియస్ నుంచి 2.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైంది. ఖమ్మంలో సాధారణం కంటే 4.3 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రత నమోదవగా హైదరాబాద్‌లో 2.8 డిగ్రీల సెల్సియస్, ఆదిలాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లలో 2 డిగ్రీల సెల్సియస్ చొప్పున అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గురువారం వివిధ ప్రాంతాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

ప్రాంతం	ఉష్ణోగ్రత
నిడమనూరు	43.5
ధారూర్	43.4
పెబ్బేరు	43.3
డిచ్‌పల్లి	43.1
తిర్యాణి	42.5
నిజాంపేట్	42.1
మంగపేట	42.1
మోతె	42.1
పినపాక	42.1
మరిపెడ	42.1
చారగొండ	42.1
బేల	42.0
ఆదిలాబాద్	41.8
నిజామాబాద్	41.3
మహబూబ్‌నగర్	41.0
నల్లగొండ	40.5
ఖమ్మం	40.4
హైదరాబాద్	40.3

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. చిన్నారి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- బాధితులు తెలంగాణకు చెందిన వారు

ఫ్లోరిడా: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఒక చిన్నారి చనిపోగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఫ్లోరిడా రాష్ట్రం జాక్సన్ కౌంటీలో శుక్రవారం రాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తెలంగాణకు చెందిన బొమ్మిడి అనూష, కొమ్మారెడ్డి సుశీల్ దంపతులు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వీరు తమ 11 ఏళ్ల కుమారుడు అద్వైత్‌ను శుక్రవారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాత్రి తిరిగి వస్తూ ఫ్లోరిడా హైవేపై ముందున్న వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో వీరి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సుశీల్ దంపతుల ఏడాది వయసున్న కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అధికారులు చిన్నారిని వెంటనే హెలికాప్టర్‌లో ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. సుశీల్, అద్వైత్, అనూష కూడా తీవ్రంగా గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గోవింద్‌పూర్‌లో వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

తాంసి: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కమట్‌వాడ పంచాయతీ పరిధి గోవింద్‌పూర్‌లో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కిడ్నీ వ్యాధితో గిరిజనులు గోవింద్‌పూర్ గ్రామాన్ని ఖాళీ చేయడంపై ఈ నెల 4న 'కిడ్నీ వ్యాధితో ఊరు ఖాళీ'శీర్షికన 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. తాగునీటితోపాటు ఇతర వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు గురువారం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సిబ్బందితో కలిసి గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 60 మంది రక్త నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు తరలించారు.

ఏనుగు దాడిలో మరో రైతు మృతి

- పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో ఘటన
- రెండోరోజూ చిక్కని గజరాజు
- ఐదు మండలాల్లో 144 సెక్షన్ విధింపు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన


కారు పోశన్న


రహదారి మీదుగా వెళ్తున్న ఏనుగు

పెంచికల్‌పేట్ (సిర్పూర్): మహారాష్ట్ర మీదుగా ప్రాణహిత నది దాటి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగుపెట్టిన ఏనుగు మరో రైతును బలితీసుకుంది. చింతలమానెపల్లి మండలం బూరెపల్లి గ్రామ శివారు మిరప చేనులో పని చేసుకుంటున్న రైతు అల్లూరి శంకర్‌ను బుధవారం పొట్టన పెట్టుకోగా.. గురువారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తున్న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన కారు పోశన్న(60)పై దాడి చేసి చంపేసింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం వేకువజామున పంటకు నీళ్లు పెట్టేందుకు రైతు పోశన్న పొలానికి వెళ్లగా, రహదారికి సమీపంలోని పొలం వద్ద ఉన్న ఏనుగు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం ఏనుగు రోడ్డుపైకి రావడంతో అక్కడే వాకింగ్ చేస్తున్న యువకులు గమనించి పరుగులు తీసి ఫోన్ ద్వారా గ్రామస్తులకు విషయం తెలియజేశారు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఘటనాస్థలాన్ని అదనపు కలెక్టర్ వేణు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, అటవీ అధి కారులు పరిశీలించారు. ఏనుగు దాడి నేపథ్యంలో దహెగాం, చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో 144 సెక్షన్ విధించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అటవీశాఖ అధికారులతో వాగ్వాదం

బుధవారమే ఓ రైతు ఏనుగు దాడిలో మృతిచెందినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అందువల్లే గురువారం పోశన్న ఏనుగు దాడిలో ప్రాణాలు కోల్పోయాడని గ్రామస్తులు అటవీశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో అటవీ వర్గాలపై దాడికి యత్నించడంతో అక్కడే ఉన్న డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్తులను అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, ఐదెకరాల వ్యవసాయ భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అటవీశాఖలో కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశమిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

లోడుపల్లి అడవుల్లోకి గజరాజు

గురువారం రైతును చంపిన ఏనుగు మళ్లీ రాత్రి 8 గంటలకు కొండపల్లి టర్నింగ్ వద్ద కనిపించింది. అటు నుంచి లోడుపల్లి అడవుల్లోకి వెళ్లినట్టు గుర్తించారు. పెంచికల్‌పేట్– సలుగుపల్లి రోడ్డులో రాకపోకలను నిలిపివేశారు.

ఏనుగుకు హాని తలపెట్టొద్దు..

బెజ్జూర్: కుమురంభీం జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుకు ప్రజలు ఎలాంటి హానీ తలపెట్టొద్దని రాష్ట్ర వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ పర్గేన్ సూచించారు. బెజ్జూర్ రేంజ్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కాగజ్‌నగర్ డివిజన్ ప్రాంతంలో దాని ముఖ్య ఆహారం చెరుకు దొరకకపోవడంతో తిరిగి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే అవకాశం ఉందన్నారు.

అటవీశాఖ అప్రమత్తం

సాక్షి, హైదరాబాద్: ఏనుగు సంచరిస్తున్న ప్రదేశాలలో అటవీశాఖ అధికారులు.. సమీప గ్రామాలలోని ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రతీ ఒక్క నివాసాన్ని సందర్శించి వారిని బయటికి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. హుల్లా పార్టీ (సంప్రదాయ పద్ధతిలో వెలిగించిన మషాల్, డప్పులు కొట్టడం ద్వారా ఏనుగును తరిమికొట్టడానికి ఉపయోగించే ప్రొఫెషనల్) మహారాష్ట్రలోని సమీప అటవీ ప్రాంతాల నుండి కూడా రప్పించి ఏనుగును జనావాసం నుంచి అటవీ ప్రాంతంలోకి మళ్లించే యత్నం చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ముగ్గురు మృతి

- సూర్యాపేటలో హైవేపై ప్రమాదం



సూర్యాపేట: ఆటోను కారు వెనుక నుంచి ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందగా 14మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాద ఘటన గురువారం సూర్యాపేట మానసనగర్ కాలనీ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ మానసనగర్ కాలనీ వద్ద రోడ్డు పక్కన నిలిపాడు. అదే సమయంలో అర్వపల్లి నుంచి సూర్యాపేటకి 17 మంది ప్రయాణికులతో వస్తున్న ఆటో డ్రైవర్ ముందు ఆగి ఉన్న లారీని గమనించి దాని పక్కనుంచి వెళ్లేందుకు ఆటోను పక్కకు తిప్పాడు. అదే సమయంలో హైవేపై అతివేగంతో వస్తున్న ఎర్టిగా కారు ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు ఆగి ఉన్న లారీని గుద్దుకుంది. ఈ ఘటనలో ఆటోలో వస్తున్న సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చింతరెడ్డి సరితారెడ్డి(49), సూర్యాపేట మండలం లక్ష్మీతండాకు చెందిన లునావత్ రుక్కమ్మ (55), నాగారం మండలం పసునూరు గ్రామానికి చెందిన వేదాశ్విని(17 నెలలు) అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోడ్రైవర్‌తో సహా గాయపడిన మిగిలిన 14మందిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీట్ బెల్ట్ పెట్టుకోలేదని ట్రాక్టర్ డ్రైవర్‌కు జరిమానా


పోలీసులు జరిమానా విధించిన ట్రాక్టర్

పాల్వంచరూరల్: ట్రాక్టర్ డ్రైవర్ సీటుబెల్టు పెట్టుకోలేదంటూ బ్లూ కోల్ట్స్ పోలీసులు జరిమానా విధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం నాగారం నుంచి పాల్వంచ వైపు గురువారం మట్టిలోడ్‌తో ట్రాక్టర్ వస్తోంది. దారిలో ట్రాక్టర్‌ను ఆపిన బ్లూకోల్ట్స్ పోలీసులు డ్రైవర్ సీటు బెల్టు పెట్టుకోలేదంటూ రూ.135 జరిమానా విధించారు. అయితే, ట్రాక్టర్‌కు సీటు బెల్టు ఉండదని చెప్పినా వినిపించుకోకుండా జరిమానా విధించారని డ్రైవర్ వాపోయాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా స్టీరింగ్ ఉన్న ప్రతీ వాహనం డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనల మేరకు సీట్ బెల్టు పెట్టుకోవాల్సిందేనని చెప్పారు.

మోడువారిన హరిత హారం


హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ పట్టించుకోకపోవడంతో ఇప్పుడవి మోడువారాయి. బోథ్ మండలం సోనాల గ్రామ శివారులోని అజ్జర్‌వజ్జర్ అటవీ ప్రాంతంలో గత వర్షాకాలం అటవీ అధికారులు భారీగా మొక్కలను నాటారు. కానీ మొక్కల సంరక్షణ చర్యలను విస్మరించారు. ఫలితంగా ప్రస్తుత ఎండల తీవ్రతకు పూర్తిస్థాయిలో మొక్కలు మోడువారాయి. ప్రస్తుతం మొక్కలు నాటిన ప్రదేశంలో కర్రలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్

అగ్ని ప్రైమ్ బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: దేశీయంగా అభివృద్ధి చేసిన నూతన తరం 'అగ్ని ప్రైమ్' బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ), స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్(ఎస్‌ఎఫ్‌సీ) సహకారంతో భారత సైన్యం అగ్ని ప్రైమ్ మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా సముద్ర తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం రాత్రి ఈ క్షిపణిని పరీక్షించినట్లు రక్షణ శాఖ ప్రకటించింది. అగ్నిప్రైమ్ నిర్దేశిత అన్ని లక్ష్యాలను చేరుకుందని వెల్లడించింది. ఈ మిస్సైల్ అణ్వాయుధాలను మోసుకెళ్లగలదు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద దేశీయంగా అభివృద్ధి చేశారు. ఇది మీడియం రేంజ్ క్షిపణి. దీని స్ట్రైక్ రేంజ్ 1,000 కిలోమీటర్ల నుంచి 2,000 కిలోమీటర్ల దాకా ఉంటుంది. లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించడం అగ్నిప్రైమ్ ప్రత్యేకత. 1,500 నుంచి 3,000 కిలోల దాకా వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లగలదు. బరువు దాదాపు 11,000 కిలోలు. అగ్ని క్షిపణుల శ్రేణిలో ఇది ఆరో క్షిపణి కావడం విశేషం. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే పృథ్వీ, అగ్ని, త్రిశూల్, నాగ్, ఆకాశ్ తదితర క్షిపణులను అభివృద్ధి చేశారు. అగ్ని ప్రైమ్ పరీక్ష విజయవంతం కావడం పట్ల రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఓ, ఎస్‌ఎఫ్‌సీతోపాటు భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. అగ్ని ప్రైమ్ రాకతో మన భద్రతా బలగాలకు మరింత బలం లభిస్తుందని పేర్కొన్నారు. సైంటిస్టులకు ప్రధాన నరేంద్ర మోదీ కూడా అభినందనలు తెలిపారు.

సీబీఎస్‌ఈ 3, 6వ తరగతులకు


కొత్త సిలబస్

న్యూఢిల్లీ: సీబీఎస్‌ఈ పాఠశాలల్లో 3, 6వ తరగతుల పాఠ్యప్రణాళిక మారింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది. 3, 6వ తరగతులకు కొత్త సిలబస్‌తో పాఠ్య పుస్తకాలను త్వరలో విడుదల చేయనున్నట్లు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) ప్రకటించింది. 3వ తరగతికి సంబంధించిన కొత్త పుస్తకాలను ఏప్రిల్ చివరి వారంలో, 6వ తరగతికి సంబంధించిన కొత్త పుస్తకాలను మే మూడో వారంలో విడుదల చేయనున్నట్లు తెలియజేసింది. పుస్తకాల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. 4, 5, 9, 11వ తరగతుల పుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. అన్ని పాఠ్య పుస్తకాల డిజిటల్ కాపీలు ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌తో పాటు దీక్షా, ఈ-పాఠశాల పోర్టల్, యాప్‌లలో అందుబాటులో ఉంటాయి.

ఎన్నికల్లో పోటీకి ఎంత కావాలి?

నిర్మల వ్యాఖ్యలతో ఎన్నికల వ్యయంపై చర్చ

- అంత డబ్బు తన వద్ద లేదన్న కేంద్ర మంత్రి
- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు వేర్వేరు పరిమితులు
- పాటించకుంటే అభ్యర్థులపై అనర్హత వేటే



లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవసరమైన డబ్బులు తన వద్ద లేవని, అందుకే పోటీకి దూరంగా ఉంటున్నానని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల చేసిన ప్రకటన సంచలనమైంది. రాజ్యసభ ఎంపీగా ఉన్న ఆమె గతంలోనూ లోక్‌సభకు పోటీ చేయలేదు. అందుకు బాగా ధన బలం కావాలని తన వ్యాఖ్యల ద్వారా చెప్పకనే చెప్పారు. దాంతో ఎన్నికల వ్యయం మరోసారి చర్చనీయాంశంగా మారింది...

2016లో కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నికైన నిర్మల 2014 నుంచి 2016 దాకా ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. గత రాజ్యసభ ఎన్నికల అఫిడవిట్‌లో ఆమె తన నికర ఆస్తుల విలువను రూ.2.5 కోట్లుగా ప్రకటించారు. అయినా ఎన్నికల్లో పోటీకి సరిపడా డబ్బుల్లేవని స్వయంగా దేశ ఆర్థిక మంత్రే అనడంతో అసలు ఒక అభ్యర్థికి ఎంత డబ్బుండాలన్నది ఆసక్తికరంగా మారింది.

ఎంత కావాలి?

ఎన్నికల ప్రచారానికి పార్టీలు ఎంతయినా ఖర్చు పెట్టొచ్చు. వాటికి పరిమితులేమీ లేవు. కానీ అభ్యర్థులు చేసే వ్యయాలకు మాత్రం పరిమితులు న్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఒక అభ్యర్థి రూ.95 లక్షలకు మించి ఖర్చు పెట్టకూడదు. అసెంబ్లీ ఎన్నికల్లో గరిష్ట వ్యయ పరిమితి రూ.40 లక్షలు. కేంద్రపాలిత ప్రాంతాలు, చిన్న రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలకు రూ.75 లక్షలు, అసెంబ్లీకి రూ.28 లక్షల పరిమితిని కేంద్ర ఎన్నికల సంఘం విధించింది.

ఈసీ గైడ్‌లైన్స్ ఇవీ..

ఎన్నికల వ్యయ పరిమితి అభ్యర్థి ప్రచారానికి సంబంధించినది. ఓటర్లకు చేరువయ్యేందుకు చేసే ఖర్చు ఆ పరిమితిని మించరాదు. ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, ప్రచారం, సభలు, సమావేశాలు, వాహనాల వినియోగం వంటివన్నీ ఇందులోకి వస్తాయి. ద్రవ్యోల్బణం, పెరిగిన ప్రచార ఖర్చు తదితరాలను పరిగణనలోకి తీసుకుంటూ ఎన్నికల వ్యయ పరిమితులను ఈసీ ఎప్పటికప్పుడు సవరిస్తుంటుంది. నియోజకవర్గంలో పెరిగిన ఓటర్ల సంఖ్యను కూడా పరిశీలనలోకి తీసుకుంటుంది. ఎన్నికల వ్యయ పరిమితిని చివరిసారి 2022లో సవరించింది.

పరిమితి దాటితే..?

ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత అసెంబ్లీ ఎన్నికలు అయితే 30 రోజుల్లోపు, లోక్‌సభ ఎన్నికలు అయితే 90 రోజుల్లోపు వ్యయాలకు సంబంధించిన అన్ని ఆధారాలను అభ్యర్థులు ఎన్నికల అధికారులకు అందించాల్సి ఉంటుంది. ఇలా చేయకపోతే ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 10ఏ కింద అభ్యర్థిని మూడేళ్ల పాటు అనర్హుడిగా ప్రకటిస్తారు. ఈసీ నిర్ణయించిన పరిమితికి మించి ఎవరైనా ఖర్చు చేసినట్టయితే వారికి వ్యతిరేకంగా ఎవరైనా ఈసీ ముందు పిటిషన్ దాఖలు చేయవచ్చు. పరిమితికి మించి ఖర్చు చేయడాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(6) కింద అవినీతి చర్యగా ఈసీ పరిగణిస్తుంది. అలాంటప్పుడు సెక్షన్ 10ఏ కింద సదరు అభ్యర్థిపై మూడేళ్లపాటు అనర్హత వేటు పడుతుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఈ ఎన్నికల వ్యయం రూ.లక్ష కోట్ల పై మాటే!

2019 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రూ.1,264 కోట్లు ఖర్చు చేసినట్టు నాడు బీజేపీ ప్రకటించగా, కాంగ్రెస్ వ్యయం రూ.820 కోట్లుగా ఉంది. వాస్తవానికి ఆ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పార్టీలు, అభ్యర్థులు చేసిన ఖర్చు రూ.60,000 కోట్లు దాటి ఉంటుందని సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ (సీఎంఎస్) అధ్యయనం పేర్కొంది! ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇది ఏకంగా రూ.1.2 లక్షల కోట్లకు చేరుతుందని సంస్థ అంచనా. అంటే ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి సగటున రూ.221 కోట్లు!

ఎందుకు పరిమితి?

ఎన్నికల్లో పోటీ చేసి, గెలిచే అవకాశాలు అందరికీ సమానంగా కల్పించాలన్నదే వ్యయ పరిమితుల్లోని ఉద్దేశ్యం. తద్వారా ధన బలం కలిగిన అభ్యర్థులది పైచేయి కాకుండా ఉంటుంది. నామినేషన్ వేసినప్పటి నుంచి, పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అభ్యర్థి చేసే వ్యయాలను ఈసీ పరిగణనలోకి తీసుకుంటుంది. అభ్యర్థుల బ్యాంక్ లావాదేవీలను, ఖాతాస్టేట్‌మెంట్లను ఈసీ పరిశీలిస్తుంది. వ్యయాలపై ఎన్నికల పరిశీలకుల నిఘా కూడా ఉంటుంది.

తొలుత తక్కువే

1952 తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి రూ.25వేల ఖర్చుకే అనుమతించారు. చిన్న రాష్ట్రాల్లో నైతే రూ.10 వేలే. తర్వాత దీన్ని సవరిస్తూ వచ్చారు. చట్టబద్ధమైన వ్యయ పరిమితితో పోలిస్తే, ఒక్కో అభ్యర్థి చేసే వాస్తవ ఖర్చు కోట్లలో ఉంటుందన్నది తెలిసిందే. వందలాది కోట్లు ఖర్చు చేసేవాళ్లూ ఉన్నారు. నగదు, ఇతర కానుకల రూపంలోనూ ఓటర్లను ప్రలోభపెడుతుంటారు. ఇదంతా అనధికారికంగా నడిచే వ్యవహారం.

ఎన్నికల వ్యయ పరిమితి

సంవత్సరం	వ్యయ పరిమితి (రూ.ల్లో)	
	పెద్ద స్థానాలు	చిన్న స్థానాలు
1952	25,000	10,000
1971	35,000	-
1980	1,00,000	-
1984	1.3 లక్షలు-1.5లక్షలు	50 వేలు-లక్ష
1996	4,50,000	-
1998	15,000,00	-
2004	25,00,000	-
2014	70,00,000	-
2022	95,00,000	75,00,000



ఎన్నికల విచిత్రం

వినూత్న ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. తిరువనంతపురం కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ శశీ థరూర్ గురువారం ఇలా ఆటోలో ఎన్నికల ప్రచారం చేశారు.

ఎలక్షన్ బీట్

రాహుల్ గాంధీకి రూ.20 కోట్ల ఆస్తులు

వయనాడ్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తనకు సుమారు రూ.20 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు వెల్లడించారు. కేరళలోని వయనాడ్ సిట్టింగ్ ఎంపీ అయిన ఈయన మరోమారు అక్కడి నుంచే పోటీ చేస్తున్నారు. బుధవారం రిటర్నింగ్ అధికారికి అందజేసిన నామినేషన్ పత్రాల్లో రాహుల్ తన ఆస్తుల వివరాలను పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.9.24 కోట్ల విలువైన చరాస్తులు, సొంతంగా సంపాదించుకున్న స్థిరాస్తులు మార్కెట్ విలువ ప్రకారం రూ.9 కోట్లని కూడా ఆయన వెల్లడించారు. వారసత్వంగా సంక్రమించిన ఆస్తుల విలువ రూ.2.10 కోట్లని తెలిపారు. తన వద్ద రూ.55 వేల నగదు ఉండగా, రూ.49,79,184 అప్పు ఉందని వెల్లడించారు.

సరైన నిర్ణయం తీసుకోండి

న్యూఢిల్లీ: దేశం కీలక దశలో ఉందని రాహుల్ పేర్కొన్నారు. దేశాన్ని నిర్మించింది ఎవరో, దాన్ని నాశనం చేసింది ఎవరో తెలుసుకోవాలంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజల భవిష్యత్తులో వారి చేతుల్లోనే ఉందని తెలిపారు. ఆలోచించండి.. అర్థం చేసుకోండి.. సరైన నిర్ణయం తీసుకోండి అన్నారు.

కుమారస్వామి ఆస్తులు రూ.217 కోట్లు

బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఆయన భార్య అనిత మొత్తం రూ.217.21 కోట్ల ఆస్తులున్నాయి. మాండ్య లోక్‌సభ స్థానానికి గురువారం కుమారస్వామి నామినేషన్ వేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో తన వ్యక్తిగత వివరాలను పొందుపరిచారు. తమకు రూ.82.17 కోట్ల అప్పులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కుమారస్వామికి రూ.54.65 కోట్ల విలువైన ఆస్తులుండగా ఆయన భార్య అనితకు రూ.154.39 కోట్ల ఆస్తులున్నాయి. తమ ఉమ్మడి కుటుంబంలో తన పేరిట మరో రూ.8.17 కోట్ల ఆస్తులు కూడా ఉన్నట్లు మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కుమారుడైన కుమారస్వామి వెల్లడించారు.

మోదీ విజయం జాతీయ బాధ్యత: నడ్డా

డెహ్రాడూన్: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా నెగ్గడానికి సహకరించడం ప్రజల జాతీయ బాధ్యత అని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలంటే మోదీని మూడోసారి గెలిపించుకోవాలని సూచించారు. నడ్డా గురువారం ఉత్తరాఖండ్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. ఉత్తరాఖండ్‌లోని మొత్తం ఐదు లోక్‌సభ స్థానాలకు బీజేపీకి కట్టబెట్టాలని కోరారు. మోదీని మళ్లీ గెలిపిస్తే దేశాన్ని మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఓటు బ్యాంకు రాజకీయాలు, కుల రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి రాజకీయాలకు శ్రీకారం చుట్టిన ఘనత నరేంద్ర మోదీదే అని నడ్డా ప్రశంసించారు.

అబద్ధాల సర్దార్ మోదీ: ఖర్గే

జైపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముమ్మాటికీ అబద్ధాల సర్దార్ అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మన దేశ భూభాగంలోకి చైనా ప్రవేశిస్తుంటే మోదీ నిద్రపోతున్నారని ధ్వజమెత్తారు. గురువారం రాజస్తాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలో ఖర్గే మాట్లాడారు. దేశ క్షేమం గురించి ఏమాత్రం పట్టించుకోని ప్రధానమంత్రి.. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని దూషించడంలో తీరిక లేకుండా ఉంటున్నారని ధ్వజమెత్తారు. 56 అంగుళాల ఛాతీ అని చెప్పుకుంటున్న మోదీ మన దేశ భూభాగాన్ని చైనాకు అప్పగించారని ఖర్గే ఆరోపించారు. మోదీ గ్యారంటీల డ్రామా సార్వత్రిక ఎన్నికల దాకా కొనసాగుతుందని చెప్పారు. ఆ తర్వాత ఏమీ ఉండదన్నారు. ఓటమి భయంతోనే విపక్షాలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు.

పామునైనా నమ్మగలం గానీ..: మమత

కూచ్‌బెహార్/మాల్‌బజార్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బీజేపీ పాటించడం లేదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. విషపూరిత పామునయినా నమ్మొచ్చేమోగానీ, కాషాయదళాన్ని మాత్రం విశ్వసించరాదన్నారు. ఆవాస్ యోజన కింద పేర్లు నమోదు చేసుకోవాలని కేంద్రం కోరితే గుడ్డిగా నమ్మొద్దని ప్రజలను కోరారు. బీజేపీ దేశాన్ని నాశనం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీకి ఒకే దేశం, ఒకే పార్టీ సిద్ధాంతంపై మాత్రమే నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థలతోపాటు బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్‌లు కూడా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి వాటికి తాము తలొంచబోమని తెగేసి చెప్పారు. అన్ని పార్టీలనూ సమానంగా చూడాలని ఈసీని కోరతామన్నారు.

బీజేపీని ఓడించండి: ఎస్‌కేఎం

చండీగఢ్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని శిక్షించాలని ప్రజలకు పిలుపు ఇస్తామని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) తెలిపింది. బీజేపీకి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో భాగంగా మే 21వ తేదీన పంజాబ్‌లోని జగ్రావ్‌లో ర్యాలీ చేపడతామంది. బీజేపీని ఓడించండి..కార్పొరేట్లను తరమండి' అనేదే తమ నినాదమని గురువారం ఎస్‌కేఎం నేత బల్బీర్ సింగ్ రాజేవాల్ మీడియాకు తెలిపారు. ఇటీవల ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో జరిగిన కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరుతూ పలు ప్రశ్నలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంచిపెడతామన్నారు. వివాదాస్పద మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోసం పోరాటానికి ఎస్‌కేఎం సారథ్యం వహించిన విషయం తెలిసిందే.

ఎన్డీఏ హ్యాట్రిక్ ఖాయం

లోక్‌సభ ఎన్నికల్లో 383 స్థానాలు • టైమ్స్ నౌ సర్వే వెల్లడి

బీజేపీకి ఒంటరిగానే 344

- ఇండియా కూటమికి 118
- కాంగ్రెస్‌కు కేవలం 37 స్థానాలు
- తెలంగాణలో కాంగ్రెస్‌కు 9, బీజేపీకి 5, బీఆర్‌ఎస్‌కు 2
- వైఎస్సార్‌సీపీకి 22 స్థానాలు
- డీఎంకేకు 22, టీఎంసీకి 19

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని టైమ్స్ నౌ-ఈటీజీ సర్వే పేర్కొంది. ఎన్డీఏకు 383 స్థానాలొస్తాయని, విపక్ష ఇండియా కూటమి 118 సీట్లకే పరిమితం అవుతుందని అంచనా వేసింది. అధికార బీజేపీ ఏకంగా 344 సీట్లు సాధిస్తుందని, కాంగ్రెస్ తన చరిత్రలోనే అత్యల్పంగా కేవలం 37 లోక్‌సభ స్థానాలతో కుదేలవనుందని పేర్కొంది. ఎన్డీఏ కూటమి ఏకంగా 49 శాతం ఓట్లు ఒడిసిపడుతుందని, ఇండియా కూటమికి 34 శాతం వస్తాయని తేల్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 25 స్థానాలకు గాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకంగా 22 సీట్లు సాధించి లోక్‌సభలో మూడో అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని వెల్లడించింది. తమిళనాట డీఎంకేకు కూడా 22 స్థానాలొస్తాయని, పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు 19, ఒడిశాలో బిజూ జనతాదళ్‌కు 11 సీట్లొస్తాయని తెలిపింది. కేజ్రీవాల్ అరెస్టుతో సంక్షోభంలో పడ్డట్టు కన్పిస్తున్న ఆప్ 6 స్థానాలతో మెరుగైన ప్రదర్శన చేస్తుందని సర్వే పేర్కొనడం విశేషం. ఇక అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న తెలంగాణలో 17 స్థానాలకు గాను కాంగ్రెస్‌కు 9 దక్కుతాయని, బీజేపీ 5, మజ్లిస్ ఒక స్థానం గెలుచుకుంటాయని వివరించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమికి తోడు నేతల వలస తదితరాలతో కుంగిపోయిన బీఆర్‌ఎస్ 2 స్థానాలకు పరిమితమవుతుందని తెలిపింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏకు 353 స్థానాలు రావడం తెలిసిందే. అందులో ఒక్క బీజేపీయే ఏకంగా 303 స్థానాలు సాధించింది. కాంగ్రెస్ కేవలం 52 సీట్లతో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయింది. యూపీఏకు 91, ఇతరులకు 98 సీట్లొచ్చాయి.

సోరెన్ భూమి అటాచ్

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆయన సన్నిహితులపై నమోదైన మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సోరెన్‌కు చెందిన రూ.31 కోట్ల విలువైన 8.86 ఎకరాల భూమిని అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలిపింది. సోరెన్‌తోపాటు భాను ప్రతాప్ ప్రసాద్, రాజ్ కుమార్ పహన్, హిలరియాస్ కచ్చప్, బినోద్ సింగ్‌లపై మార్చి 30వ తేదీన రాంచీలోని మనీ లాండరింగ్ నిరోధక(పీఎంఎల్ఏ) ప్రత్యేక కోర్టులో ఈడీ ఈమేరకు చార్జిషీట్ వేసింది. ఈ చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకున్నట్లు ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది.

అవినీతిపరులు ఒక్కటవుతున్నారు

విపక్షాలపై మోదీ ధ్వజం



గురువారం జముయి సభలో మోదీ, చిరాగ్ నవ్వులు

జమూయి/కూచ్‌బెహార్: అవినీతి కేసుల్లో ఇరుక్కున్నవారంతా మోదీపై యుద్ధం పేరిట ఒక్కటవుతున్నారని ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. ఆ కూటమిలో ఉన్న భాగస్వాములంతా పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకున్నవారేనని గుర్తుచేశారు. అవినీతిపరులను జైలుకు పంపించాలా? వద్దా? అని ప్రశ్నించారు. తాను అవినీతి నిర్మూలన గురించి మాట్లాడుతుండగా, ప్రతిపక్షాలు మాత్రం మోదీని ఓడించాలని ప్రజలకు పిలుపునిస్తున్నాయని తప్పుపట్టారు. గురువారం బిహార్‌లోని జమూయి జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. మన దేశానికి ముప్పుగా మారిన సీమాంతర ఉగ్రవాదాన్ని అరికట్టడంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు దారుణంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చి దాడులు చేస్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. చిన్నదేశాల నుంచి ముష్కరులు వచ్చిపడుతున్నా చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ఇతర దేశాల జోక్యాన్ని అనుమతించారని మండిపడ్డారు. దీనివల్ల భారత్‌కు బలహీన దేశమన్న చెడ్డ పేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియాను సులువుగా టార్గెట్ చేయొచ్చన్న అభిప్రాయం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకం వల్ల ప్రపంచం దృష్టిలో భారత్ పేద దేశంగా ముద్రపడిందని అన్నారు. యూపీఏ ప్రభుత్వ పాలనలో 26/11 ముంబై ఉగ్రవాద దాడుల కేసులో అమెరికా జోక్యాన్ని అనుమతించడాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

సీఏఏపై విపక్షాల తప్పుడు ప్రచారం

పౌరసత్వ సవరణ చట్టంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మోదీ మండిపడ్డారు. భరతమాతపై విశ్వాసం ఉన్నవారికి భారత పౌరసత్వం కల్పిస్తామని, ఇది మోదీ గ్యారంటీ అని వ్యాఖ్యానించారు. ఆయన పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్‌లో ప్రచారంలో పాల్గొన్నారు. అవినీతిపరులను కాపాడేందుకు ప్రతిపక్షాలు ఆరాటపడుతున్నాయని విమర్శించారు.

ఒపీనియన్ పోల్‌లో ట్రంప్ ముందంజ

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో విజయం ఎవరిదన్న దానిపై ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ ఏర్పడింది. మాజీ ప్రత్యర్థులు డొనాల్డ్ ట్రంప్, జో బైడెన్ మళ్లీ పోటీ పడుతున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అభిప్రాయం ఏమిటన్న దానిపై వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక ఒపీనియన్ పోల్ నిర్వహించింది. ఏడు కీలక రాష్ట్రాల్లో సర్వే చేయగా, ఏకంగా ఆరు రాష్ట్రాల్లో ట్రంప్ వైపు మొగ్గు కనిపించింది. తదుపరి అధ్యక్షుడిగా ట్రంప్‌ను ఎన్నుకోవడానికి ప్రజలు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ విధానాల పట్ల జనం అసంతృప్తిగా ఉన్నట్లు సర్వేలో వెల్లడయ్యింది.

ఈ చిన్నారి మృత్యుంజయుడు!

విజయపుర: ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయిన రెండేళ్ల చిన్నారిని 20 గంటల పాటు శ్రమించి, 16 అడుగుల లోతు నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ఎంతో ఉత్కంఠ రేపిన ఈ ఘటన కర్ణాటకలోని విజయపుర జిల్లా ఇండి తాలూకా లచియానా గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నపాటి గాయమైనా కాకుండానే బాలుడిని రక్షించిన సహాయక సిబ్బందిని గ్రామస్తులు ప్రశంసల్లో ముంచెత్తారు. లచ్యాణ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన రైతు శంకరప్ప మంగళవారం తన భూమిలో బోరుబావిని తవ్వారు. నీళ్లు పడకపోవడంతో దాన్ని వదిలేసి, మరో బోరు వేశారు. బుధవారం మధ్యాహ్నం శంకరప్ప మనవడు సాత్విక్ సతీశ్ ముజగోండ్ ఖాళీగా ఉన్న బోరుబావి వద్దకు ఆడుకుంటూ వెళ్లి అందులో పడిపోయాడు. బోరు బావి నుంచి ఏడుపు వినిపించడంతో గ్రామస్తులు సాయంత్రం 6.15 గంటల సమయంలో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు, ఫైర్, వైద్య, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఫైర్ సిబ్బంది తాడును లోపలికి వేసి, బాలుడి కాలికి గట్టిగా బిగుసుకునేలా చేశారు. బాలుడు మరింత లోతుకు జారిపోకుండా నివారించగలిగారు. పైపు సాయంతో ఆక్సిజన్‌ను సరఫరా చేశారు. 16 అడుగుల లోతులో చిన్నారి బండరాళ్ల మధ్య చిక్కుకున్నట్లు గుర్తించారు. బండరాళ్లు అడ్డురావడంతో నిట్టనిలువుగా, అర్ధరాత్రి దాటాక 2 గంటలకల్లా 21 అడుగుల లోతు మేర గుంత తవ్వారు. 20 గంటల తర్వాత గురువారం మధ్యాహ్నానికి చిన్నారిని బయటికి తెచ్చారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు పండుగ చేసుకున్నారు.

సోనియా ప్రమాణం

రాజ్యసభ సభ్యులుగా 14 మంది ప్రమాణం



సోనియాతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా 14 మంది రాజ్యసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గురువారం వారితో ప్రమాణం చేయించారు. ప్రమాణం చేసిన వారిలో కాంగ్రెస్ నేతలు అజయ్ మాకెన్, సయ్యద్ నాసర్ హుస్సేన్, బీజేపీ నేతలు ఆర్‌పీఎన్ సింగ్, మదన్ రాథోడ్, సామిక్ భట్టాచార్య, జేడీయూ నేత సంజయ్ కుమార్ ఝా, బీజేడీకి చెందిన సుభాశీష్ ఖుంటియా, దేబాశీష్ సామంతరాయ్, ఆంధ్రప్రదేశ్ నుంచివైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గొల్ల బాబూరావు, మేడా రఘునాథ రెడ్డి, యెర్రం వెంకట సుబ్బారెడ్డి, తెలంగాణ నుంచి బీఆర్‌ఎస్ నేత రవి చంద్ర వద్దిరాజు ఉన్నారు. ఒడిశా, రాజస్తాన్‌ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వారి పదవీ కాలం గురువారం నుంచి మొదలవుతుందని, మిగతా వారి పదవీ కాలం బుధవారం నుంచే ప్రారంభమవుతుందని రాజ్యసభ సెక్రటేరియట్ తెలిపింది. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్యసభ నేత పీయూశ్ గోయెల్, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, సెక్రటరీ జనరల్ పీసీ మోదీ పాల్గొన్నారు. 25 ఏళ్లుగా ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ ఎంపీగా కొనసాగుతున్న సోనియా, తొలిసారి రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఎంపికైన విషయం తెలిసిందే. ఆమె ప్రమాణ స్వీకారంపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే స్పందిస్తూ, 'రాజ్యసభలో ప్రమాణ స్వీకారం చేయడం ద్వారా సోనియా గాంధీ కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. ఆమెకు శుభాకాంక్షలు. ప్రస్తుత ప్రతికూలతల నేపథ్యంలో ఆమె సాహసోపేతమైన నిర్ణయాలు మా పార్లమెంటరీ వ్యూహానికి మార్గదర్శకంగా ఉంటాయి. ఎగువసభలో ఆమె రాక కోసం నాతోపాటు మిగతా ఎంపీలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆమె పదవీకాలం ఫలప్రదం కావాలని కోరుకుంటున్నా' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

టార్గెట్ 50 శాతం

వ్యూహాలకు పదును పెడుతున్న బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగానే 370కి పైగా స్థానాలను లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ, ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుకుని దాన్ని సాధించేలా వ్యూహరచన చేస్తోంది. మోదీ కరిష్మాకు తోడు పదేళ్ల పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. గతంలో కాస్త తేడాతో ఓడిన స్థానాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

కఠిన సవాలే

స్వతంత్ర భారత చరిత్రలో 17 లోక్‌సభ ఎన్నికల్లో ఏడుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు బీజేపీ, ఒకసారి జనతాపార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించాయి. కానీ ఏ పార్టీకీ 50 శాతం ఓట్లు రాలేదు! 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 48.1 శాతమే ఇప్పటిదాకా రికార్డు. ఆ తర్వాత ఏ లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు మెజారిటీ కానీ, 40 శాతం ఓట్లు కానీ రాలేదు. ఇక బీజేపీ 2014లో 31.4 శాతం ఓట్లతో 282 సీట్లు, 2019లో 37.7 శాతం ఓట్లతో 303 స్థానాలు సాధించింది. ఈసారి మరో 12 శాతం ఓట్ల కోసం చిన్నా పెద్దా పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుంది.

ఆ 100 స్థానాలపై గురి

50 శాతం ఓట్లు, 370 ప్లస్ సీట్ల సాధనకు బీజేపీ రెండంచెల వ్యూహం పన్నింది. 2014లో నెగ్గి 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన 35 స్థానాలపై ఫోకస్ పెంచింది. వీటిలో ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌లోనే 14 స్థానాలున్నాయి. బిహార్‌లో 6, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో రెండేసి చొప్పున ఉన్నాయి. వీటిని తిరిగి కైవసం చేసుకునేందుకు స్థానిక పార్టీలతో పొత్తులు పెట్టుకుంది. అక్కడ బలమైన అభ్యర్థులను బరిలో దింపుతోంది. ఇక కేవలం 2 నుంచి 3 శాతం ఓట్ల తేడాతో ఓడిన మరో 72 స్థానాలనూ బీజేపీ గుర్తించింది. అక్కడ సొంతంగా బలం పెంచుకునే యత్నాలకు పదును పెట్టడంతో పాటు జేడీ(ఎస్), జేడీ(యూ), ఎల్జేపీ, పీఎంకే, ఆరెడ్డీ, తమిళ మానిల కాంగ్రెస్ వంటివాటితో పొత్తులు పెట్టుకుంది. ఫైరవీలు, సీనియార్టీలను పక్కన పెట్టి గెలుపు అవకాశాలున్న వారికే టికెట్లిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు ఇప్పటికే ఏకంగా 103 మందికి పైగా సిట్టింగులను తప్పించింది. వారిలో కేంద్ర మంత్రులు మీనాక్షి లేఖీ, అశ్వినీకుమార్ చౌబే తదితరులు, హర్షవర్ధన్, సదానందగౌడ వంటి మాజీలున్నారు. వరుణ్‌గాంధీ వంటి నేతను కూడా మొహమాటం లేకుండా పక్కన పెట్టేశారు. అనంత్‌కుమార్ హెగ్డే, సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ వంటి వివాదాస్పదులకూ మొండిచేయి చూపారు.

సాక్షి హైదరాబాద్

7

శుక్రవారం ၊ 5 ၊ ఏప్రిల్ ၊ 2024



చెన్నై సూపర్ కింగ్స్ జట్టు



ఉప్పల్ స్టేడియంలో సన్ రైజర్స్ ఆటగాళ్లు

'కివీస్' కింగ్స్



ఇరు జట్ల కోచ్‌లు: స్టీఫెన్ ఫ్లెమింగ్, వెటోరి మాటామంతీ

పరుగుల విందుకు రె'ఢీ'

సాయంత్రానికి భాగ్యనగరంలో భానుడి భగభగ తగ్గాక... రాత్రి వేళ మైదానంలో అభిమానులకు పరుగుల విందు అందించేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ క్రికెటర్లు రె'ఢీ'గా ఉన్నారు. ఈ రెండు చాంపియన్ జట్ల మధ్య శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ జరగనుంది. గురువారం ఇరు జట్ల ఆటగాళ్లు తీవ్రంగా చెమటోడ్చారు. చెన్నై సూపర్ స్టార్ ధోని ప్రాక్టీస్ సెషన్‌కు హాజరుకాలేదు. చాలా రోజుల ముందే ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లన్నీ అమ్ముడుపోయాయి. దీంతో నేడు ఉప్పల్ స్టేడియం సన్‌రైజర్స్, చెన్నై అభిమానులతో నిండు పున్నమిలా కనిపించనుంది. ఐపీఎల్ టోర్నీ చరిత్రలో హైదరాబాద్, చెన్నై జట్లు ముఖాముఖిగా 19 సార్లు తలపడ్డాయి. 14 సార్లు చెన్నై గెలుపొందగా.. హైదరాబాద్ 5సార్లు విజయాన్ని అందుకుంది.

– సాక్షి, హైదరాబాద్

'కూన' ఇంటికి కాంగ్రెస్ పెద్దలు

- సొంత గూటికి రావాలని ఆహ్వానం
- నేడో, రేపో పార్టీలో చేరనున్న శ్రీశైలం గౌడ్?



కుత్బుల్లాపూర్: బీజేపీ నేత కూన శ్రీశైలం గౌడ్ సొంత గూటికి రావాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఆయన నివాసానికి తరలిరావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి, భూపతి రెడ్డి తదితరులు గురువారం రాత్రి కూన శ్రీశైలం గౌడ్‌తో భేటీ అయ్యారు. గతంలో పీసీసీ అధ్యక్ష పదవి రేవంత్ రెడ్డికి ఇవ్వడంలో అధిష్టానం నిర్లక్ష్యం వహిస్తున్న విషయంపై శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా సొంతగూటికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో పార్టీ పెద్దలు కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసినట్లు సమాచారం. కార్యకర్తలతో మాట్లాడి నిర్ణయం వెల్లడిస్తానని ఆయన చెప్పినట్లు, నేడో రేపో ఆయన చేరిక ఉంటుందని కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు.

నేడు జుమ్మాతుల్ విదా

సాక్షి, సిటీబ్యూరో: జుమ్మాతుల్ విదాను (రంజాన్ మాసంలో వచ్చే చివరి శుక్రవారం) పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జుమ్మాతుల్ విదా రోజు ముస్లింలు జుమా నమాజ్‌ను నగరంలోని జామే మసీదులో (పెద్ద మసీదుల్లో) చదవడానికి ఇష్టపడతారు. దీంతో పాటు చారిత్రాత్మక మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహించడానికి ప్రాధాన్యమిస్తారు. నగరంలోని వివిధ మసీదుల్లో జుమ్మాతుల్ విదా జుమా ఖుత్బా కోసం ముఫ్తీలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మౌలానాలు, మత గురువుల ప్రసంగాలు ఉంటాయి.

నిమ్స్ మెడికల్ రికార్డుల నిర్వీర్యానికి చర్యలు

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందిన రోగుల వైద్య సేవలకు సంబంధించిన మెడికల్ రికార్డు(ఎంఆర్‌డీ)ల ఫైళ్లను నిర్వీర్యం చేయనున్నట్టు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. ఆస్పత్రిలో గత కొన్నేళ్లుగా వేలాది రికార్డులు పేరుకుపోయినట్లు చెప్పారు. వాటిని సురక్షితంగా ఉంచేందుకు ఎంఆర్‌డీ ఎంతో కృషి చేస్తోందన్నారు. వాస్తవానికి ఎంఆర్‌డీ ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు భద్రపరుస్తామని చెప్పారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం పదేళ్లకోసారి రికార్డులను నిర్వీర్యం చేస్తామని చెప్పారు. ఈ క్రమంలోనే 2011 జనవరి 1 వరకు ఉన్న మెడికల్ రికార్డులను పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. ఇందుకు నిమ్స్ యాజమాన్యం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కాలవ్యవధిలో చికిత్స పొందిన రోగులు మెడికల్ రికార్డు అవసరమైతే దరఖాస్తు చేసుకుంటే అందజేస్తామన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన వాళ్లు, ఎంఎల్‌సీ రికార్డులు, ఇతర కేస్‌షీట్‌లు అవసరం అయితే మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయం లేదా ఎంఆర్‌డీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సత్యనారాయణ సూచించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు అందరూ సహకరించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నియోజకవర్గంలోని 1,944 పోలింగ్ కేంద్రాల పరిధిలో 22,06,654 ఓటర్లు ఉన్నారని తెలిపారు. హకీంపేట్‌లోని ఎంబసీ హైస్కూల్‌లో ఉన్న పోలింగ్ స్టేషన్ నంబర్ 218ని టోలిచౌకి కీస్ హైస్కూల్ లోకి, హకీంపేట్ ఎంబోసి పాఠశాలలోని 219 పోలింగ్ స్టేషన్‌ను టోలిచౌకిలోని ఎంసీహెచ్ కాలనీ మున్సిపల్ వార్డు ఆఫీస్‌కు మార్చేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

అనుదీప్ దురిశెట్టి

హిమాయత్‌నగర్: భారత ఎన్నికల సంఘం గుర్తించిన అత్యవసర సర్వీస్ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించేందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌పై జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర సర్వీస్ శాఖలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఒక నోడల్ అధికారి నియమించుకుని ఆ వివరాలను అందజేయాలన్నారు. సమావేశంలో కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ ఆకాష్, డీఆర్‌ఓ వెంకటాచారి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి డిప్యూటీ కలెక్టర్ అర్చన, అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్) మంగతాయారు పాల్గొన్నారు.

బీసీలకు 10 సీట్లు ఇవ్వాలి: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీలకు 10 సీట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్లపై పార్టీలు విధాన ప్రకటన చేసి మ్యానిఫెస్టోలో ప్రకటించాలన్నారు. గురువారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 లక్షల ఉద్యోగాలను ప్రకటించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని, లేదంటే చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఉత్తర ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్‌లలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. టికెట్ల కేటాయింపు, నియమిత పదవులలో బీసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నేతలు గువ్వల భరత్‌కుమార్, సుందర్, నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ సుధాకర్, నందగోపాల్, ఉదయ్, అంజి, రాజ్‌కుమార్, రామ్‌దేవ్, నిఖిల్, వాణి పాల్గొన్నారు.

సాంస్కృతిక వైభవాన్ని భావి తరాలకు అందించాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



బంజారాహిల్స్: భారతీయ సాంస్కృతిక వైభవాన్ని ఒక తరం నుంచి మరో తరానికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–4లోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో శివ అండ్ శక్తి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఆర్టిస్ట్ గిరిధర్‌గౌడ్‌చే రూపుదిద్దుకున్న మీనియేచర్ పెయింటింగ్స్‌ను ఆయన తిలకించారు. కార్యక్రమంలో సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్లలో 'ఆఫీస్ బబుల్స్'

హైటెక్ సిటీ, దుర్గం చెరువు, మాదాపూర్‌లలో ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో రైల్ వినూత్నమైన పద్ధతిలో మెట్రో స్టేషన్లలో 'ఆఫీస్ బబుల్స్'ను ఆవిష్కరించింది. మెట్రో స్టేషన్లలోనే కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న సంస్థలకు సురక్షితమైన రిమోట్ కో–వర్కింగ్ స్పేస్‌లుగా ఇవి దోహదపడనున్నాయి. నగరంలో ఆఫీస్ వర్క్ స్పేస్‌లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్ సంస్థ పేర్కొంది. విస్తృతమైన మెట్రో నెట్‌వర్క్ సదుపాయం ఉన్న అన్ని మెట్రో స్టేషన్లలో వ్యూహాత్మకమైన శాటిలైట్ ఆఫీసులను ఏర్పాటు చేసుకోవచ్చని అధికారులు చెప్పారు. హైటెక్ సిటీ, దుర్గం చెరువు, మాదాపూర్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఆఫీస్ బబుల్స్‌ను ఎల్ అండ్‌టీ మెట్రో రైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.రవిశంకర్, ట్రెండ్జ్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. శివ శరత్ రెడ్డి సారథ్యంలోని ట్రెండ్జ్ వర్క్‌స్పేస్ సంస్థ మెట్రోస్టేషన్లలో కమర్షియల్ ఆఫీస్ స్పేస్ ఆపరేటరుగా వ్యవహరించనుంది. ఈ మేరకు హైటెక్ సిటీ, దుర్గం చెరువు, మాదాపూర్ మెట్రో స్టేషన్లలో సుమారు 10 వేల చదరపు అడుగుల స్థలాన్ని ట్రెండ్జ్ సంస్థ లీజుకు తీసుకుంది. ఐటీ, ఫైనాన్స్, కన్‌స్ట్రక్షన్, తదితర రంగాలకు చెందిన సంస్థలు మెట్రో స్టేషన్లలో ఆఫీస్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. రవాణా ఆధారిత అభివృద్ధిలో భాగంగా కో–వర్కింగ్ స్పేస్‌లను 'ఆఫీస్ బబుల్స్'గా సరికొత్త కాన్సెప్ట్‌తో ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని కేవీబీ రెడ్డి అన్నారు. సిబ్బంది రాకపోకలకు కూడా ఎంతో అనుకూలంగా ఉంటుందని చెప్పారు.

వాటర్ మాఫియా!

అల్లాపూర్‌లో నీటి అక్రమ దందా



నీటిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకర్లు

- రోజుకు రూ. కోట్లలో వ్యాపారం
- నిత్యం 10 వేల ట్యాంకర్లు
- 3 చెరువుల చుట్టూ 1000 బోర్లు
- హైటెక్ సిటీ ప్రాంతాల్లో విక్రయాలు
- హోటళ్లు, కాలనీలకు సరఫరా
- ఒక్కో ట్యాంకర్‌కు రూ.900–1500
- మురుగు కాల్వల్లో సైతం బోర్ల తవ్వకాలు
- చూసీచూడనట్లుగా అధికార యంత్రాంగం

నీటి కోసం మట్టిని పిండేస్తున్నారు. అక్రమ దందాతో కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, సున్నం చెరువు ప్రాంతాలను అడ్డాగా చేసుకొని.. వీటి చుట్టూ నిర్మించిన ఇళ్లల్లో సుమారు 1000 వరకు బోర్లు తవ్వి నిత్యం 10 వేల ట్యాంకర్ల మేర నీటిని తరలిస్తున్నారు. హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లో ఈ నీటిని విక్రయిస్తున్నారు. అక్రమ దందాతో ప్రతి రోజూ రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. ఒక్కో ట్యాంకర్‌కు రూ.900 నుంచి రూ.1500 వసూలు చేస్తున్నారు. నీటి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు వాటర్ మాఫియాగా మారి భూగర్భ జలాలను చెరబడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగంలో మాత్రం ఉలుకూ పలుకూ లేకుండాపోయింది. అవినీతి జలగలు సాగిస్తున్న ఈ అక్రమ దందాపై ప్రత్యేక కథనం.

– కూకట్‌పల్లి

అల్లాపూర్ డివిజన్ కాముని చెరువు సమీపంలో సర్దార్‌నగర్ ప్రాంతంలో 80 గజాల ఇళ్లలోనే బోర్ల తవ్వకాలు చేపట్టిన ఇంటి యజమానులు రూ.3 లక్షలకు నీటి వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. అలాగే మైసమ్మ చెరువు, సున్నం చెరువు సమీపంలో సైతం బోర్లు వేసి నీటిని అక్రమంగా తరలిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా హైటెక్ సిటీలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఒక కాముని చెరువు ప్రాంతంలోనే సుమారు 400 వరకు బోర్ల తవ్వకాలు చేపట్టినట్లు సమాచారం. ఈ ఇళ్లల్లో వేసిన బోర్లతో నీటిని పైపులైన్ల ద్వారా పైకి కనిపించకుండా చెరువు మధ్యలోంచి దూరంగా నీటి విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచి ట్యాంకర్లకు సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ కాముని చెరువు నుంచి 3 వేల ట్యాంకర్ల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. కాముని చెరువు పక్కనే ఉన్న ఓ నాలాలో డ్రైనేజీ నీటిలోనే ఓ వ్యాపారి బోరు వేసి ఆ నీటినే ఫిల్టర్ చేసి తాగునీరుగా విక్రయిస్తున్నాడు.

ఒక్కో ఇంటి నుంచి అధికారులకు రూ.30 వేలు..

ఈ అవినీతి తతంగాన్ని స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నెలరోజులుగా జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదు చేసిన సమయంలో చర్యలు తీసుకుంటామని కాలం గడుపుతున్నారు. అధికారులకు ఒక్కో ఇంటి నుంచి నెలకు రూ.30 వేలు మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాముని చెరువు ప్రాంతంలోనే సుమారు 200 ఇళ్లలో నీటి అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది.

ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోనే..

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, సున్నం చెరువు ప్రాంతాల్లో తవ్విన అక్రమ బోర్ల నిర్వహణలో ఆరోగ్య శాఖ అధికారుల పాత్ర కీలకంగా మారింది. ఆరోగ్య శాఖ అధికారులు మామూళ్ల మత్తులో వాటర్ ప్లాంట్లపై ఎలాంటి పర్యవేక్షణ చేయకుండా అక్రమంగా సాగుతున్న నీటి వ్యాపారులకు అండగా నిలుస్తున్నారు. డ్రైనేజీ నీటితో నిండిన ఆయా చెరువుల్లో నీటి దందా చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మూసాపేట సర్కిల్ పరిధిలోని ఆరోగ్యశాఖ అధికారికి స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అల్లాపూర్ డివిజన్‌లో వరద నీటి కాల్వలతో పాటు మురుగునీటి నాలాల్లో కూడా నీటి వ్యాపారం కొనసాగుతోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



నీటిని ట్యాంకర్లలో నింపుతున్న దృశ్యం



సర్దార్ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఖాళీ జాగాలకే విద్యుత్ మీటర్లు...

ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇళ్లల్లో ఉంటున్న వారికి, సామాన్య ప్రజలకు మీటర్ ఇవ్వాలంటే సవాలక్ష ప్రశ్నలతో వేధించే విద్యుత్ శాఖ అధికారులు ఇక్కడ ప్రాంతంలో ఖాళీ జాగాలకే విద్యుత్‌మీటర్లు కేటాయించటమే కాకుండా 80 గజాల్లోనే 4 మీటర్లు ఏర్పాటు చేయటం విశేషం. ఒక్కో ఇంటికి 4 మీటర్లు, 4 బోర్లు ఏర్పాటు చేసి నెలకు 3 లక్షల రూపాయల చొప్పున నీటి వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. ఈ విషయంలో అధికారులను ప్రశ్నించగా వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని నీళ్లు నములుతూ సమాధానం చెబుతున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఇక్కడి మీటర్లపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

అక్రమార్కులపై కేసులు పెట్టండి: ఎమ్మెల్యే

మోతీనగర్: ఎలాంటి నిర్మాణాలు లేకుండా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయటం ఆ శాఖ అధికారుల అసమర్థతకు నిదర్శనం అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్దార్ నగర్‌లో అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న ప్రాంతాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో ఇంట్లో అక్రమంగా నాలుగేసి బోర్లు వేసి నీటి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని, చెరువు కట్ట కిందినుంచి పైపులను వేసి నీటిని తోడేస్తున్నారని తెలిపారు. అక్రమార్కులను గుర్తించి కేసులు పెట్టకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తిరిగి అక్రమంగా బోర్లు వేసినా, వాటర్ ప్లాంట్‌లు కొనసాగించినా జీహెచ్‌ఎంసీ రెవెన్యూ, ఇరిగేషన్, సంబంధిత ఉన్నతాధికారులపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. గురువారం ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు సర్దార్‌నగర్‌లో అక్రమంగా వెలసిన 11 బోర్లను జేసీబీలతో ధ్వంసం చేశారు.

తుక్కుగూడలో.. ఉక్కు సంకల్పంతో

ఇక్కడి నుంచే కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

- పార్టీకి ఉన్న ప్రజాదరణను దశదిశలా చాటేలా..
- భారీ జన సమీకరణకు ఏర్పాట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే వేదికగా ఆరు గ్యారంటీలను ప్రకటించి.. అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే సెంటిమెంట్‌ను కొనసాగించాలనే ఉక్కు సంకల్పంతో ఉంది. 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన వేదికకు అటూ ఇటూ మూడు భారీ వేదికలను ఏర్పాటు చేయనుంది. రాజీవ్ ప్రాంగణంగా నామకరణం చేశారు. ఏఐసీసీ ముఖ్య నేతలు సహా ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు ఇలా 250 మంది వరకు ఆసీనులయ్యేలా భారీ వేదికను ఏర్పాటు చేస్తోంది. ప్రధాన వేదిక సహా లైటింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు, కుర్చీలు, గ్యాలరీల ఏర్పాటు పనులు చకచకా సాగుతున్నాయి. ఈ నెల 6న సాయంత్రం 5 గంటలకు ఏఐసీసీ ముఖ్య నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర నేతలు హాజరు కానున్నారు. కాంగ్రెస్ జాతీయ గ్యారంటీలను ప్రకటించనున్నారు.

ఏర్పాట్లపై వరుస సమీక్షలు..

- ఇటు ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు. అటు వరంగల్ నుంచి మహబూబ్‌నగర్ వరకు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి భారీగా జనాన్ని సమీకరించాలని నిర్ణయించింది. తుక్కుగూడ వేదిక ద్వారా తెలంగాణలో కాంగ్రెస్‌కు ఉన్న ప్రజాదరణను దేశానికి చాటి చెప్పనుంది.
- టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం తుక్కుగూడ సభ ఏర్పాట్లను సమీక్షించారు. ఆ తర్వాత రెండో రోజు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. తాజాగా గురువారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభాస్థలిని సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. సాయంత్రం 7 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు మంత్రులు తుక్కుగూడకు చేరుకుని ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

చేరికలపై ఊహాగానాలు..

ఒకవైపు జనజాతర సభకు ఏర్పాట్లు చేస్తూనే.. మరో వైపు బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి భారీ చేరికలకు వ్యూహాలు రచిస్తున్నారు. జనజాతర సభకు ఏఐసీసీ ముఖ్య నేతలు హాజరవుతుండటంతో వీరి సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి మూకుమ్మడి చేరికలకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 12 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఇదే వేదికగా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వీరిలో జిల్లాకు చెందిన పలువురు ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు కూడా ఉండనున్నారనే ప్రచారం జరుగుతోంది.

వాడేద్దాం.. అమ్మేద్దాం!

అపార్ట్‌మెంట్లలో వినియోగించిన నీరు బయట విక్రయం

- శుద్ధి చేసిన జలాలు రోడ్లు, భవన నిర్మాణ అవసరాలకు తరలింపు
- గ్రేటర్‌లో నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం
- బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లోనూ అమలు చేయాలని సూచన
- జలమండలిపై వాణిజ్య నీటి సరఫరా భారం తగ్గే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: నీటిని వృథా చేస్తే భవిష్యత్‌లో హైదరాబాద్‌లోనూ బెంగళూరు తరహా నీటి ఎద్దడి ఎదురవడం ఖాయం. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలంటే ముందుగానే మేల్కోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బెంగళూరులో తరహాలోనే నగరంలోనూ గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ సంఘాలలో వినియోగించిన నీటిని శుద్ధి చేసిన నీటిని రోడ్లు, భవన నిర్మాణ అవసరాలకు విక్రయించే వీలు కల్పించాలని సూచిస్తున్నారు. దీంతో జలమండలిపై వాణిజ్య నీరు సరఫరా భారం, వాణిజ్య సంస్థలు బోరుబావులపై ఆధారపడటం తగ్గుతుంది. గ్రేటర్‌లో నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

40 శాతం నీరు వృథానే..

ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా 660 ఎంజీడీల నీటి డిమాండ్ ఉండగా.. జలమండలి 565 ఎంజీడీల వరకు సరఫరా చేస్తోంది. డిమాండ్‌కు, సరఫరాకు మధ్య దాదాపు వంద ఎంజీడీలు వ్యత్యాసం ఉంటోంది. జలమండలి కృష్ణా, గోదావరి, మంజీరా, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల నుంచి నీటిని సమీకరిస్తోంది. సరఫరా అవుతున్న నీటిలో 40 శాతం వృథా అవుతున్నాయి. ప్రతీ అపార్ట్‌మెంట్‌లో మురుగు నీరు ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. అయితే.. చిన్న అపార్ట్‌మెంట్లలో పెద్ద గార్డెన్‌లు, ఇంకుడు గుంతల కోసం తగినంత స్థలం ఉండదు. చాలా వరకు బాత్‌రూమ్‌లలో ఫ్లషింగ్ నీటి కోసం ద్వంద్వ పైప్‌లైన్లు ఉండవు. దీంతో శుద్ధి చేసిన నీటిని గార్డెనింగ్, ఇతరత్రా అవసరాలకు వినియోగించలేకపోతున్నారు. అంతేకాకుండా నివాసిత సంఘాలలో శుద్ధి చేసిన నీటిని చెరువులలో, నాలాలలో వృథాగా పారబోస్తుంటారు.

నిర్మాణ అవసరాలకు మళ్లింపు..

శేరిలింగంపల్లి, కోకాపేట, మంచిరేవులు, ఎల్బీనగర్, ఉప్పల్, శామీర్‌పేట వంటి నగరం నలువైపులా భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. బోరుబావులపైనే ఆధారపడే డెవలపర్లు నిర్మాణాలు చేపడుతుంటారు. దీంతో ఏటా భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రతీ నివాస సముదాయంలో మురుగు శుద్ధి కర్మాగారం (ఎస్‌టీపీ), ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ.. చాలా వరకు పాటించడం లేదు. ఒకవేళ ఉన్నా నిర్వహణ సరిగా లేక పాడైపోతున్నాయి. దీంతో బోరుబావులు, నీటి ట్యాంకర్ల కోసం జలమండలి ఆధారపడక తప్పని పరిస్థితి. అమెరికా వంటి అభివృద్ధి చేసిన దేశాలలో ఇళ్లలో వినియోగించిన నీటిని బాగా శుద్ధి చేసి వాటినే త్రాగుతారు కూడా. ఆ స్థాయిలో కాకపోయినా కనీసం ఈ శుద్ధి చేసిన నీటిని రహదారులు, భవన నిర్మాణ అవసరాలకు తప్పనిసరిగా వినియోగించే మార్గదర్శకాలు జారీ చేయాలని కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ (క్రెడాయ్) హైదరాబాద్ అధ్యక్షులు వీ రాజశేఖర్ రెడ్డి సూచించారు. ఎస్‌టీపీల నిర్వహణ భారం నివాసిత సంఘాలు తగ్గడంతో పాటు ఆదాయం సమకూరుతుండటంతో శ్రద్ధ చూపిస్తారని పేర్కొన్నారు.

ఏం చేయాలంటే..


- ప్రస్తుతం నీటి సరఫరా కోసం ఎలాగైతే ప్రత్యేక పైపులైన్లు ఉన్నాయో.. అదే తరహాలో శుద్ధి చేసిన నీటిని తరలించేందుకు ప్రత్యేకంగా పైపులైన్లు ఏర్పాటు చేయాలి.
- ఆర్థిక భారం కారణంగా ఎస్‌టీపీ, ఇంకుడు గుంతలను అపార్ట్‌మెంట్ సంఘాలు నిర్వహణ చేయడం లేదు. అలాకాకుండా మూసీ పరీవాహక ప్రాంతాలలో ప్రభుత్వమే ఎస్‌టీపీలను ఏర్పాటు చేయాలి. అక్కడికే అపార్ట్‌మెంట్లలో వినియోగించిన నీటిని తరలించే ఏర్పాట్లు చేయాలి. అక్కడి నుంచి ప్రత్యేక పైపులైన్ల ద్వారా భవన నిర్మాణ అవసరాలకు తరలించాలి.
- త్రాగునీటిని పంపిణీ చేసినట్లే శుద్ధి చేసిన నీటిని రవాణా చేయడానికి ప్రత్యేకంగా ట్యాంకర్లను ఏర్పాటు చేయాలి.

నిర్మాణ అవసరాలకు వినియోగించాలి



ప్రస్తుత పరిస్థితులలో నిర్మాణ రంగంలో రీసైకిల్ నీటిని వాడటం చాలా ముఖ్యం. బెంగళూరు తరహాలో సిటీలోనూ అమలు చేస్తే బాగుంటుంది. భూగర్భ జలాల పరిస్థితికి అనుగుణంగా ఈ శుద్ధి నీటిని అపార్ట్‌మెంట్ల నుంచి సేకరించి వినియోగించాలి.

– బీటీ శ్రీనివాసన్, జనరల్ సెక్రటరీ, యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్



ప్రభుత్వ పాఠశాలలో రూఫ్‌టాప్ సోలార్ ఎనర్జీ


సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గోల్కొండ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గ్రీన్ సోలార్ ఎనర్జీ ప్లాంట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీఈవో రేఖా శ్రీనివాసన్ అన్నారు. గురువారం ఆమె గోల్కొండ రేతిగల్లీలోని సెకండ్ లాన్సర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోలార్ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులో భాగంగా తెలంగాణలోని 65 ప్రభుత్వ పాఠశాలలు, ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రీన్ సోలార్ ఎనర్జీ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని వల్ల విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన పెంపొందించడమే కాకుండా కర్బన ఉద్గారాల వినియోగం వల్ల జరిగే అనర్థాలను నివారించవచ్చునన్నారు. హెచ్ఎస్‌బీసీ సహకారంతో ఈ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాజీద్ హాష్మీ మాట్లాడుతూ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, హెచ్ఎస్‌బీసీ సోలార్ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌కు తమ పాఠశాలను ఎంచుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తమ పాఠశాలలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పలు ప్రాజెక్టులను ఏర్పాటు చేశారని, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల సహకారంతో అన్నీ విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ సర్వీస్ సెంటర్స్, హెచ్ఎస్‌బీసీ మమత మాదిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

లైలా.. ఓ అంబాసిడర్

లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి

- ట్రాన్స్‌జెండర్‌లలో అవగాహన పెంచేందుకు క్యాంపెయిన్
- మొట్టమొదటిసారి ట్రాన్స్‌జెండర్ అంబాసిడర్‌ను నియమించిన ఎన్నికల కమిషన్
- సంక్షేమం, సామాజిక భద్రత అవసరమంటున్న లైలా



సాక్షి, సిటీబ్యూరో: లైలా ఓరుగంటి.ఒక ట్రాన్స్‌జెండర్. దశాబ్దాలుగా ట్రాన్స్‌జెండర్‌ల హక్కులు, సంక్షేమం, సామాజిక భద్రత కోసం పని చేస్తున్న సామాజిక కార్యకర్త. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఆమెను అంబాసిడర్‌గా నియమించారు. వివిధ సామాజిక వర్గాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు, అన్ని వర్గాలకు చెందిన వారు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఎన్నికల కమిషన్ వినూత్నమైన కార్యక్రమాలను చేపట్టింది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ చేపట్టిన క్యాంపెయిన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి లైలా ఎన్నికల అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. ఎన్నికల కమిషన్ నిర్వహించే కార్యక్రమాలతో పాటు ప్రత్యేకంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని కొనసాగించనున్నారు.'తెలంగాణలో సుమారు 1.5 లక్షల మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు.కానీ ఓటర్లుగా నమోదైన వాళ్లు కనీసం 3 వేల మంది కూడా లేరు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉంది.'అని లైలా అభిప్రాయపడ్డారు.

వివక్ష తొలగలేదు...

చాలామంది ట్రాన్స్‌జెండర్‌లుగా జీవనం కొనసాగిస్తున్నప్పటికీ ఓటింగ్‌లో మాత్రం 'పురుషులు' లేదా 'మహిళలు'గా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.'ట్రాన్స్‌జెండర్‌లు'గా నమోదు కావడం లేదు. దీంతో సామాజికంగా లక్షన్నర మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నప్పటికీ ఈ ఎన్నికల్లో కేవలం 2,737 మంది మాత్రమే ట్రాన్స్‌జెండర్‌లుగా నమోదయ్యారు. ఈ వర్గం పైన ఉండే సామాజిక వివక్ష కారణంగా తమ ఉనికిని చాటుకొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. సాధ్యమైనంత వరకు గోప్యంగా జీవించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సంఖ్య రీత్యా మెజారిటీగా ఉండే ఓటర్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపే రాజకీయ పార్టీలు ట్రాన్స్‌జెండర్‌లను గుర్తించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం సైతం పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ సామాజిక రుగ్మతను తొలగించుకొనేందుకు ప్రతి ట్రాన్స్‌జెండర్ ఓటరుగా నమోదు కావలసి ఉందని లైలా పేర్కొన్నారు. గత పదేళ్లలో ట్రాన్స్‌జెండర్‌ల సంఖ్య రెట్టింపయింది.'అనేక రకాలుగా 'ట్రాన్స్'గా జీవనం కొనసాగిస్తున్నవాళ్లు ఉన్నారు.కానీ కుటుంబం నుంచి ఎదురయ్యే వివక్ష, అవమానాల కారణంగా ఇళ్ల నుంచి బయటకు వచ్చిన వాళ్లు నిర్భయంగా తమ ఉనికిని చాటుకోలేకపోతున్నారు.' అని చెప్పారు. మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే కమ్యూనిటీకి చెందిన పుష్ప ఎన్నికల్లో పోటీ చేయగా, 2018లో జరిగిన ఎన్నికల్లో చంద్రముఖి ఎన్నికల బరిలో నిలిచారు. ట్రాన్స్ కమ్యూనిటీలో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు ఈ పోటీ ఎంతో దోహదం చేసిందని ఆ వర్గానికి చెందిన పలువురు అభిప్రాయపడ్డారు.ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ లైలాను అంబాసిడర్‌గా నియమించడాన్ని కూడా ట్రాన్స్‌జెండర్‌లు, సామాజిక సంస్థలు ఆహ్వానిస్తున్నాయి.కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సోషియాలజీలో ఎంఏ చదివిన లైలా ... స్వచ్ఛంద సంస్థల ద్వారా ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు.

పథకాలు అందడం లేదు...

వివిధ కారణాల వల్ల ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఎలాంటి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేకుండా బతుకుతున్న తమను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, చదువుకున్న వాళ్లకు కూడా ఉద్యోగాలు లభించడం లేదని లైలా ఆవేదన వ్యక్తం చేసింది. దివ్యాంగులు, పేద మహిళలు, తదితర వర్గాలకు లభించే రాయితీ సదుపాయాలు కూడా తమకు అందడం లేదని, అణగారిన వర్గాలకు ఇళ్లు, ఇంటిస్థలాలు అందజేస్తున్నట్లుగానే తమకు కూడా సొంత ఇళ్లకు ఆర్థికసహాయం అందజేయాలని ఆమె కోరారు. ఈ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్‌ల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు విస్తృతంగా ప్రచారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌ల సంఖ్య : 1.50 లక్షలు

- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్‌లుగా నమోదైన ఓటర్లు : 2000
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న వారు : 2,885
- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లు : 2,557
- ప్రస్తుతం జరుగనున్న 2024 లోక్‌సభ ఎన్నికల కోసం నమోదైన ట్రాన్స్‌జెండర్ ఓటర్లు : 2,737.

అగ్గిపెట్టె అడిగి.. సెల్‌ఫోన్ లాక్కెళ్లాడు..

పంజగుట్ట: అగ్గిపెట్టె ఉందా అంటూ మాటలు కలిపి సెల్‌ఫోన్ లాక్కుని పరారైన సంఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్, గోకుల్‌నగర్‌కు చెందిన సాయికుమార్ క్యాబ్‌డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం అతను అమీర్‌పేటలో క్యాబ్ నిలుపుకుని బయట నిలబడ్డాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి అన్నా అగ్గిపెట్టె ఉందా.. అంటూ మాట కలిపి అతడి చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయాడు. అతడి పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు పంజగుట్ట కేసు నమోదు చేసుకున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి వివరాలు ఆరా తీస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి నిజాంపేట్ మేయర్

నిజాంపేట్: కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలారెడ్డితో పాటు ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, పలువురు కార్పొరేటర్లు గురువారం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిజాంపేట్ మేయర్ నీలారెడ్డితో పాటు కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు ప్రయత్నించారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు సంప్రదింపులు జరపడంతో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది. బుధవారం రాత్రి బాచుపల్లి హిల్‌కౌంటీలో ఎమ్మెల్యే వివేకానంద తో కలిసి బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న మేయర్ ఉదయమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.


మేయర్ నీలారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పిన సీఎం రేవంత్‌రెడ్డి


కాంగ్రెస్‌చేరిన మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్లతో కొలన్ హన్మంతరెడ్డి, భూపతిరెడ్డి తదితరులు..

సమన్వయం కుదిరేనా ?

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌తో పాటు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరడంతో పాత నాయకులతో వీరికి సఖ్యత కుదురుతుందా అని చర్చ జరుగుతోంది. మేయర్ చేరికను నిన్నటి వరకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి, భూపతిరెడ్డి, కొలను శ్రీనివాస్‌రెడ్డి వ్యతిరేకించారు. ఈ విషయాన్ని పార్టీ పెద్దలకు సైతం వివరించారు. అంతేగాక గురువారం నిజాంపేట్‌లో కొలను శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం కుదురుతుందా? మొన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న వారు ఒక్కసారిగా మిత్రులుగా మారి కలిసి పనిచేసే అవకాశం ఉంటుందా? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి కోసమే పార్టీ మారాం: మేయర్

నిజాంపేట్ అభివృద్ధి కోసమే తాము కాంగ్రెస్ పార్టీలో చేరామని మేయర్ కొలను నీలారెడ్డి, కార్పొరేటర్లు తెలిపారు. నిజాంపేట్‌లో మిగిలిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అందుకు ప్రభుత్వంతో మరిన్ని నిధులు కేటాయించేందుకే తాము కాంగ్రెస్‌లో చేరామన్నారు. ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి, ఇంద్రజిత్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాజేశ్వరి చౌదరి, అవుల ప్రసన్న, కో ఆప్షన్ సభ్యురాలు వాణి, నాయకులు శ్రీకర్‌రెడ్డి, జగదీష్ యాదవ్, వెంగయ్య చౌదరి,అభిషేక్ రెడ్డి, సబిత జలంధర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

వలసలు ముమ్మరం

సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పలువురు నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చేరికలను మరింత ముమ్మరం చేసింది. బీఆర్ఎస్‌ను అధికారం నుంచి దూరం చేయడంతో పాటు ఆతర్వాత చేవెళ్ల లోక్‌సభా స్థానం పరిధిలోని అనేక మందిని తమ పార్టీలో చేర్చుకుంది. సిట్టింగ్ ఎంపీ సహా, సిట్టింగ్ జెడ్పీ చైర్ పర్సన్లు, మాజీ ఎమ్మెల్యేలను పార్టీలోకి ఆహ్వానించి షాక్‌ల మీద షాక్‌లు ఇస్తుంది. తాజాగా స్థానిక ఎంపీ, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డాక్టర్‌జి. రంజిత్‌రెడ్డి నేతృత్వంలో బీజేపీ, బీఆర్ఎస్లకు చెందిన ముఖ్య కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరిలో సరూర్‌నగర్ మాజీ జెడ్పీటీసీ జిల్లెల నరేందర్‌రెడ్డి, కందుకూరు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సిద్దాల దశరథ, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు బచ్చన బోయిన నరసింహ యాదవ్, కార్పొరేటర్ బచ్చన బోయిన పద్మ, రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అనిత నాయక్, తుక్కుగూడ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ భవానీవెంకట్‌రెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు ఇక్బాల్‌బిన్‌ఖలీఫా, జల్పల్లి మున్సిపాలిటీ వైస్‌చైర్మన్‌యూసుఫ్‌పటేల్, కౌన్సి లర్ తేజస్విని శ్రీకాంత్, కొండల్‌యాదవ్, కౌన్సిలర్‌అవల్లీ, జిల్లెలగూడ మాజీ సర్పంచ్ జిల్లెల్ల వనిత నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు చల్వాది రాజేష్, దేరంగులు యాదయ్య, బొబ్బిలి కిరణ్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొబ్బిలి విజయ్ గౌడ్, భీమ్ రాజ్ శంకర్, శ్రీ కాంత్, బద్దం అనిల్ గౌడ్, గ్యార అనిల్ కుమార్, తదితరులు ఉన్నారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని శంకర్‌పల్లి జెడ్పీటీసీ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు లక్ష్మమ్మ రాంరెడ్డి, శ్వేతా పాండురంగారెడ్డి, చంద్రమౌళి, అశోక్, శ్రీనాథ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు రజిని శ్రీనివాస్, మహమూద్, నాయకులు బాలకృష్ణ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, రఘునందన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నిబంధనలు పాటించాల్సిందే..

- ఎయిర్‌పోర్టు సమీపంలోని నిర్మాణాల ఎత్తుపై ఆంక్షలు
- ఇప్పటికే ప్రహరీ సమీపంలో భారీ నిర్మాణాలు
- మున్సిపాలిటీ నుంచి వివరాలు సేకరించిన ఎయిర్‌పోర్టు భద్రతా విభాగం
- ఎన్‌ఓసీ లేకుంటే చర్యలు తప్పవు

శంషాబాద్ : ఎయిర్‌పోర్టు భద్రతా విభాగం మరోసారి అప్రమత్తమైంది. ఎయిర్‌పోర్టుకు ప్రహరీకి అత్యంత సమీపంలో చేపట్టే నిర్మాణాలు, హోర్డింగ్‌లు, చెట్ల పెంపకంపై వాటి ఎత్తులపై ఆంక్షలు విధించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్‌ను పొంది వారి నిబంధనలకు అనుగుణంగానే ఇక్కడ కట్టడాలు చేపట్టాల్సి ఉంటుంది. గత కొన్నేళ్లగా ఎయిర్‌పోర్టు ప్రహరీని ఆనుకుని అనేక అక్రమ వెంచర్లు వెలిశాయి. ధర్మగిరి రహదారి ఏకే టౌన్‌షిప్ తదితర వెంచర్లు ఇందులో ఉన్నాయి.



ఏరోడ్రోమ్ సేఫ్టీసెల్ విడుదల చేసిన పోస్టర్

మరో వైపు గొల్లపల్లి పరిధిలో భారీ వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ విలాసవంతమైన భారీ బంగళాల నిర్మాణాలు ఊపందుకున్నాయి. భవిష్యత్తులో విమానాల రాకపోలు, భద్రతా విషయంలో ఎత్తైన నిర్మాణాలు ఇబ్బదికరంగా పరిణమించే అవకాశముందని భావించిన ఎయిర్‌పోర్టు భ భద్రతా విభాగం మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా ఆయా నిర్మాణాల వివరాలు సేకరించింది. కొన్ని నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించింది. ఇకపై ప్రహరీ సమీపంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా వాటి ఎత్తుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఎయిర్‌పోర్టు అథారిటీ విభాగానికి దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాల్సిందిగా పోస్టర్లను సైతం విడుదల చేసింది. నిబంధనలకు వ్యతిరేకంగా చేపట్టబోయే నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని నిర్మాణదారులు సీరియస్‌గా పరిగణించాలని పేర్కొంది. ఈ మేరకు మున్సిపాలిటీల అధికారులకు సైతం సూచనలు చేసింది.

ఎలాంటి అనుమతులు లేవు..

ఎయిర్‌పోర్టు ప్రహరీ సమీపంలోని ఏ వెంచర్‌లో కూడా నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి లేదు. జీవో 111 పరిధిలో ఉన్న కారణంగా అనుమతులు జారీ చేసే అవకాశం లేదు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఇటీవల ఇందుకు సంబంధించిన వివరాలు సేకరించింది. – శ్రీనివాస్ టౌన్‌ప్లానింగ్ అధికారి

చేపలు పట్టేందుకు వెళ్లి బాలుడి గల్లంతు

మూసాపేట్: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ బాలుడు చెరువులో పడి గల్లంతైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలాజీ నగర్, శాంతి భూషణ్ బ్లేస్డ్ హోమ్ సొసైటీకి చెందిన ముగ్గురు బాలురు ఐడీఎల్ చెరువు సమీపంలో కుమ్మరి బావిలో గురువారం చేపలు పట్టేందుకు వెళ్లారు. వీరిలో సందీప్ (13) అనే బాలుడు చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. అతడి స్నేహితులు సందీప్‌ను బయటికి లాగేందకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో అతను నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానిక పోలీసులు డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సందీప్(ఫైల్)

నిజాం మ్యూజియంలో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం

యాకుత్‌పురా: రంజాన్ నేపథ్యంలో పాతబస్తీ పురానీహవేలీలోని హెచ్ఈహెచ్ నిజాం మ్యూజియం సిటీ గ్యాలరీలో ఇస్లాం మత గ్రంథం ఖురాన్ ప్రాముఖ్యతపై ఏర్పాటు చేసిన గ్లోరియస్ ఖురాన్ ఉచిత ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమీర్–ఇ–మీల్లాత్–ఇ–ఇస్లామీయా సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నిర్వాహకులు రెండో మౌలానా మహ్మద్ హుసాముద్దీన్ జఫర్ పాషా ప్రారంభించారు. అనంతరం ఆయన ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఫొటోలను తిలకించారు. ఫొటోలు, ఖురాన్‌కు సంబంధించిన చిత్రాల ప్రముఖ్యతను మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ అహ్మద్ అలీ వివరించారు. కార్యక్రమంలో మ్యూజియం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సయ్యద్ హైదర్ హుస్సేనీ, పలువురు ఇస్లాం ప్రముఖులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మౌలానా మహ్మద్ హుసాముద్దీన్ జఫర్ పాషా

అంబేడ్కర్ ఏక్తామంచ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా శ్వేతహసేన్

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ అంబేద్కర్ రాష్ట్రీయ ఏక్తా మంచ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా తల్లమల్ల శ్వేత హసేన్ నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏక్తామంచ్ జాతీయ అధ్యక్షులు భావనాథ్ పాశ్వన్, ప్రధాన కార్యదర్శి కరణం కిషన్ ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. ఓయూలో మూడు పీజీ డిగ్రీలు పూర్తి చేసిన శ్వేతహసేన్ ఇటీవల గురుకుల పాఠశాల టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా సమ సమాజ నిర్మాణం, మహిళా సాధికారత కోసం కృషి చేయనున్నట్లు శ్వేత హసేన్ పేర్కొన్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న శ్వేత హసేన్

50 వేల మైలు రాయి దాటిన ఇపియోన్ పెయిన్ క్లినిక్

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాల శారీరక నొప్పులు, బాధల నుంచి విముక్తి కలిగించే చికిత్సలను అందజేస్తున్న బంజారాహిల్స్‌లోని ఇపియోన్ పెయిన్ క్లినిక్ రీ జనరేటివ్ థెరపీ సెంటర్ ఇప్పటి వరకు 50 వేల క్లినిక్ ప్రక్రియలను పూర్తి చేసుకున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ సుధీర్ ధారా, సహ వ్యవస్థాపకులు డాక్టర్ మినల్ చంద్ర తెలిపారు. ప్లాస్మా థెరపీ వంటి పద్ధతులతో మల్టిడిసిప్లినరీ పెయిన్‌మేనేజ్‌మెంట్‌లో అద్భుతమైన ఫలితాలను సాధించామన్నారు. ఎఫ్‌డీఏ ఆమోదించిన అత్యాధునిక యంత్రాలు, సదుపాయాలతో రోగులకు అత్యుత్తమ చికిత్సలను అందజేస్తున్నట్లు చెప్పారు. సోనోసైట్ పిఎక్స్ మెషీన్‌ను ఇన్‌స్టాల్ చేసిన మొట్టమొదటి సెంటర్ కూడా తమదేనన్నారు. దక్షిణ భారతదేశంలో బెంగళూర్, చెన్నై నగరాల్లోనూ ఇపియోన్ పెయిన్ క్లినిక్‌లు తమ సేవలను అందజేస్తున్నాయి.శస్త్రచికిత్సలకు ప్రత్యామ్నాయంగా తాము అందజేస్తున్న చికిత్సలు రోగులను నొప్పి నుంచి దూరం చేస్తున్నట్లు డాక్టర్ సుధీర్ ధారా పేర్కొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్ ధారా

సీనియర్ టీవీ కెమెరా మెన్, ఎడిటర్ వెంకట రమణ మృతి

లక్డీకాపూల్ : సీనియర్ టీవీ కెమెరామెన్, ఎడిటర్, అవుట్ డోర్ యూనిట్ అధినేత పోతన వెంకట రమణ కన్నుమూశారు. ఈ నెల 2న శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతూ నిమ్స్‌లో చేరిన ఆయన చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మచిలీపట్నం ప్రాంతానికి చెందిన వెంకట రమణ ఋతురాగాలు, సంసారం సాగరం, సిరి, బొమ్మరిల్లు తదితర ప్రజాదరణ పొందిన సీరియళ్లకు కెమెరామెన్ గా పని చేశారు. ఎస్వీబీసీ ఛానల్ నిర్మించిన ''శ్రీ వైనతేయ'' ధారావాహికకు 2009 సంవత్సర ఉత్తమ కెమెరామెన్‌గా నంది పురస్కారం అందుకున్నారు. పూరి జగన్నాథ్ తొలిసారి దర్శకత్వం వహించిన దూరదర్శన్ టెలీఫిలిమ్ ''జీవితం' కు ఆయన ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, ఎడిటర్‌గా పని చేశారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల కెమెరామెన్‌ల సంఘంతో పాటు టీవీ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. మచిలీపట్నంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు పేర్కొన్నారు.



అలరించిన స్వరఝరి

- 14గంటల పాటు సినీగీతాలాపన
- జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం



వంశీమోహన్‌ను సన్మానిస్తున్న సీహెచ్ వెంకటాచారి, బింగి నరేందర్‌గౌడ్, ఈశ్వర్, సుభాషిణి, రజనీ

చిక్కడపల్లి: వంశీ మోహనరాగాలు సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ గాయకుడు వంశీ మోహన్ 14గంటల పాటు సినీగీతాలను ఆలపించి సభికులను ఆకట్టుకున్నారు. 140 పాటలను మధురంగా పాడి జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించారు. ఆయా సంస్థల ప్రతినిధులు ఆయనకు ధ్రువీకరణ పత్రాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.విజయభాస్కర్‌రావు, డాక్టర్ బింగి నరేందర్‌గౌడ్, డాక్టర్ సీహెచ్ వెంకటాచారి, డాక్టర్ పెద్ది కె.ఈశ్వర్, డాక్టర్ టి. సుభాషిణి, గాయని రజనీ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: హత్య కేసులో నిందితుడిని బహదూర్‌పురా పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య వివరాలు వెల్లడించారు. కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ రషీద్(27)ను వివాహేతర సంబంధం కారణంగా ఎంఎం పహాడీకి చెందిన షకీల్ అహ్మద్ హత్య చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎన్నికలకు సమాయత్తం!

- అన్ని విధాలా సిద్ధం అవుతున్న అధికారులు
- 'అదర్' పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి
- ఖైరతాబాద్‌లో 800 మంది ఓపీఓలు



ఖైరతాబాద్: అధికారులు, సిబ్బందికి వివరిస్తున్న ట్రైనర్

బంజారాహిల్స్: ఎన్నికలు సమీపిస్తుండగా సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ముమ్మరం చేస్తున్నారు. గత నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగా మే 13వ తేదీన పోలింగ్ జరగనుంది. ఇందుకు అనుగుణంగా ఎన్నికల పనుల్లో అధికార యంత్రాంగం వేగం పెంచింది. ఇప్పటికే ఈవీఎంల మొదటి దశ పరిశీలన పూర్తి చేశారు. ఓటరు తుది జాబితాను ప్రకటించారు. ఎన్నికల ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

- దీనికి కొనసాగింపుగా ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది నియామక ప్రక్రియను చేపట్టారు. ఎంపిక చేసిన ఉద్యోగులను ఇప్పటికే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా నియమించి వారికి రెండు రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు.
- తాజాగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో 245 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇందులో విధులు నిర్వహించే అదర్ పోలింగ్ సిబ్బంది (ఓపీఓ)కి గురువారం చింతల్ బస్తీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. మొత్తం 800 మంది సిబ్బందికి ఇక్కడ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఉప కమిషనర్ ప్రశాంతి మాట్లాడుతూ... ప్రతి పోలింగ్ బూత్‌లో అదర్ పోలింగ్ ఆఫీసర్లు ఇద్దరు చొప్పున ఉంటారన్నారు. ఓటరు పోలింగ్ బూత్‌లోకి వచ్చిన తరువాత వీరి పాత్ర కీలకం అన్నారు.
- ఓటరు తన ఓటు వేసి వచ్చేవరకు ఓపీఓలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. 800 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సొంత నియోజకవర్గం, సొంత మండలం మినహాయించి వేర్వేరు చోట్ల విధులు నిర్వహించేలా బాధ్యతలు అప్పగించనున్నారు.
- పోలింగ్ నిర్వహణ పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంకోవైపు అదనంగా 20 శాతం సిబ్బందిని ఎంపిక చేసి రిజర్వ్‌లో ఉంచారు.



మాట్లాడుతున్న ఉప కమిషనర్ ప్రశాంతి

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం



పోషకాహార ప్రాధాన్యతపై మాట్లాడుతున్న వక్త

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'న్యూట్రిషన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ టు గర్ల్ స్టూడెంట్' అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ టీఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంతోషి లక్ష్మీ, కన్సల్టెంట్ న్యూట్రిషనిస్ట్ ఛందాసి దాస్‌లు వక్తలుగా హాజరై ఆహార సమతుల్యత, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై మాట్లాడారు. దైనందిన జీవితంలో పోషకాహారం కీలకమన్నారు. ఆరోగ్య సమస్యలు దరి చేరకుండా ఉండాలంటే తీసుకునే ఆహారమే ప్రధానమన్నారు. సమతుల్య ఆహారం ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తుందన్నారు. శక్తి సామర్థ్యాలను పెంపొందింపజేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నవనీత, వైస్ ప్రిన్సిపాల్ (హాస్టల్స్) వెంకటరమణ, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సంగీత కచేరి

సాక్షి, సిటీబ్యూరో: సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన సంగీత కచేరి ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. డాక్టర్ రాధా చక్రవర్తి జ్ఞాపకార్థం ఈ స్మారక కచేరీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ డెప్నే డి రెబెల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎం.గోపాలకృష్ణ, డాక్టర్ సుజారావు, డాక్టర్ దీపికారెడ్డి, డాక్టర్ హేమా రాఘవన్, శ్రీనాథ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు డాక్టర్ రాధా చక్రవర్తితో తమ అనుబంధాన్ని, ఆప్యాయతను పంచుకున్నారు. అనంతరం చెన్నైకి చెందిన ప్రముఖ కళాకారిణి నిషా రాజగోపాలన్ కర్నాటిక్ గాత్రంలో స్మారక కచేరీ నిర్వహించారు. విష్ణుభొట్ల గాయత్రీ శివాని వయోలిన్‌పై, పెరవలి జయ భాస్కర్ మృదంగంపై, టీపీ బాలసుబ్రహ్మణ్యం ఘటంపై అలరించారు. నిషా రాజగోపాలన్ కచేరీని ముత్తుస్వామి దీక్షితార్ హంసధ్వని రాగకృతి 'వాతాపి గణపతిం' ఆది తాళం, తర్వాత 'వందే వాసుదేవం' శ్రీ రాగంలో ఖండ చపు తాళంలో అన్నమయ్య కంపోజిషన్‌తో కచేరీని ప్రారంభించారు. తర్వాత ఆమె కేదారగౌళ‌లో 'అలపాన పట్టింది వేణుగాన లోలుని గాన' అనే త్యాగరాజ కృతి రూపకం అనంతరం ఆమె భైరవి ఆలాపనను చేపట్టి, బాలగోపాలానికి దీక్షితార్ కంపోజిషన్‌ను అందించారు. సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ గడచిన ఆరు దశాబ్దాలుగా సాంస్కృతిక రంగంలో సేవలను అందజేస్తోంది.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

రహమత్‌నగర్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి జలమండలి డీజీఎం వాహబ్‌ను కోరారు. డివిజన్‌లో నీటి సరఫరా, పైప్‌లైన్‌ల మరమ్మతులపై గురువారం ఆయన డీజీఎంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... బస్తీల్లో నిర్ణీత వేళల్లో మాత్రమే నల్లాల్లో నీరు సరఫరా చేయాలని కోరారు. చాలా బస్తీల్లో పైప్‌లైన్లు లీకేజీలు అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. శ్రీరాంనగర్ చర్చి గల్లీలో కొంత కాలంగా లోప్రెషర్ సమస్య ఉందని, ఆ ప్రాంతంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. డీజీఎం వాహబ్ మాట్లాడుతూ... ఎండకాలంలో నీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు ఇప్పటికే తీసుకున్నామని వెల్లడించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ఉచితంగా వాటర్ ట్యాంకర్లను పంపిస్తామని తెలిపారు.

ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో పోటీ చేస్తాం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి

లిబర్టీ: సార్వత్రిక ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని స్థానాల్లో దళిత బహుజన పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ వెల్లడించారు. లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రాజ్యాధికార సాధన ద్వారానే దళితులకు బహుజనులకు విముక్తి లభిస్తుందని స్పష్టం చేశారు. స్వయం రాజ్యాధికారం సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం కోసం దళిత బహుజనులు త్వరలో రెండు తెలుగు రాష్ట్రాల జరిగే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. చంద్రబాబు నాయుడు అవకాశవాద రాజకీయాలతో మతోన్మాద బీజేపీతో పెట్టుకున్నాడని విమర్శించారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను తిప్పికొట్టాలని అన్నారు. దళిత బహుజనులను లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీకి పంపితే దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వారిని వినిపిస్తారని ఆయన స్పష్టం చేశారు.

'బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి'

లిబర్టీ: లోక్‌సభ ఎన్నికల్లో బీసీ వ్యతిరేక పార్టీలను గద్దెదించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి కోరారు. బీసీల పట్ల నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీసీలు నిద్రపోకూడదని విజ్ఞప్తి చేశారు. దళ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ఆయుధంతోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పి... కొలుకోలేని విధంగా దెబ్బకొట్టాలన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు

రహమత్‌నగర్: క్వారీ మైదానంలో రంజాన్ ప్రార్థనలు జరుగనున్నాయి. ఇందుకోసం రూ. 9 లక్షల నిధులను జీహెచ్‌ఎంసీ మంజూరు చేసింది. వీటితో షామియానాలు, మంచి నీటి సౌకర్యం, మైదానం చదును, కూలర్ల ఏర్పాటుతో పాటు ఇతరత్ర పనులు చేపట్టనున్నారు. దాదాపు పది వేల మంది వరకు ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొనే అవకాశం ఉన్న దృష్ట్యా వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మైదానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... క్వారీ మైదానం రంజాన్, బక్రీద్ ప్రార్థనలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిపారు.

తోటమాలీలకు రెండు నెలలుగా జీతాల్లేవ్...

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో పనిచేస్తున్న తోటమాలీలకు గడచిన రెండు నెలలుగా జీతాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు చెల్లింపులో జరుగుతున్న జాప్యం వల్ల వీరంతా అప్పులు చేసి కడుపులు నింపుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కిలోమీటర్ల మేర జీహెచ్‌ఎంసీ వాక్ వే ఉండగా పచ్చదనం పరిశుభ్రత కోసం 31 మంది తోటమాలీలు గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ మినహాయించుకోగా వీరికి ఇస్తున్న జీతం రూ. 11 వేలు మాత్రమే. ఇంత చిన్న జీతం కూడా ప్రతి నెల సకాలంలో ఇవ్వడంలో సంబంధిత కాంట్రాక్టర్లు తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి ఈ తోటమాలీలకు జీతాలు ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సొంత భూమినే కబ్జా చేశానంటూ తహసీల్దార్ తప్పుడు కేసులు

- వాస్తవాలు తెలుసుకోకుండా దౌర్జన్యం చేశారు
- జర్నలిస్టు కాలనీకి చెందిన ప్లాట్ నెంబర్–7 యజమాని పురుషోత్తంరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: 2009 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూపొందించిన జీవో 166 ప్రకారం ప్రభుత్వం నుంచి చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమికి సంబంధించి వాస్తవాలు తెలుసుకోకుండా షేక్‌పేట్ తహసీల్దార్ అనితారెడ్డి తప్పుడు కేసులు నమోదు చేశారని జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలోని ప్లాట్ నెంబర్ 7 యజమాని పురుషోత్తంరెడ్డి ఆరోపించారు. సరైన దర్యాప్తు చేపట్టకుండానే సదరు భూమిని కబ్జా చేశానంటూ తన ప్రాపర్టీని ధ్వంసం చేయడమే కాకుండా దుర్భాషలాడారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జర్నలిస్ట్ కాలనీలోని తన ప్లాట్ నెంబర్ 7 (గృహం)కు కలిసి ఉన్న మరికొంత భూమిని ఆక్రమించలేదని, దానిపైన సర్వ హక్కులు తనకే ఉన్నాయని పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఇంటి ముందు ఉన్న ప్లాట్ నెంబర్ 8 కూడా సీనియర్ పాత్రికేయుకి చెందినది కాగా అనంతరం తాను కొనుగోలు చేశానని వివరించారు. ఇందులో 'ఈ భూమి ప్రభుత్వానికి చెందినది' అనే బోర్డును ఏర్పాటు చేసిన తహసీల్దార్ అనితారెడ్డి ఇప్పటికీ తొలగించకపోవడం ప్రజాస్వామ్య హక్కులను విస్మరించడమేనని అన్నారు. గత 30 ఏళ్లకు పైగా ఇక్కడే నివసిస్తున్నానని, ప్రభుత్వ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇలా తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరించడం హేయమైన చర్య. దీనికి సంబంధించి ఇప్పటికే సంబంధిత రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. ఎలాంటి వివాదాలు లేని తన సొంత ఆస్తిపై తహసీల్దార్ అవాస్తవ ఆరోపణలు చేయడం, దౌర్జన్యం చేయడం అన్యాయమని, దీనికి సంబంధించి చట్టపరంగా పోరాడుతానని హెచ్చరించారు.

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ, ఐఎస్‌టీపీ ఎస్‌బీ-ఆర్‌ఏఎస్‌ల మధ్య ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

బంజారాహిల్స్: కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ, రష్యాకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్–టెరెస్ట్రియల్ ఫిజిక్స్ ఆఫ్ ది సైబీరియన్ బ్రాంచ్ ఆఫ్ రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఐఎస్‌టీపీ ఎస్‌బీ-ఆర్‌ఏఎస్)తో పలు కీలకాంశాలపై ఎంఓయూ కుదుర్చుకున్నాయి. గురువారం ఇరు సంస్థల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. అయానోస్పిరిక్ ఫిజిక్స్, స్పేస్ వెదర్ డొమైన్‌లలో శాస్త్రీయ, విద్యాపరమైన సహకారాన్ని అందించే దిశగా ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ... ఈ భాగస్వామ్యం యూనివర్సిటీకి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. గ్లోబల్ అకడమిక్ ఎక్స్‌లెన్స్‌ను ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. తద్వారా ఆవిష్కరణల వైపు ముందుకు నడిపిస్తుందన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఐఎస్‌టీపీ ఎస్‌బీ–ఆర్‌ఏఎస్‌తో ఉన్న తమ బంధాన్ని మరింత బలోపేతం కాగలదన్నారు. ఐఎస్‌టీపీ ఎస్‌బీ-ఆర్‌ఏఎస్ నుంచి డాక్టర్ యూరీ యస్యుకెవిచ్, కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నుంచి వెంకటరత్నంలు దీనికి నాయకత్వం వహిస్తారని చెప్పారు.

అనాథ పిల్లల విద్యకు చేయూత



ఫౌండేషన్‌కు చెక్కు అందజేస్తున్న సీఈఓ సన్నీరెడ్డి

హిమాయత్‌నగర్: అనాథ చిన్నారుల చదువు కోసం తమ వంతు చేయూతనందిస్తానని ముందుకు వచ్చారు ప్రముఖ టెలికమ్యూనికేషన్స్ సంస్థ వీవోఐపీ సంస్థ సీఈఓ సన్నీ రెడ్డి. తెలుగు రాష్ట్రాల్లోని అనాథ విద్యకు తాము విరాళం అందించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్‌లిఫ్ట్ ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సన్నీ రెడ్డి మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాలలో చిన్నారులు ఎదుర్కొంటున్న విద్యాపరమైన సవాళ్లను పరిష్కరించడం కోసం తాము సహాయం అందిస్తామన్నారు. అనాథ పిల్లలకు నాణ్యమైన విద్య, ఉజ్వల భవిష్యత్తు కోసం తాము భవిష్యత్తులో మరిన్ని సహాయ కార్యక్రమాలు చేపడతామన్నారు. సమాజాన్ని, జీవితాలను మార్చే శక్తి కేవలం విద్య వల్లనే సాధ్యమని, అందుకు అనాథ చిన్నారులు ముందుకు సాగాలని సన్నీ రెడ్డి ఆకాంక్షించారు.

యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానం



విద్యార్థులకు అవార్డులను అందిస్తున్న గేయ రచయిత చంద్రబోస్

శ్రీనగర్‌కాలనీ: సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానోత్సవం గురువారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత చంద్రబోస్, గాయకుడు సతీష్‌రెడ్డి, మాజీ సైంటిఫిక్ అడ్వైజర్ నికోలయ్ ప్రిస్టోవ్ యాంకోవ్‌లు హాజరై విద్యార్థులకు అవార్డులను అందజేశారు. జాతీయ స్థాయిలో 1500 పాఠశాలల నుంచి లక్ష మంది విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, రివార్డులను ప్రదానం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, పేద విద్యార్థులకు అండగా సుచిరిండియా ఫౌండేషన్ ముందుంటుందని ఫౌండేషన్ ప్రతినిధి లయన్ కిరణ్‌కుమార్ తెలిపారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 28, క్యాబేజీ 18, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 16, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

చీటింగ్ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష

హిమాయత్‌నగర్: నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చీటింగ్ కేసులో ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... జలిగామ సురేష్ అనే వ్యక్తి 2016వ సంవత్సరంలో నల్లన శరత్ అనే వ్యక్తికి హిమాయత్‌నగర్ స్ట్రీట్ నం–1లోని బాలప్ప రెసిడెన్సీలోని ఓ ఫ్లాట్ విక్రయించేందుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఇందుకు శరత్ సురేష్‌కు రూ. 9.25 లక్షలు చెల్లించాడు. అయితే ఇదే ఫ్లాట్‌ను సురేష్ ఇంతకు ముందే వేరొకరికి విక్రయించాడు. విషయం తెలుసుకున్న శరత్ తన డబ్బు తిరిగి ఇవ్వమని అడిగాడు. డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో 2016లో మోసం చేసిన సురేష్‌పై బాధితుడు శరత్ నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఐపీసీ 420, 406, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన నాంపల్లి 9వ ఏసీఎంఎం కోర్టు న్యాయమూర్తి నిందితుడు జలిగామ సురేష్‌కు ఐదు సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు అని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరించారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడు అరెస్టు

ఫిలింనగర్: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివీ... షేక్‌పేట వినాయకనగర్ బస్తీలో నివసించే రావులపోలు జగదీష్(33) సెంట్రింగ్ వర్క్ చేస్తుంటాడు. ఈజీ మనీ కోసం అలవాటు పడి గుట్టుచప్పుడు కాకుండా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండడంతో ఫిలింనగర్ పోలీసులకు సమాచారం అందింది. బుధవారం రాత్రి కోల్‌కతా, ఢిల్లీ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ లైన్ గురు మొబైల్ యాప్ ద్వారా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు ఆయన గదిపై దాడి చేశారు. ఈ సందర్భంగా బెట్టింగ్ నిర్వహిస్తూ జగదీష్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబట్టాడు. ప్రధాన బుకీ వినయ్ సింగ్ ఆధ్వర్యంలో ఈ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లుగా పట్టుబడ్డ నిందితుడు పోలీసులకు వెల్లడించాడు. నిందితుడి నుంచి మొబైల్ యాప్ కలిగి ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ. 25 వేలను స్వాధీనం చేసుకున్నారు. సెక్షన్ 3, 4 ఆఫ్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు

సాక్షి ఎఫెక్ట్..



మొక్కలకు నీరు పెడుతున్న సిబ్బంది

బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని థీమ్ పార్కు 'ఇకో ఎలెవెన్'లో వాటరింగ్ చేయకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నవైనాన్ని 'మొక్కలు ఎండిపోతున్నాయి సారూ' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పార్కులో ఉన్న బోరు పూర్తిగా ఎండిపోవడంతో నీటి సమస్య ఏర్పడిందని దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేకంగా ట్యాంకర్లు తెప్పించి మొక్కలు నీరు పెడుతున్నట్లు పార్కుల నిర్వహణ అధికారి బాలయ్య తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం రెండు సార్లు మొక్కలకు నీటిని పెడుతున్నట్లు ఆయన తెలిపారు. – బంజారాహిల్స్

క్లుప్తంగా...

వస్తున్నా.. ఎవరూ అధైర్యపడవద్దు..

డాక్టర్ రాజయ్య పేరిట సోషల్ మీడియాలో సందేశం



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, మాదిగల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు, నియోజకవర్గ ఆత్మాభిమానాన్ని, అస్థిత్వాన్ని కాపాడేందుకు వస్తున్నానని, ఎవ్వరూ అధైర్యపడొద్దు.. అంటూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేరుతో సోషల్‌మీడియాలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. 'డాక్టర్ రాజన్న సమాచారం'వాట్సాప్ గ్రూపులో ఈ పోస్టు రావడంతో.. రాజయ్య తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారనే ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. దీనిపై రాజయ్యను 'సాక్షి'వివరణ కోరగా బీఆర్‌ఎస్ పార్టీ తనను ఆహ్వానించిందని ధ్రువీకరించారు. కానీ అధినేత కేసీఆర్ పిలుపు కోసం చూస్తున్నానని చెప్పారు. తిరిగి పార్టీలోకి రావాలని జనగామ ఎమ్మెల్యే పల్లా ద్వారా ఆహ్వానం వచ్చిందని రాజయ్య వెల్లడించారు.

తుక్కుగూడలో కాంగ్రెస్ ఇచ్చే గ్యారంటీ ఏమిటో?

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి,హైదరాబాద్: కాంగ్రెస్ గ్యారంటీ అంటే.. అవినీతికి, కుంభకోణాలకు, కుటుంబ పాలనకు, బుజ్జగింపు రాజకీయాలకు గ్యారంటీ అని.. ఇక తుక్కుగూడ సభతో ఆ పార్టీ ప్రజలకిచ్చే గ్యారంటీ ఏముంటుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని భావించిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు తప్పితే ఆ పార్టీపై అభిమానంతో కాదన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ప్రతి ఎన్నికల్లో ప్రజలు ఏదో ఒక భావోద్వేగంతో ఓటు వేశారని.. ఈసారి మోదీని మరోసారి గెలిపించాలన్న భావోద్వేగంతో ఓటు వేస్తారన్నారు.

ఎన్నికల తర్వాత సాధారణ బదిలీలు చేపట్టాలి

టీజీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులందరికీ సాధారణ బదిలీలు చేపట్టాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం నాంపల్లిలోని టీజీఓ భవన్‌లో సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎన్నికల తర్వాత సాధారణ బదిలీలు చేపట్టాలని, సీపీఎస్‌ను రద్దు చేస్తూ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను విడుదల చేయాలని తీర్మానించారు.

15 నుంచి 1-8 తరగతులకు ఎస్‌ఏ-2 పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా1 నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఈ నెల 15 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ పరీక్షల టైం టేబుల్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలు ఈ నెల 22తో ముగుస్తాయని తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొంది. ఎస్‌ఏ-2 పరీక్షలను ఈ నెల 6 నుంచి 20వరకూ నిర్వహించాలని తొలుత టైం టేబుల్ ఇచ్చా రు. అయితే, టీచర్లు ఎన్నికల శిక్షణకు వెళ్లడం, ఇదే సమయంలో కొంతమంది స్పాట్ వ్యాల్యుయేషన్ విధుల్లో ఉండటం వల్ల ఎస్‌ఏ-2 పరీక్షల తేదీల్లో స్వల్ప మార్పులు చేశారు.

ప్రగతి భవన్ వేదికగానే ఫోన్ ట్యాపింగ్

- డీజీపీకి తెలియకుండానే స్పెషల్ టీమ్‌లు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో ప్రగతి భవన్ వేదికగానే ఫోన్ ట్యాపింగ్‌లు జరిగాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకే అధికారులు ట్యాపింగ్ చేశారని, డీజీపీకి తెలియకుండా స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఈ వ్యవహారం నడిపించారని విమర్శించారు. కేటీఆర్ తనతో పాటు మరో ఇద్దరు నేతలకు లీగల్ నోటీసులు పంపారని, కేటీఆర్‌కు న్యాయ, పరిపాలన పరిజ్ఞానం లేదని విమర్శించారు. తెలంగాణ లో వివిధ ప్రాంతాల్లో వార్ రూమ్‌లు ఏర్పాటు చేసి ట్యాపింగ్ చేసినట్లు మీడియాలో కథనాలు వచ్చాయని, ఈ నేపథ్యంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందన్న అనుమానంతోనే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేటీఆర్ లీగల్ నోటీసులు పంపి బెదిరించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో టాస్క్‌ఫోర్స్ వాహనాలలో డబ్బులు చేరవేసినట్లు రిమాండ్‌లో ఉన్న పోలీసు అధికారులు చెప్పారని గుర్తు చేశారు. ఈ లెక్కన పోలీసు వాహనాల్లో ఎన్నికల కోసం అక్రమంగా డబ్బులు తరలించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అందరూ అనర్హులవుతారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2,500 కోట్లు ఢిల్లీకి కప్పం కట్టారని అన్న మాటలకు కేటీఆర్‌కు తామే లీగల్ నోటీసులు ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాపింగ్ జరిగినట్లు మీడియాలో కథనాలు వచ్చాయని చెప్పారు.

'జనజాతర' అదరాలి!

- 6న తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- ఖర్గే, రాహుల్, ప్రియాంక హాజరయ్యే సభను విజయవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి
- సభా స్థలి వద్ద ఏర్పాట్ల పరిశీలన.. అక్కడే గంటన్నరపాటు సమావేశం
- వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికార యంత్రాంగానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు జాతీయ స్థాయిలో శంఖారావంగా కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఈ నెల 6న నిర్వహించనున్న జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయడంపై ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ ఎ. రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు. 60 ఎకరాల మైదానంలో నిర్వహించే ఈ సభ ఏర్పాట్లను మంత్రివర్గ సహచరులు, పార్టీ ఎంపీ అభ్యర్థులతో కలసి పర్యవేక్షిస్తున్నారు. ఇందుకోసం పార్టీ నేతలతో వివిధ కమిటీలు ఏర్పాటు చేసిన సీఎం ... గురువారం సాయంత్రం స్వయంగా సభా వేదిక వద్దకు వెళ్లి, మంత్రులు, పార్టీ నేతలతో సుమారు గంటన్నరపాటు సమావేశమయ్యారు. పదేళ్ల తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా 10 లక్షల మందితో కనీవినీ ఎరుగని రీతిలో సభ నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ భేటీలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, పలువురు ఎంపీ అభ్యర్థులు పాల్గొన్నారు.

10 లక్షల జనం తరలాల్సిందే

పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేత ప్రియాంకా గాంధీ హాజరయ్యే ఈ సభ ద్వారా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సత్తా చాటాలని రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈ సభా వేదిక నుంచే జాతీయ స్థాయిలో పార్టీ మేనిఫెస్టోను విడుదల చేయడంతోపాటు అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ఐదు గ్యారంటీలను కూడా రాహుల్ గాంధీ ప్రకటించనున్న నేపథ్యంలో సభకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం లభించనుందని రేవంత్ పేర్కొన్నారు. అందువల్ల సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 10 లక్షల మంది ప్రజలను సభకు తరలించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇందుకోసం అన్ని జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు పార్టీ ఎంపీ అభ్యర్థులు కూడా శ్రద్ధ తీసుకోవాలని సీఎం చెప్పినట్లు సమాచారం. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ, ఖమ్మం, మెదక్ జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ జరపాలని రేవంత్ స్పష్టం చేసినట్లు తెలిసింది. సభ జరిగే మైదానం పక్కనే సుమారు 300 ఎకరాల ఖాళీ స్థలం అందుబాటులో ఉండటంతో సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగానికి సీఎం ఆదేశాలు జారీ చేశారు.

జగ్జీవన్ జీవితం స్ఫూర్తిదాయకం: రేవంత్

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు

సీఎం రేవంత్ సమక్షంలో పార్టీలో చేరిన పలు జిల్లాల బీఆర్‌ఎస్ నేతలు



సీఎం రేవంత్ రెడ్డి, వంశీచంద్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో మహబూబ్‌నగర్, మల్కాజిగిరి, చేవెళ్ల, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రాష్ట్రంలో కనీసం 14 లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒకటేనని ఇప్పటికే రుజువైందని, ఈ ఎన్నికల్లో రెండు పార్టీ లు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీకి ఈ ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మహబూబ్‌నగర్, వరంగల్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థులు వంశీచంద్ రెడ్డి, కడియం కావ్య, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలారెడ్డితో పాటు ఫ్లోర్ లీడర్ ఆగం పాడు, పలువురు కార్పొరేటర్లు, రంగారెడ్డి జిల్లాకు చెందిన కందుకూరు జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, సరూర్‌నగర్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జిల్లెల నరేందర్‌రెడ్డి, బీజేపీ నేతలు దశరథ, నరసింహ, శంకర్‌పల్లి జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మగోపాల్‌రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితోపాటు పలువురు కౌన్సిలర్లు చేరారు.

కాంగ్రెస్‌ను ఎండగడుతూ.. మోదీ విజయాలను వివరిస్తూ

ఒక్కో లోక్‌సభ సెగ్మెంట్ కేంద్రంగా బీజేపీ కార్యాచరణ ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో.. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం కేంద్రంగా కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడంతో పాటు అందుకు తగ్గట్టుగా పనివిభజనతో ముందుకెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించడంలో భాగంగా...రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తోంది. ప్రధానంగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అమలు కాని హామీల విషయంలో ఎండగట్టాలని, ఇదే సమయంలో ప్రతీ ఓటర్‌ను కలుసుకుని పదేళ్ల పాలనలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించాలని నిర్ణయించింది.

నలుగురు ప్రధాన కార్యదర్శులకు బాధ్యతలు

ఇక పనివిభజనలో భాగంగా.. రాష్ట్ర పార్టీలోని నలుగురు ప్రధానకార్యదర్శులకు నాలుగేసి చొప్పున పార్లమెంట్ నియోజకవర్గాల బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించినట్టు సమాచారం. వీరికి అప్పగించిన ఎంపీ సీట్లలో వారు కార్యక్రమాల పర్యవేక్షణ, ఎన్నికల ప్రచారం నిర్వహణతో పాటు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కలిగిస్తూ ముందుకెళ్తారు. ఈ మేరకు గురువారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ఎన్నికల మేనేజ్ మెంట్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్, ప్రధానకార్యదర్శులు ప్రేమేందర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

నేడు కరీంనగర్‌కు కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలిస్తారు. సిరిసిల్ల జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన అనంతరం ఎర్రవల్లిలోని ఆయన ఫామ్‌హౌస్‌కు తిరుగుపయనమవుతారు. కాగా, ఈ పర్యటనలో కేసీఆర్ కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ మైండ్ గేమ్: గంగుల

బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతానంటున్న ప్రచారం ఊహాజనితమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తేల్చిచెప్పారు. గురువారం కరీంనగర్‌లో ఆయన పార్టీ మార్పుపై మీడియా అడిగిన ప్రశ్నకు జవాబు ఇచ్చారు. తాను కారు దిగే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ మైండ్ గేమ్ ఆడుతోందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్‌లో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

జొన్న పంట కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జొన్నరైతులకు కనీస పంట మద్దతు ధరను కల్పించేందుకు గాను జొన్న పంటను కొనుగోలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. కొనుగోలుకు అవసరమైన సొమ్మును రుణంగా తీసుకునేందుకు అవసరమైన రూ.327 కోట్ల మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఆదేశాలిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో 9, గద్వాలలో 2, కామారెడ్డిలో 12, కొమురంభీం ఆసిఫాబాద్‌లో 2, మెదక్‌లో 3, నిర్మల్‌లో 5, సంగారెడ్డిలో 10, వికారాబాద్ జిల్లాలో 3 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో 2.07 లక్షల ఎకరాల్లో జొన్న సాగు కాగా 1.83 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రభుత్వం 91,865 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయగా... మిగిలిన దాన్ని రైతులు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు తెచ్చిన జొన్న పంటనంతా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

జగ్జీవన్‌రాం సిద్ధాంతాలతో ముందుకు సాగుతున్నాం

మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శాలను, సిద్ధాంతాలను ఆవాహన చేసుకొని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అహరహం శ్రమిస్తున్నదని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి (ఏప్రిల్ 5) సందర్భంగా మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. భారత పురోగమనంలో ప్రభావవంతమైన పాత్రను బాబూజీ పోషించారని అన్నారు.

ట్యాపింగ్ ద్వారానే 'ఎమ్మెల్యేలకు ఎర' వెలుగులోకి!

▶ మొదటి పేజీ తరువాయి

తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో తిరుపతికి చెందిన సింహయాజిస్వామి, ఫరీదాబాద్‌లోని ఓ దేవాలయంలో ఉండే ఢిల్లీకి చెందిన సతీష్‌శర్మ అలియాస్ రామచంద్రభారతి, నగరవ్యాపారి నందకుమార్ సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) పోలీసులకు చిక్కారు. వీరు అప్పటి అధికార పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలతో బేరసారాలు చేస్తున్నట్టు మొయినాబాద్ ఠాణాలో కేసు నమోదైంది. బీజేపీ ఎర వేసినట్టు ఆరోపణలు ఉన్న ఎమ్మెల్యేల్లో పైలట్ రోహిత్‌రెడ్డితో పాటు హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రేగా కాంతరావు ఉన్నారు. అప్పటి ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు ఈ నలుగురు ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాప్ చేసినట్టు వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే ఎర అంశం వెలుగులోకి రావడంతో ఆయన ప్రభాకర్‌రావును అప్రమత్తం చేశారు. అప్పటి సర్కారుకు సమాచారం ఇచ్చిన ప్రభాకర్‌రావు టాస్క్‌ఫోర్స్‌కు ఓఎస్డీగా ఉన్న రాధాకిషన్‌రావుతో కలిసి భారీ స్కెచ్ వేశారు.

సైబరాబాద్ అధికారులతో కలిసి అమలు

వీరు వేసుకున్న పథకం ప్రకారం బీజేపీ తరఫున వస్తున్న సింహయాజిస్వామి, సతీష్‌శర్మ, నందకుమార్‌లను ట్రాప్ చేయడానికి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌తో పాటు సైబరాబాద్ ఎస్ఓటీ, ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. నందకుమార్ ఫోన్‌ను కూడా కొన్నాళ్లు ట్యాప్ చేయడం ద్వారా మరికొంత సమాచారం సేకరించారు. రాధాకిషన్‌రావు సహా మరికొందరు అధికారులు ట్రాప్ జరగడానికి ముందు రోజు (2022 అక్టోబర్ 25) ఫామ్‌హౌస్‌ను సందర్శించారు. అక్కడ అవసరమైన ప్రాంతాల్లో రహస్యంగా సీసీ కెమెరాలు, వాయిస్ రికార్డర్లు, మైక్‌లు.. ఇలా మొత్తం 75 సాంకేతిక ఉపకరణాలు అమర్చారు. ఈ వ్యవహారంలో రాధాకిషన్‌రావుతో పాటు సైబరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అధికారి కీలకంగా వ్యవహరించినట్టు తేలింది. 2022 అక్టోబర్ 26 రాత్రి ఫామ్‌హౌస్ సమీపంలో వలపన్ని ఉన్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, సైబరాబాద్ ఎస్ఓటీ, రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు నలుగురు ఎమ్మెల్యేలతో బేరసారాలు చేస్తున్న ముగ్గురినీ పట్టుకున్నారు. ఈ ఎపిసోడ్ మొత్తం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు సంబంధించినది అయినా.. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు రాధాకిషన్‌రావు రంగంలోకి దిగారని తెలుస్తోంది.

కేసు సుప్రీంకోర్టు పరిధిలో ఉండటంతో...

ఎమ్మెల్యేల ఎర కేసును తొలుత మొయినాబాద్ పోలీసులే దర్యాప్తు చేశారు. అయితే లోతైన దర్యాప్తునకు నాటి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసింది. దీని దర్యాప్తు తుది దశకు చేరిన తర్వాత సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. దీన్ని విచారించిన న్యాయస్థానం ఆ మేరకు ఆదేశాలు ఇచ్చింది. అయితే సీబీఐ దర్యాప్తు అవసరం లేదని, సిట్ దర్యాప్తు పూర్తి చేస్తోందంటూ హైకోర్టు ఆదేశాలను నాటి ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ప్రస్తుతం ఈ పిటిషన్ అక్కడే పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలోనే తాజా కేసులో భాగంగా నాటి 'ఎర కేసు'లోని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలా? వద్దా? అనే అంశంపై పోలీసులు న్యాయ నిపుణుల సలహా తీసుకోనున్నారు. రాధాకిషన్‌రావును పోలీసు కస్టడీలోకి తీసుకున్న నేపథ్యంలో పశ్చిమ మండల డీసీపీ విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో 'ఎస్ఐబీలో అనధికారికంగా, చట్ట విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల ప్రొఫైల్‌లను అభివృద్ధి చేయడంలో రాధాకిషన్‌రావు కీలకపాత్ర పోషించారు. కొంతమంది వ్యక్తుల ఆదేశానుసారం వాటిని రాజకీయపార్టీకి అనుకూలంగా, పక్షపాత ధోరణిలో ఉపయోగించుకోవడంలో మరి కొందరితో కలిసి పన్నిన కుట్రలో భాగస్వాము డయ్యారు. ఆ నేరాలకు సంబంధించిన ఆధారాలు ధ్వంసం చేయడానికి కుట్ర పన్నారు. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న రాధాకిషన్‌రావు నుంచి కీలకసమాచారం సేకరించే కోణంలో దర్యాప్తు అధికారి, ఆయన బృందం ప్రశ్నిస్తోంది. కేసు దర్యాప్తు పురోగతిలో ఉంది'అని పేర్కొన్నారు.

ఈసీ, గవర్నర్ జోక్యం చేసుకోవాలి

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్
- దర్యాప్తు సంస్థలు సుమోటోగా విచారణ చేపట్టాలి
- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన బీఆర్‌ఎస్ గుర్తింపు రద్దు చేయాలి
- మాజీ సీఎం కేసీఆర్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఎన్నికల సంఘం, గవర్నర్, ఇతర దర్యాప్తు సంస్థలు సుమోటోగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్యాపింగ్ ద్వారా దేశ సమగ్రతకు భంగం కలిగించేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపించారు. దీనిపై గవర్నర్ ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని కోరారు. అలాగే గతంలో ఎన్నికల నిబంధనలు బీఆర్‌ఎస్ ఉల్లంఘించినందున ఈసీ కూడా జోక్యం చేసుకోవాలన్నారు. 2014 నుంచి ఎన్నికలు, ఇతర సందర్భాల్లో పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడుతూ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినందున బీఆర్‌ఎస్ గుర్తింపును రద్దు చేయాలని ఈసీని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌పైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు కారణం ఎవరో చెప్పాలని కేసీఆర్‌ను ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక షాడో సీఎం గా వ్యవహరించిన కేటీఆర్ ఇప్పుడు ఫోన్‌ట్యాపింగ్ కేసుతో తనకేం సంబంధం అంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

ట్యాపింగ్‌తో రూ. కోట్లు వసూలు చేశారు..

ట్యాపింగ్ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ వదిలిపెట్టే ప్రయత్నం చేసినా బీజేపీ విడిచిపెట్టబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రిటైరైన ఓ అధికారిని ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించి కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు వ్యవహరించడం మామూలు విషయం కాదన్నారు. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఎన్నికల సందర్భంగా బీజేపీ నేతల ఫోన్లతోపాటు, బడా పారిశ్రామికవేత్తలు, ప్రముఖుల ఫోన్లను బీఆర్‌ఎస్ నేతలు ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. బీఆర్‌ఎస్ రూ. కోట్లలో వసూళ్లు చేసినట్లు, ఇందులో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు బయటపడుతోందని వ్యాఖ్యానించారు. దీని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

రైతు హామీలను కాంగ్రెస్ అమలు చేయదేం?

రైతులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ఎందుకు అమలు చేయట్లేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. 'కౌలు రైతులకు ఆర్థిక సహాయం ఇవ్వలేదు. రుణమాఫీ ఏ డిసెంబర్ 9న చేస్తారో తెలియదు? రైతులకు రూ. 500 బోనస్ బోగసేనా? రైతులకు కొత్త రుణాలు ఎందుకు ఇవ్వట్లేదు'అని ఆయన నిలదీశారు. హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు.

మీ హయాంలో పంట పరిహారమేదీ?

మేం వడగళ్లతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేలు ఇస్తాం: తుమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గతేడాది మార్చి, ఏప్రిల్‌లో వచ్చిన వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిన నాటి సీఎం కేసీఆర్..ఆపై జీఓ కూడా విడుదల చేసినా ఎందరికి ఇచ్చారో చెప్పాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిలదీశారు. ఖమ్మంలో గురువారం విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్రంలో వడగండ్ల వానతో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.10 వేలు ఇవ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే వివరాల సేకరణ పూర్తయిందని చెప్పారు. కాగా, ఏనాడు కూడా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వని బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక మొదటి పంటకు నీళ్లు ఇవ్వకుండా ఇప్పుడు రెండో పంటకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండటం సిగ్గుచేటన్నారు. పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించి రైతుల ప్రీమియం తమ ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు.

నేడు బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్షలు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 11 నుంచి ఒంటిగంట మధ్యలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో 'రైతు సత్యాగ్రహ దీక్షలు'నిర్వహించనున్నారు. రూ.2 లక్షల లోపు రైతుల బ్యాంకు రుణాలను వెంటనే మాఫీ చేయాలని, వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని, కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలని, రైతుకూలీలకు రూ.12 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమచేయాలనే డిమాండ్లపై ఈ సత్యాగ్రహాన్ని నిర్వహిస్తున్నారు. హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజులు దాటినా రుణమాఫీ, ఇతర హామీల అమలుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని బీజేపీ ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు.

జిల్లాలకు ముఖ్యనేతలు

రాష్ట్ర పార్టీ నుంచి నేతలు ఒక్కొక్కరు ఒక్కో జిల్లాలో ఈ రైతు సత్యాగ్రహ దీక్షల్లో పాల్గొననున్నారు. రంగారెడ్డి జిల్లాలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో డీకే అరుణ, సంగారెడ్డి జిల్లాలో డా.కె.లక్ష్మణ్, జి.ప్రేమేందర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లాలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, నిజామాబాద్‌లో ఎంపీ అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, జగిత్యాలలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, కామారెడ్డిలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నిర్మల్‌లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్, మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, యాదాద్రి భువనగిరి జిల్లాలో మాజీ ఎంపీ డా.బూరనర్సయ్యగౌడ్, వికారాబాద్‌లో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొంటారు.

మనిషిని చంపి ఫొటోకు దండం పెట్టినట్లుంది

- కేసీఆర్ తీరుపై మండిపడ్డ బండి
- పదేళ్లలో 30 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే పట్టించుకోలేదు
- 11 వేలమంది రైతులు బలవన్మరణాలకు పాల్పడితే పరామర్శించలేదు



కరీంనగర్‌టౌన్:బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అకాలవర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో 30లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా ఏనాడూ రైతులను పట్టించుకోని కేసీఆర్ అధికారం చేజారాక మొసలికన్నీరు పెడుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మండిపడ్డారు. కేసీఆర్ తీరు చూస్తుంటే మనిషిని చంపేసి..ఆయనే ఫొటోకు దండేసి దండం పెట్టినట్లు ఉందని గురువారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికలొస్తుండటంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటనకు వస్తుండటాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. గతేడాది మార్చిలో చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం లక్ష్మీపూర్ వచ్చిన కేసీఆర్ పంట నష్టపోయిన రైతులకు వారం రోజుల్లో ఎకరానికి రూ.10వేలు ఇస్తానని ప్రకటించి మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 వేల మందికిపైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడితే కేసీఆర్ కనీసం వారిని పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుల దుస్థితికి కేసీఆరే కారణమని ఒప్పుకుని ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూదొందేనని, కేసీఆర్ పాలనలో రైతులను బీఆర్‌ఎస్ పార్టీ అరిగోస పెడితే.. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ హామీలు గుప్పించి ముఖం చాటేసిందని తెలిపారు. ఆ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూస్తారా?

▶ మొదటి పేజీ తరువాయి

బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. పాలించమని అధికారాన్ని అప్పజెప్పితే ప్రజల ధన, మాన, ప్రాణాలను హరించే విధంగా వ్యవహరిస్తారా? ఇంతకంటే అన్యాయం, ద్రోహం ఇంకేముంది. పదేళ్లు తెలంగాణలో వ్యక్తిగతమైన స్వేచ్ఛ లేకుండా చేశారు. స్వేచ్ఛగా జీవించే హక్కును ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తోంది.''అని ఆయన పేర్కొన్నారు. తుక్కుగూడలో కాంగ్రెస్ జన జాతర మహా సభ ఏర్పాట్లను గురువారం పరిశీలించిన అనంతరం భట్టి మీడియాతో మాట్లాడారు.

కేసీఆర్ ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు

''రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బీఆర్‌ఎస్ హయాంలో అతలాకుతలమైంది. ప్రజలపై భారం మోపే విధంగా యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. జెన్‌కోను, ట్రాన్స్‌కోను సర్వనాశనం చేశారు. ఇప్పుడు వ్యవస్థలన్నింటినీ చక్కబెడుతున్నాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా చూస్తున్నాం. చేసిందంతా చేసి ప్రస్తుతం అడ్డగోలుగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడుతున్నారు. మూడు నెలలు ఫాంహౌస్‌లో పడుకుని.. తీరా ఎన్నికల ముందు బయటికొచ్చి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అవాస్తవాలు మాట్లాడే బీఆర్‌ఎస్ ప్రతిపక్షంగా కూడా పనికిరాదు''అని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యం. తుక్కుగూడ జనగర్జన సభ ఈ దేశానికి దిశా నిర్దేశం చేయనుంది. దేశంలోనే ఈ సభ చారిత్రాత్మకం కానుంది. లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను తుక్కుగూడ సభనుంచే ఏఐసీసీ నాయకత్వం ప్రకటించనుంది''అని ఆయన వివరించారు. భట్టి వెంట మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మా రెడ్డి, మహేశ్వరం సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశలు.. అడుగంటి..

ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో రైతన్నల జలగోస

ఉమ్మడి ఖమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా మండే ఎండలు, అడుగంటిన భూగర్భ జలాలతో పంటలు ఎండిపోతున్నాయి. నిజానికి 2022-23 యాసంగిలో మొత్తం 5,15,375 ఎకరాల్లో పంటలు సాగైతే ఈ ఏడాది 3,55,827 ఎకరాల్లోనే సాగు చేశారు. పాలేరు రిజర్వాయర్ పరిధిలోని పాత కాల్వ కింద కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో సుమారు 5 వేలకు పైగా ఎకరాల్లో వరి ఎండింది.

భగీరథ ప్రయత్నం చేసినా..

ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన శీలం విష్ణు ఈ ఏడాది యాసంగిలో వైరా నది కింద 11 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాడు. మరో 20 రోజుల్లో వరి చేతికి అందనుండగా వైరా రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గిపోయింది. దీంతో వైరా నదిలో పొక్లెయినర్‌తో గుంతలు తవ్వించి మోటారు ద్వారా పైరుకు నీరందించే ప్రయత్నం చేశాడు. అయినా ఫలితం లేక 80 శాతం మేర పంట ఎండిపోయింది. పెట్టిన పెట్టుబడి అంతా నేల పాలైందని విష్ణు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



పంటను కాపాడేందుకు రైతు విష్ణు ఏర్పాటు చేసిన పైపులైన్

ఉమ్మడి కరీంనగర్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రధానంగా వరి పంటపై రైతాంగం ఆధారపడుతుంది. పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ఈసారి మార్చి 31 వరకు వేసంగి పంటకు నీరందింది. కానీ గతేడాదితో పోలిస్తే ఆశించినంత మేరకు అందలేదు. ఫలితంగా వేలాది ఎకరాల్లో వరి ఎండి పోయింది. పలుచోట్ల పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కరీంనగర్ జిల్లాలో దాదాపు 25వేల ఎకరాల వరకు వరి పంట సాగునీరు అందక ఎండిపోయిందని అనధికారిక అంచనా. పెద్దపల్లి జిల్లాలో ఎండలు దంచికొడుతుండటంతో చెరువులు, బావులు వట్టిపోతున్నాయి. మంథని, ముత్తారాం, రామగిరి, కాల్వ శ్రీరాంపూర్, ఓదెలా మండలాల్లో సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉంది. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో మాత్రం కొంతమేర వరి పంట ఎండిపోయింది. ఇక జగిత్యాల జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్ట్ అయిన శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ కింద కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందక జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 వేల ఎకరాల వరకు పొలాలు ఎండిపోయాయి.



ఈనిన వరి ఎండిపోయింది..

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు లకావత్ శ్రీనివాస్. ఊరు సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండా. యాసంగిలో మూడెకరాల్లో వరి పంట వేశాడు. 3 బోరు బావులు నమ్ముకుని పంట సాగు చేస్తే భూగర్భ జలాలు కాస్తా అడుగంటిపోయాయి. దీంతో బోర్లు వట్టిపోయి 3 ఎకరాల్లో ఈనిన పంట ఎండిపోయింది. ఇటీవల రూ.లక్ష వెచ్చించి 550 ఫీట్ల లోతులో బోరు వేయించాడు. కానీ నీళ్లు పడక పోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నాడు.

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఇలా..





5 బోర్లు వేశాడు

మక్తల్ మండలం ఉప్పర్‌పల్లికి చెందిన రవీందర్‌రెడ్డికి 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ యాసంగిలో బోరుబావి కింద రెండు ఎకరాల్లో వరి, మిగతా మిరప తోట సాగు చేశాడు. భూగర్భజలాలు అడుగంటడంతో సుమారు రూ.1.20 లక్షలు వెచ్చించి ఐదు బోర్లు వేశాడు. రెండింటిలో నీరు పడలేదు. మూడింటిలో అంతంత మాత్రంగా నీరు పడింది. మిరపతోటకు నీరు సక్రమంగా అందకపోవడంతో రూ.40 వేల వ్యయంతో స్ప్రింక్లర్లు వేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. చేసిన అప్పు ఎలా తీర్చాలని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

బకెట్‌తో నీళ్లు పోస్తూ..

ఈమె రైతు బోయ అంజమ్మ. నారాయణపేట జిల్లా మరికల్ మండలం అప్పంపల్లికి చెందిన ఈమె పదేళ్లుగా కూరగాయల సాగు చేస్తోంది. ఈ ఏడాది అర ఎకరంలో బెండతో పాటు ఇతర కూరగాయలు సాగు చేసింది. ఎండల తీవ్రత కారణంగా బోర్లల్లో నీటిమట్టం దాదాపుగా అడుగంటి పోయింది. వచ్చే కొద్దిపాటి నీటిని బిందెలు, బకెట్ల ద్వారా పోస్తూ పంటలు కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది.





నీటి కోసం పని మానేస్తున్నాం

“గట్టేపల్లి, చిత్తగూడ గ్రామాలకు నీళ్లు రావడం లేదు. ఉన్న ఒక్క చేతిపంపు, బావి నుంచి ఎడ్ల బండ్లతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. అన్ని పనులు మానేసి నీటి కోసమే సమయం వెచ్చిస్తున్నాం.

-కొడప కర్ణు, గట్టేపల్లి, ఇంద్రవెల్లి మండలం, ఆదిలాబాద్ జిల్లా

బోరు నీళ్లే తాగుతున్నాం

భగీరథ నీళ్లు అన్ని ఇళ్లకు రావడం లేదు. బోరింగ్ పంపు నీళ్లే తాగుతున్నాం. అయితే ఊరిలో ఒకే చేతిపంపు ఉండడంతో నీటి కోసం ఎంతో ఇబ్బంది అవుతోంది.

-రాథోడ్ సరితా బాయి, లింగాపూర్, ఆసిఫాబాద్ జిల్లా



గొంతెండిపోతోంది

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడుగంటిన బావులు, చేతి పంపులు

'భగీరథ'నీటి సరఫరాకు సమస్యలు

సుదూర ప్రాంతాల్లోని వ్యవసాయ బావులే ఆధారం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం గుడమామిడి పరిధి మాన్కుగూడ. ఇక్కడ మిషన్‌భగీరథ నీరు సరిగా రాకపోవడంతో బావి నీటిపైనే గ్రామస్తులు ఆధారపడుతున్నారు. వేసవిలో బావి నీరు అడుగంటడంతో ఇబ్బందులు పడుతున్నారు. పట్నాపూర్‌లోనూ ఇదే సమస్య ఉంది.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తాగునీటికి గోస తప్పడం లేదు. ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో నీటి కటకట నెలకొంది. బావులు, చేతి పంపులు ఎండిపోవడంతో సుదూర ప్రాంతాల్లోని వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. పలు ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా జరగాల్సి ఉన్నా.. అంతర్గత పైపులైన్లు, పంపింగ్ మోటార్ల నిర్వహణ లోపంతో పాటు లీకేజీల కారణంగా పల్లెలు అలాగే పట్టణాల్లోనూ తీవ్ర మంచినీటి సమస్య నెలకొంది. చేతి పంపులు, బావుల నుంచి ఎడ్ల బండ్లపై నీళ్లు తెచ్చుకుంటున్నామని ఈ ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. అనేకచోట్ల అడుగంటిన బావుల నుంచి పూడిక తీస్తున్న దృశ్యాలు కన్పిస్తున్నాయి. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి 'భగీరథ'నీరు సక్రమంగా రాకపోవడంతో ఉన్న ఒకేఒక చేతిపంపు వద్ద స్థానికులు నీళ్లు పట్టుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కొలాంగూడ, చిత్తగూడ, గట్టెపల్లి, సాలెగూడకు తాగునీటి సమస్య ఉంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాలకు భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. ఇక గిరిజన ప్రాంతాలు, మారుమూల అటవీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది.



మరమ్మతుకు నోచుకోని బెల్లంపల్లి బాబు క్యాంపు బస్తీలోని పైప్‌లైన్



మిడ్‌మానేరు

పాత కొదురుపాక ప్రభుత్వ పాఠశాల ఆనవాళ్లు



నీలోజిపల్లి పాత ఇంటి వద్ద అంజిరెడ్డి కుటుంబం



నీలోజిపల్లిలో తేలిన ఆంజనేయస్వామి గుడి

జ్ఞాపకాల్లో మునిగి తేలారు!

ఏడు టీఎంసీలకు పడిపోయిన మిడ్‌మానేరు | తేలిన ముంపు గ్రామాలు | పాత ఊళ్లను చూసేందుకు వస్తున్న నిర్వాసితులు | డెడ్ స్టోరేజీకి చేరువలో 'ఎస్సారెస్పీ | బయటపడుతున్న గ్రామాల ఆనవాళ్లు

బోయినపల్లి(చొప్పదండి)

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో బరువెక్కిన హృదయాలతో కన్నతల్లిలాంటి ఊరు విడిచి వెళ్లిన గ్రామస్తులు...ఇప్పుడు మళ్లీ ఆ మధుర స్మృతులను నెమరువేసుకుంటున్నారు. రాజన్నసిరిసిల్ల బోయినపల్లి మండలం మాన్వాడలో 27.55 టీఎంసీల సామర్థ్యంతో మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మించారు. నిర్మాణ సమయంలో బోయినపల్లి, వేములవాడ, తంగళ్లపల్లి మండలాలకు చెందిన 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టులోకి 2019లో పూర్తిస్థాయిలో 25 టీఎంసీల నీరు చేరడంతో నిర్వాసితులు పునరావాస కాలనీలకు తరలివెళ్లారు. 2022లో ప్రాజెక్టులో నీటిమట్టం 8 టీఎంసీలకు చేరగా.. పాత ఊళ్ల ఆనవాళ్లు కనిపించాయి. తిరిగి రెండేళ్ల అనంతరం కొద్ది రోజులుగా మిడ్‌మానేరులో 7.69 టీఎంసీల మేర నీరు మాత్రమే ఉండడంతో ముంపునకు గురైన ఇళ్ల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. వాటిని చూసేందుకు నిర్వాసితులు తరలివస్తున్నారు.

మునిగితేలిన ముంపు గ్రామాలు

బోయినపల్లి మండలం కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, వేములవాడ మండలం అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, రుద్రవరం, తంగళ్లపల్లి మండలం చీర్లవంచ, చింతలఠాణా గ్రామాలు తేలాయి. పాత ఇళ్లు, ఆలయాలు, మొండి గోడలు కనిపిస్తున్నాయి.

గుర్తుకొస్తున్నాయి



మా పాత గ్రామం ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పుట్టి పెరిగిన ఊరును చూడడానికి వెళితే పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. నీట తేలిన ఇళ్లలో కూలిన గోడలు.. దర్వాజాలు కనిపించడంతో గుండెలు బరువెక్కుతున్నాయి. **- కొనుకటి హరీశ్, నీలోజిపల్లి**

పాతూరు చూసేందుకు వచ్చిన..



పాత ఊర్లు తేలడంతో అందరం కలిసి చూసేందుకు వచ్చాం. సెల్ఫీలు దిగాం. ఇంట్లో ఉన్న పెద్ద వాళ్లకు.. పిల్లలకు పాత ఊరి ఫొటోలు చూపిస్తాం. **- పెంజర్ల మల్లయ్య, కొదురుపాక**



బయటపడిన బర్దిపూర్ గ్రామం వంతెన



శ్రీరాంసాగర్

బ్యాక్‌వాటర్‌లో బయటపడ్డ చేదబావి

60 ఏళ్లయినా చెక్కు చెదరని రోడ్లు, వంతెనలు

బాల్కొండ /సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలాశయంలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరుకుంటోంది. గత ఏడాది మే నెలలో కనిష్టంగా 21 టీఎంసీల నీటిమట్టం నిల్వ ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలోనే నీటిమట్టం 12.5 టీఎంసీలకు పడిపోయింది. దీంతో ముంపునకు గురైన గ్రామాల ఆనవాళ్లు ఒక్కటొక్కటిగా బయట పడుతున్నాయి. గాదేపల్లి– బర్దిపూర్ గ్రామాల మీదుగా నందిపేట్ మండల కేంద్రం వరకు గల రోడ్డు బయట పడింది. 60 ఏళ్లుగా నీటిలో ఉన్నా, ఆ రోడ్డుపై నిర్మించిన వంతెనలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ప్రాజెక్టు నడి మధ్యలో ఉన్న రత్నాపూర్ గుట్ట, ఆ గుట్ట వరకు ఉన్న దారి కూడా బయట పడింది. మరో 10 రోజుల్లో గుట్టపైకి వెళ్లి అక్కడ ఉన్న మల్లన్న దేవుడిని దర్శించుకోవచ్చని చెబుతున్నారు.

జనవరి నుంచే సంగమేశ్వర దర్శనం



సాక్షి, నాగర్‌కర్నూల్ : శ్రీశైలం రిజర్వాయర్‌లో ఏటా మార్చి, ఏప్రిల్ నెలలో నీరు తగ్గుముఖం పట్టాక సంగమేశ్వర ఆలయం బయటపడుతుంది. అయితే ఈ ఏడాది రిజర్వాయర్‌లో నీరు లేక జనవరి నెలలోనే సంగమేశ్వర ఆలయం బయటపడింది. ఇక్కడి శివలింగం రాయితో కాకుండా వేప వృక్షపు కలప(వేపదారు శివలింగం)తో ఉండటం విశేషం. కృష్ణా, వేణి, తుంగ, భద్ర, మలపహరని, భీమరతి, భవనాశిని నదులు కలిసే చోటు కావడంతో ఈ క్షేత్రాన్ని సప్తనదుల సంగమంగా పేర్కొంటారు. తెలంగాణ నుంచి భక్తులు కొల్లాపూర్ మండలంలోని సోమశిల వద్దనున్న కృష్ణాతీరం నుంచి బోట్ల ద్వారా సంగమేశ్వరానికి చేరుకుంటారు.

ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక అభివృద్ధి నిధుల లెక్క తేలేదెలా?

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ప్రత్యేక అభివృద్ధి నిధి కేటాయింపులు, ఖర్చుల లెక్క తేల్చేందుకు ఆ సంక్షేమశాఖలు తర్జనభర్జన పడుతున్నాయి. క్షేత్రస్థాయిలోని వివిధ ప్రభుత్వశాఖల నుంచి వివరాలు అందలేదు. వాటిని తెప్పించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వశాఖలకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేసిన నోడల్ ఏజెన్సీలు తాజాగా మరోసారి నోటీసులిచ్చాయి. నిర్దిష్ట ఫార్మాట్‌లో గణాంకాలు సమర్పించాలని స్పష్టం చేశాయి. అయినా ఇప్పటికీ 30 శాఖల నుంచి పూర్తిస్థాయి గణాంకాలు అందలేదు.

జాడలేని నోడల్ ఏజెన్సీల సమావేశాలు

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్‌డీఎఫ్, ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధి కింద 42 ప్రభుత్వ శాఖల ద్వారా వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తోంది. నిధులు కేటాయించిన శాఖల ద్వారా చేపట్టిన పనులు, చేసిన ఖర్చుపై పర్యవేక్షణ, సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేసింది. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి పర్యవేక్షణ బాధ్యత ఎస్సీ అభివృద్ధిశాఖకు, ఎస్టీ ప్రత్యేకఅభివృద్ధి నిధి పర్యవేక్షణను గిరిజన సంక్షేమశాఖకు అప్పగించింది. ఈ నోడల్ ఏజెన్సీ కమిటీలకు సంబంధిత శాఖల మంత్రులు చైర్మన్లుగా, కార్యదర్శులు సభ్యకార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఈ నోడల్ ఏజెన్సీలు మూడు నెలలకోసారి సమావేశమై నిధుల వినియోగం, కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించాలి. కానీ దాదాపు ఏడాదిన్నర నోడల్ ఏజెన్సీలు సమావేశాలు నిర్వహించలేదు. ఒకట్రెండు సార్లు ఎస్సీ అభివృద్ధిశాఖ తేదీలు ఖరారు చేసినా, చివరి నిమిషంలో రద్దు కావడంతో ఆ భేటీలు జరగలేదు.

సమావేశాలు జరిగితే...

సమావేశాలు జరిగితే నిధుల వినియోగం, డిమాండ్ తదితరాలపైన అధికారులకు స్పష్టత వచ్చేది. ఇదే సమయంలో శాఖల వారీగా కేటాయించిన నిధులు, చేపట్టే పనులకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత శాఖలు ప్రోగ్రెస్ రిపోర్ట్(పురోగతి నివేదిక) నోడల్ ఏజెన్సీలకు సమర్పించాలి. ఆ నివేదికలను క్రోడీకరిస్తూ నోడల్ ఏజెన్సీలు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తాయి. కానీ కొంతకాలంగా నోడల్ ఏజెన్సీలకు ప్రభుత్వశాఖలు నివేదికలు ఇవ్వడం లేదు.

లాభాలొస్తున్నా.. ఫలితం సున్నా

ఆర్టీసీలో విచిత్ర పరిస్థితి

- మార్చి నెలలో రూ.144 కోట్ల లాభం వచ్చినట్టు లెక్కలు తేల్చిన సంస్థ
- కానీ, రోజువారీ ఖర్చులకు కూడా ఇబ్బందికర పరిస్థితి
- మహాలక్ష్మి పథకం కింద జీరో టికెట్ల మొత్తాన్ని రీయింబర్స్ చేయని ప్రభుత్వం
- ఆ నిధులు మొత్తం వస్తేనే సంస్థకు 'పూట గడిచే'పరిస్థితి
- గత ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపు బకాయిలతో సరిపుచ్చిన ప్రభుత్వం
- మహిళకు ఉచిత ప్రయాణ రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత లేని దుస్థితి

2023 మార్చి నెలలో ఆర్టీసీకి రూ.528 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో టికెట్ల రూపంలో వచ్చింది రూ.428 కోట్లు. ఆ నెలలో సంస్థకు అయిన మొత్తం ఖర్చు రూ.605 కోట్లు. ఫలితంగా రూ.77 కోట్ల నష్టం నమోదైంది.



2024 మార్చి నెలలో సంస్థ నమోదు చేసుకున్న మొత్తం ఆదాయం 696 కోట్లు. ఇందులో టికెట్ల ద్వారా వచ్చింది రూ. 598 కోట్లు. మొత్తం వ్యయం రూ.552 కోట్లు. దీంతో రూ.144 కోట్ల ఆదాయం నమోదైంది.

సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమే అమలవుతున్నా ఆర్టీసీ జీరో టికెట్లు జారీ చేస్తోంది. అలా ప్రతినెలా జారీ అయ్యే మొత్తం జీరో టికెట్ల పూర్తి చార్జీని ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంది. దీంతో దాన్ని ఆదాయంగానే భావిస్తోంది. ఫలితంగా నష్టాల ఆర్టీసీ ఒక్కసారిగా లాభాల్లోకి వచ్చింది. నష్టం కనుమరుగై ఒకే నెలలో ఏకంగా రూ.144 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నట్టు తాజాగా లెక్కలు రూపొందించింది. మరి నిజంగా ఇది ఆర్టీసీ లాభాల ఫలితాలు అనుభవిస్తోందా..?

వాస్తవం ఎలా ఉందంటే...

మహాలక్ష్మి పథకం రీయింబర్స్‌మెంట్ పేరుతో ప్రభుత్వం ఆర్టీసీకి ప్రతినెలా ఆ మొత్తాన్ని విడుదల చేయటం లేదు. ఆ రూపంలో నిధులు ఇవ్వటం లేదు. మహిళల ఉచిత ప్రయాణం మొదలైన తర్వాత జారీ అవుతున్న జీరో టికెట్ల మొత్తాన్ని పరిశీలిస్తే, సగటున ప్రతినెలా రూ.350 కోట్ల వరకు అవుతోంది. మార్చి నాటికి ప్రభుత్వం ఆ రూపంలో రూ.1400 కోట్లు విడుదల చేయాలని కోరినట్టు, ఆర్టీసీ ఇటీవల మరో కేసు విషయంలో హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. కానీ, వరుసగా గత మూడు నెలల్లో ప్రభుత్వం రూ.285 కోట్లు, రూ.285 కోట్లు, రూ.275 కోట్లు చొప్పున విడుదల చేసింది. కానీ వీటిని మహాలక్ష్మి రీయింబర్స్‌మెంట్‌గా ఇవ్వలేదు. గత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో ఆర్టీసీకి కేటాయించిన మొత్తంలో పేరుకుపోయిన బకాయిలుగానే సంస్థ భావిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన చివరి బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.1500 కేటాయిస్తూ ప్రతిపాదించింది. కానీ, ఆ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.500 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. గత డిసెంబరు నుంచి కొత్త ప్రభుత్వం రూ.1,000 కోట్లు విడుదల చేసింది. మార్చి నెలతో చెల్లించిన మొత్తంతో ఆ బడ్జెట్ కేటాయింపులు క్లియర్ అయ్యాయి. దీంతో వాటిని బడ్జెట్ చెల్లింపులుగానే సంస్థ భావిస్తోంది. అదే నిజమైతే, మహాలక్ష్మి పథకం రూపంలో సంస్థకు ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు ఇవ్వనట్టుగానే భావించాల్సి ఉంటుంది. ఇలా రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో జాప్యం జరిగితే సంస్థ మళ్లీ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుపోవటం ఖాయంగా కనిపిస్తోంది.

లాభాలు ఉత్తుత్తి లెక్కలే..

ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే.. లాభాలకు సంబంధించి కాగితాలపై చూపిన ఉత్తుత్తి లెక్కలుగా తేలిపోతోంది. ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవటంతో, ఆ లాభాల తాలూకు ఫలితాలు ఎక్కడా కనిపించటం లేదు. ఆర్టీసీకి సహకార పరపతి సంఘం బకాయిలు, పీఎఫ్ బకాయిలు, కరువు భత్యం బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. 2013 వేతన సవరణకు సంబంధించి ఉన్న బకాయిల్లో బాండ్ల తాలూకు చెల్లింపులు కూడా అర్ధంతరంగా నిలిచిపోయాయి. వీటికి సంబంధించి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి నెలలో రూ.280 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. కానీ, వాటిల్లో కేవలం కొంతమంది డ్రైవర్లకు మాత్రమే రూ.80 కోట్ల వరకు చెల్లించినట్టు తెలుస్తోంది.

ఇళ్లు.. ఇవ్వాల్సిందే



- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం అమలు కావాల్సిందే
- స్వార్థ, నిగూఢ ప్రయోజనాల కోసం పథకాన్ని అడ్డుకోవడానికి వీల్లేదు
- సంక్షేమ రాజ్యంలో పేదలకు గృహ వసతి కల్పించాల్సిన రాజ్యాంగ బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- ఒకసారి పరిహారం చెల్లించి భూమి తీసుకున్న తర్వాత అది ప్రభుత్వానిదే
- ఆ భూమిపై పరిహారం తీసుకున్న వారు యాజమాన్య హక్కులు కోరజాలరు.. ఆ భూమిని ప్రభుత్వం ఏ ప్రజా ప్రయోజనం కోసమైనా వినియోగించవచ్చు
- కర్నూలు జిల్లాలో ఎస్ఆర్‌బీసీ వద్ద 130.86 ఎకరాల భూమిని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించడం సరైనదే
- హైకోర్టు జడ్జి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ 89 పేజీల తీర్పు

నా సంగతి మీకు తెలీదు.. తనిఖీలు ఆపి వెంటనే వెళ్లండి



డీఆర్ఐ అధికారిపై దౌర్జన్యం చేస్తున్న బీజేపీ నేత సీఎం రమేష్

- టైల్స్‌షాప్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్ఐ అధికారులపై బీజేపీ నేత సీఎం రమేష్ దౌర్జన్యం
- వెళ్లకపోతే తాను అక్కడి నుంచి కదిలేది లేదని హుూంకరింపు.. షాపు యాజమాని ఇచ్చిన సమాచారంతో అనుచరులతో వచ్చి హల్‌చల్
- ఫైళ్లు లాక్కుని తనిఖీ అధికారులపై గూండాయిజం చెలాయించిన వైనం
- విధి నిర్వహణకు అడ్డురావద్దని అధికారులు చెప్పినా ఆగకుండా దందా
- పోలీసులకు ఫిర్యాదు చేసిన డీఆర్ఐ అధికారులు.. ప్రశాంతమైన అనకాపల్లి జిల్లాలో రౌడీయిజంపై భయభ్రాంతులైన స్థానికులు
- ఎన్నికల సమయంలోనే ఇలా చేస్తే ఇక గెలిపిస్తే బతకనిస్తారా అంటూ వ్యాఖ్యలు

అయ్యో.. అవ్వాతాతలు!

చంద్రబాబు కుట్రలతో విలవిల

పింఛన్లకు వెళ్లి ఎండ దెబ్బ తాళలేక మృత్యువాత.. గురువారం 19 మంది మృతి

2 రోజుల్లో మొత్తం 39 మంది కన్నుమూత

టీడీపీ కుట్రల వల్లే తమకీ దుర్గతి పట్టిందని బాధితుల ఆక్రందన

88.03 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ఒకటిన్నర రోజుల్లోనే 57.83 లక్షల మందికి రూ.1,749.53 కోట్లు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'ఫ్యాన్' ప్రభంజనమే

▶ మొదటి పేజీ తరువాయి

ఒక్క ఎంపీ సీటు కూడా రాదని తేల్చింది. టీడీపీ, జనసేన కూటమి మూడు నుంచి నాలుగు ఎంపీ స్థానాలతో ఒకింత ఉనికి చాటుకునే అవకాశం ఉందని పేర్కొంది.

విశ్వసనీయతకు పట్టం..

సర్వే ఫలితాలు ఆంధ్రప్రదేశ్‌లో తాజా రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టాయని చర్చలో పాల్గొన్న విశ్లేషకులు స్పష్టం చేశారు. గత ఎన్నికలతో పోల్చితే వైఎస్సార్‌సీపీ తిరుగులేని శక్తిగా అవతరించడానికి కారణాలపై ప్రధానంగా చర్చ సాగింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం వాగ్దానాలను సీఎం వైఎస్ జగన్ అమలు చేసి ''చెప్పాడంటే.. చేస్తాడంతే..'' అనే నమ్మకాన్ని ప్రజల్లో పెంచుకున్నారు. మీ బిడ్డగా మీ ఇంటికి మంచి చేశానని నమ్మితే ఓటేయాలంటూ సీఎం జగన్ ఇచ్చిన పిలుపు ప్రజల్లోకి బలంగా వెళ్లింది. రాష్ట్రంలో ప్రతి ఇంటా.. ప్రతి గ్రామం.. ప్రతి నియోజకవర్గంలో సాకారమైన మార్పులు కళ్లెదుటే కనిపిస్తుండటంతో ప్రజలంతా సంక్షేమ సర్కారుకు జై కొడుతున్నారు. కూటమిగా చేరిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు నైతిక స్థైర్యం కోల్పోయి ఉనికి కోసం కుట్రలు చేస్తున్నాయి.





గురువారం తిరుపతి జిల్లా నాయుడుపేటలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్ • సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

వలంటీర్ల సేవలు ఆగవు

ఎన్నికల తర్వాత ఆ ఫైల్‌పైనే నా మొదటి సంతకం

మళ్లీ వలంటీర్ వ్యవస్థ తీసుకొస్తాం • నాయుడుపేట సభలో సీఎం వైఎస్ జగన్

చంద్రబాబు దుర్మార్గం వల్ల నిన్న, ఈరోజు (బుధ, గురువారాల్లో) ఏకంగా 31 మంది అవ్వాతాతలు పెన్షన్‌ను అందుకునే క్రమంలో నడవలేక, అవస్థ పడలేక ప్రాణాలు విడిచారు. 31 మందిని చంపిన ఈ చంద్రబాబు నాయుడును హంతకుడు అందామా? లేక అంతకన్నా దారుణమైన పదం ఏమైనా ఉంటే అది అందామా? ఆలోచించండి. అయ్యా చంద్రబాబూ.. మీ హయాంలో జన్మభూమి కమిటీలు పెట్టుకున్నారు. పెన్షన్, రేషన్‌కార్డు,సర్టిఫికెట్, చివరకు మరుగుదొడ్లు కావాలన్నా లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉండింది. ఈరోజు వలంటీర్ వ్యవస్థ వల్ల ఆ కష్టాలు లేవు. అందుకే కదా మీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

అయ్యా చంద్రబాబూ.. నువ్వు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశావు.. మూడు సార్లు ముఖ్యమంత్రి అని చెప్పుకుంటావు కదా.. మరి నీ పేరు చెబితే కనీసం ఒక్కటంటే ఒక్కటైనా నువ్వు చేసిన మంచి పని, స్కీము గుర్తుకు వస్తుందా? పైగా చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చేది వెన్నుపోట్లు, మోసాలు, అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు. అందుకే చంద్రబాబుకు నా అనే వాళ్లు ఈ రాష్ట్రంలో కరువు. పక్క రాష్ట్రంలో కూడా ఎవరూ లేరు. ఎవరైనా ఉన్నారా అంటే అది ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, వీరందరికీ తోడు ఓ దత్తపుత్రుడు. వీళ్లందరూ కలిసి గ్రామ గ్రామాన ఏర్పాటు చేసుకున్న జన్మభూమి దొంగల ముఠా. వీరంతా మన రాష్ట్రాన్ని దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం. ఇదీ వీళ్లకు తెలిసిన రాజకీయం.

– సీఎం వైఎస్ జగన్

సాక్షి, తిరుపతి: 'రాష్ట్రంలో 66 లక్షల మంది పెన్షన్లు తీసుకుంటున్నారు. వీరిలో అవ్వాతాతలు, వితంతు అక్కచెల్లెమ్మలు, దివ్యాంగులు ఉన్నారు. అయ్యా.. చంద్రబాబు నాయుడూ.. ఇలాంటి వాళ్లను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదు. ఇబ్బంది పడిన వారందరికీ ఒకే మాట చెబుతున్నా. కొంచం ఓపిక పట్టండి. జూన్4వ తారీఖున మళ్లీ మీ బిడ్డ ప్రభుత్వం వస్తుంది. మళ్లీ వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి ప్రతి ఇంటికీ సేవలందించే ఫైల్‌పైనా నా మొట్ట మొదటి సంతకం చేస్తాను'అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 'మేమంతా సిద్ధం'ఎనిమిదవ రోజు బస్సు యాత్ర గురువారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో సాగింది. ఈ సందర్భంగా నాయుడుపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ ఎన్నికలు కేవలం ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకునేవి మాత్రమే కావని, మీ తల రాతలు మార్చే ఎన్నికలని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెండు భావజాలాల మధ్య సంఘర్షణ

- రెండు భావజాలాల మధ్య సంఘర్షణగా జరుగుతున్న ఎన్నికలివి. జగన్‌ను ఓడించాలని వారు.. పేదల్ని గెలిపించాలని, ఇంటింటి అభివృద్ధిని కొనసాగించాలని మనం.. పెత్తందారీ భావజాలానికి, మన పేదల అనుకూల భావజాలానికి మధ్య జరుగుతున్న యుద్ధం.
- గవర్నమెంట్ బడిలో ఇంగ్లిష్ మీడియం వద్దన్న వారికి, అదే గవర్నమెంట్ బడిని నాడు–నేడుతో మొదలు పెట్టి.. ఇంగ్లిష్ మీడియం, పిల్లల చేతుల్లో ట్యాబులు, డిజిటల్ బోధన, సీబీఎస్ఈ, ఐబీ దాకా ప్రయాణం సాగిస్తున్న మనకు మధ్య పోరాటం ఈ ఎన్నికలు.
- పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి వీల్లేదని, ఒక వేళ పేదలకు ఇళ్ల పట్టాలిస్తే కులాల మధ్య సమతుల్యం దెబ్బతింటుందని నిస్సిగ్గుగా కోర్టుల్లో వాదించిన వారికి, నా అక్కచెల్లెమ్మల పేరిట 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చిన మనకు మధ్య ఈ యుద్ధం.
- నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, పేద సామాజిక వర్గాలకు పెద్దపీట వేయడానికి మనసు లేని గత టీడీపీ పాలనకు.. ఏకంగా చట్టం చేసి మరీ 50 శాతం పదవులు ఇస్తూ నా.. నా.. నా.. నా.. అంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను గుండెల్లో పెట్టుకున్న మనందరి ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న యుద్ధం.
- 650 హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిన వారికి, రూ 2.70 లక్షల కోట్లు.. అందులో 75 శాతానికి పైగా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే లబ్ధి పొందిన పరిస్థితి. డీబీటీగా నేరుగా మీ బిడ్డ బటన్ నొక్కడం, నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లిపోయేలా చేసిన మన ప్రభుత్వం మధ్య జరుగుతున్న యుద్ధం.

చంద్రబాబుది కిచిడీ మేనిఫెస్టో..

ఏ ఒక్కరూ తన కులం, మతం, ఆర్థిక పరిస్థితి వల్ల మంచి చదువులు చదువుకోవడానికి అడ్డంకులు లేని ఓ సొసైటీని క్రియేట్ చేసే కార్యక్రమం కోసం ఈ 58 నెలలుగా మీ బిడ్డ కష్టపడ్డాడు. ధనికులకు ఒకరకమైన చదువు, పేదలకు ఇంకొక రకమైన చదువు ఉండటానికి వీల్లేదని క్వాలిటీ ఎడ్యుకేషన్ తీసుకొచ్చాడు. మీ బిడ్డ వేసిన ఈ విత్తనాలు మరో 10–15 సంవత్సరాల్లో ఏ స్థాయి వృక్షాలు అవుతాయంటే.. మన పేదింటిలో పుట్టిన మన పిల్లలు.. ఏ లెవల్లో అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడతారంటే, పెద్దింటి పిల్లలకు కూడా అసూయ పుట్టే విధంగా వాళ్లు మాట్లాడే పరిస్థితి వస్తుంది. ఇంటింటికీ మంచి చేయగలిగాం కాబట్టే, మనకు వారి మాదిరిగా కుట్రలు, పొత్తులు, ఎత్తులు, జిత్తులతో పని లేదు.

- మీ బిడ్డ మోసం చేయలేదు. మంచి చేశాను కాబట్టే మళ్లీ ఒంటరిగా ఆత్మవిశ్వాసంతో ప్రజల ఆశీస్సుల కోసం వచ్చాను. 2024 ఎన్నికల్లో కూడా మీ బిడ్డ అబద్ధాలు చెప్పడు. మోసాలు చేయడు. చేయలేని వాగ్దానాలను సాధ్యం కాని వాగ్దానాలను మేనిఫెస్టోలో పెట్టడు. ఒక్కటే గుర్తుంచుకోండి. జగన్‌కు పేదలపై ఉన్న ప్రేమ ఈ దేశ రాజకీయ చరిత్రలో మరే నాయకుడికీ లేదు.. ఉండదు. జగన్ చేయలేని ఏ స్కీమైనా చంద్రబాబు కాదు కదా.. ఆయన జేజమ్మ కూడా అమలు చేయలేదు.
- చంద్రబాబు అబద్ధాల కిచిడీ మేనిఫెస్టోతో పోటీ పడాలని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే చంద్రబాబు మనస్తత్వం ఎలాగూ చేసేది లేదు కాబట్టి, ప్రజల్ని ఎలాగూ మోసమే కదా చేసేది కాబట్టి నోటికి ఏదొస్తే అది చెబుతాడు. అందుకే మీ బిడ్డ చంద్రబాబు నాయుడుతో, ఆయన అబద్ధాలతో, ఆయన మోసాల కిచిడీ మేనిఫెస్టోతో పోటీ పడాలని మీ బిడ్డ అనుకోవడం లేదు. నిజాలకు, నిజాయితీకి, నిబద్ధతకు ప్రజలు విలువ ఇస్తారన్న నమ్మకం మీ బిడ్డకు ఉంది.
- మన ఐదేళ్ల పాలనలో మేనిఫెస్టోలో చెప్పనివి కూడా చాలా చేశాం. భవిష్యత్తులో కూడా వెసులుబాటును బట్టి మేనిఫెస్టోలో చెప్పినా, చెప్పకపోయినా ప్రతి ఇంటికీ చేయగలిగిన మంచి అంతా చేస్తాను.

ఒక్క హామీ అయినా నెరవేర్చారా?

- ఇదే చంద్రబాబు 2014లోనూ ఇదే మాదిరి పొత్తులు పెట్టుకున్నాడు. ఈ మూడు పార్టీలూ కలిసి ఇంటింటికీ ముఖ్యమైన హామీలు అంటూ పాంప్లెట్ పంపించారు. చంద్రబాబు, దత్తపుత్రుడు, మోదీ ఫొటోలు.. కింద చంద్రబాబు నాయుడు సంతకంతో ఈ పాంప్లేట్ (చూపిస్తూ) పంపించాడు.
- ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5లో అడ్వర్‌టైజ్‌మెంట్లతో హోరెత్తించారు. రైతులకు రుణ మాఫీపై మొదటి సంతకం చేస్తా అన్నాడు. రూ.87,612 కోట్లు రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల డ్వాక్రా రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకు అకౌంట్లో డిపాజిట్ చేశాడా? ఇంటింటికీ ఉద్యోగం.. లేదా నెలనెలా రూ.2 వేల నిరుద్యోగభృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లు.. అంటే 60 నెలలకు నెలకు రూ.2000 చొప్పున లెక్కిస్తే.. ప్రతి ఇంటికీ రూ.1.20 లక్షలు ఇచ్చారా? అర్హులైన వాళ్లందరికీ 3 సెంట్ల స్థలం ఇచ్చారా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు.. చేశాడా?
- మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు జరిగిందా? రాష్ట్రాన్ని సింగపూర్‌ను మించి అభివృద్ధి చేస్తానన్నాడు. ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి మన నాయుడుపేటలో ఏమన్నా కనిపించిందా? ఇలా 650 హామీలు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ అదే మోసం. అవే పొత్తులు. ఇప్పుడు సూపర్ సిక్సు, సూపర్ సెవెన్ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు.

ఎన్నికల్లో డబుల్ సెంచరీ కొట్టాలి..

- '175 అసెంబ్లీ స్థానాలకు 175, 25 ఎంపీ సీట్లుకు 25 మొత్తం రెండు వందల సీట్లు.. ఎక్కడా తగ్గేందుకు వీల్లేదు. డబుల్ సెంచరీ కొట్టేందుకు నేను సిద్ధం.. మీరంతా సిద్ధమేనా? ఎన్నికల సంగ్రామంలో అబద్ధాన్ని, మోసాన్ని మట్టి కరిపించడానికి నేను సిద్ధం. మరి మీరంతా కూడా సిద్ధమా.. (సిద్ధమే అని కేకలు). ఈ 58 నెలల్లో ఇంటింటికీ మేలు జరిగి ఉంటే మీ జగన్‌కు, మీ బిడ్డకు, మీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తోడుగా నిలవాలి.

ఇంటికొచ్చి పెన్షన్ ఇస్తే జీర్ణించుకోలేక..

- ఇంటికే వచ్చి పెన్షన్ సొమ్ము అవ్వాతాతల చేతుల్లో పెట్టడం మొన్నటి దాకా చూశాం. 58 నెలలుగా ప్రతి నెలా 1వ తారీఖున అది ఆదివారమైనా, సెలవుదినమైనా తెల్లవారక మునుపే వలంటీర్లు నేరుగా ఇంటికి వచ్చి చిక్కటి చిరునవ్వుతో గుడ్ మార్నింగ్ చెబుతూ ఆ అవ్వాతాతలకు ఒక మంచి మనవడిగా, మన వరాలుగా తోడుగా ఉంటూ పెన్షన్ చేతిలో పెట్టారు. ఎన్నికలు వచ్చేసరికే ఇది జీర్ణించుకోలేక అసూయతో ఇదే పెద్దమనిషి చంద్రబాబునాయుడు తనకు సంబంధించిన మనిషి నిమ్మగడ్డ రమేష్ చేత, ఎన్నికల కమిషన్‌కు పిటిషన్ పెట్టించిఅడ్డుకున్నారు.
- గతంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు కేవలం రూ.1000 ఇస్తున్న పెన్షన్‌ను మీ బిడ్డ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3 వేలకు పెంచుకుంటూ పోయాం. ఇది వారికి గిట్టలేదు. రాజకీయాలు నిజంగా చెడిపోయాయి. దిగజారిపోయాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు.. రాజమండ్రిలో టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు లాంటి వారు ఏకంగా ప్రెస్‌మీట్లు పెట్టి మేమే ఆపించామని చెప్పడం మీరంతా కూడా చూశారు. వీళ్ల అహంకార ధోరణిని ఏరకంగా నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారో మీరంతా గమనించారు.

చంద్రబాబే ప్రధాన నిందితుడు

రెండో నిందితుడు అచ్చెన్నాయుడు • పక్కా పథకం ప్రకారమే 'స్కిల్' కుంభకోణం

- న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీఐడీ
- సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ సంస్థ పేరుతో ఒప్పందం చేశారు
- రూ.330 కోట్ల విలువైన ప్రాజెక్టును రూ.3,300 కోట్లకు పెంచారు
- సీమెన్స్ కంపెనీ వాటా 90 శాతం నిధుల్లో ఒక్క రూపాయి వెచ్చించలేదు
- ప్రభుత్వ వాటా కింద జీఎస్టీతోసహా రూ.371 కోట్లు చెల్లించేశారు
- ఇలా చెల్లించడం నిబంధనలకు విరుద్ధం
- అందులో రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు కొల్లగొట్టారు



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పక్కా పన్నాగంతోనే రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణానికి పాల్పడ్డారని సీఐడీ నిగ్గు తేల్చింది. ఇప్పటికే ఈ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా 52 రోజులు ఉండటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి సమగ్ర వివరాలతో సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో చంద్రబాబే ప్రధాన నిందితుడు (ఏ1)గా, రెండో నిందితుడ (ఏ2)గా అప్పటి కార్మిక శాఖ మంత్రి అచ్చెన్నాయుడును పేర్కొంది. వారిపై ఐపీసీ సెక్షన్లు 120 (బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477 (ఏ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37తోపాటు అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1) (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేసింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో ఒప్పందాన్ని తెరపైకి తీసుకువచ్చి నిబంధనలకు విరుద్ధంగా ప్రజాధనాన్ని కొల్లగొట్టారని సీఐడీ ఈ చార్జిషీట్‌లో పేర్కొంది. రూ.330 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌ను రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌గా కనికట్టు చేశారని వివరించింది. ఒప్పందంలో పేర్కొన్న ప్రకారం సీమెన్స్ కంపెనీ వాటా 90 శాతం నిధుల్లో ఒక్క రూపాయి కూడా వెచ్చించకపోయినా, ప్రభుత్వ వాటా 10% నిధులను జీఎస్టీతోసహా రూ. 371 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా చెల్లించారని తెలిపింది. అందులో రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు కొల్లగొట్టారని వివరించింది. సీఐడీ చార్జ్‌షీట్‌లోని ప్రధాన అంశాలు ఇవీ...

2017లోనే బయటపడినా..

2017లోనే కేంద్ర జీఎస్టీ అధికారులు పుణెలోనిపలు షెల్ కంపెనీల్లో జరిపిన సోదాల్లో ఏపీఎస్ఎస్‌డీసీకి సరఫరా చేసిన నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించి, ఏపీ ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చారు. దీనిపై విచారణ చేయకుండా ఏసీబీని చంద్రబాబు అడ్డుకున్నారు. ఆ వెంటనే ఏపీఎస్ఎస్‌డీసీ ఆఫీసులో ఈ ప్రాజెక్టు ఫైళ్లను మాయం చేశారు. 2019లో పుణెకి చెందిన ఓ సామాజిక కార్యకర్త ఈ కుంభకోణం గురించి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. దాంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సిట్ దర్యాప్తులో చంద్రబాబు అవినీతి బాగోతం మొత్తం బట్టబయలైంది. సీఐడీ అధికారులు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు తమకు ఆ ప్రాజెక్టు గురించే తెలియదని స్పష్టం చేసింది. డిజైన్‌టెక్, ఇతర షెల్ కంపెనీల ద్వారా సాగించిన కుంభకోణాన్ని కూడా సిట్ అధికారులు ఛేదించారు. స్కిల్ కుంభకోణానికి కర్త కర్మ క్రియ అంతా చంద్రబాబే అన్నది నిర్ధారణ అయింది.

రూ.370 కోట్ల నుంచి రూ.3,300 కోట్లకు పెంచేసి

సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ ముసుగులో పక్కా పథకం ప్రకారం ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అనంతరం చంద్రబాబు తన బినామీ సంస్థ డిజైన్‌టెక్‌ను రంగంలోకి దింపారు. ఈ ప్రాజెక్టులో చంద్రబాబు బినామీలు, సన్నిహితులైన అప్పటి ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె. లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.370 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3,300 కోట్లకు పెంచేశారు. ప్రభుత్వం 10 శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ 90 శాతం పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు 2015 జూన్ 30న ఉత్తర్వులు జారీ చేశారు. ఒప్పందంలో చెబుతున్నట్లుగా సీమెన్స్–డిజైన్‌టెక్ కంపెనీలు వాటి వాటా 90 శాతంలో ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. కానీ ఏపీఎస్ఎస్‌డీసీ మాత్రం తన వాటా కింద డిజైన్‌టెక్ కంపెనీకి రూ.371 కోట్లు విడుదల చేసేసింది. అప్పటి ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల అభ్యంతరాలను చంద్రబాబు బేఖాతరు చేస్తూ రూ.371 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. అందుకోసం ఈ ప్రాజెక్టు నోట్ ఫైళ్లపై 13 చోట్ల చంద్రబాబు సంతకాలు చేశారు. డిజైన్‌టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లతో అక్రమంగా తరలించారు. షెల్ కంపెనీల సృష్టికర్తలు, దళారుల కమీషన్లు పోను చంద్రబాబుకు రూ.241 కోట్లు చేర్చారు. డిజైన్‌టెక్, పీవీఎస్పీ స్కిల్లర్ తదితర షెల్ కంపెనీల ద్వారా నిధులను హవాలా మార్గంలో మళ్లించారు.

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం కోర్టు

ఆయన బెయిల్ రద్దు పిటిషన్‌పై కొనసాగుతున్న విచారణ

స్కిల్ స్కామ్‌లో తనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలన్న చంద్రబాబు వినతిని సుప్రీంకోర్టును తిరస్కరించింది. ఈ కుంభకోణానికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నందున ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. మరోవైపు ఈ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని సీఐడీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చంద్రబాబు కుటుంబ సభ్యులు రెడ్‌బుక్ పేరుతో ఈ కేసులో కీలక సాక్షులు, అధికారులను బెదిరింపులకు గురిచేసి దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్నారని కూడా సీఐడీ ఆ పిటిషన్‌లో పూర్తి ఆధారాలతో పేర్కొంది.

దర్యాప్తు చేస్తున్న ఈడీ

మనీ లాండరింగ్ ద్వారా నిధులు మళ్లించిన స్కిల్ స్కామ్ గురించి సీఐడీ అధికారులు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి నివేదించారు. దాంతో రంగంలోకి దిగిన ఈడీ ఈ కుంభకోణంలో కీలక పాత్రధారులైన సీమెన్స్ కంపెనీ అప్పటి ఎండీ సుమన్ బోస్, డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ ఖన్వేల్కర్, చార్టెట్ అకౌంటెంట్ ముకుల్ చంద్ర అగర్వాల్, షెల్ కంపెనీల సృష్టికర్త సురేశ్ గోయల్‌ను అరెస్ట్ చేసింది. డిజైన్‌టెక్ కంపెనీకి చెందిన రూ.31.20 కోట్ల ఆస్తులను జప్తు చేసింది కూడా.

సీఐడీ చార్జ్‌షీట్‌లో పేర్కొన్న నిందితులు

- ఏ1: చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి
- ఏ2: కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రి
- ఏ3: గంటా సుబ్బారావు, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ - సీఈవో
- ఏ4: కె.లక్ష్మీనారాయణ, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్
- ఏ5: సీమెన్స్, డిజైన్‌టెక్, పీవీఎస్‌పీ స్కిల్లర్ తదితర కంపెనీల అధికారులు


పురందేశ్వరి బరితెగింపు!



- 22 మంది ఐపీఎస్‌లను బదిలీ చేయాలంటూ ఈసీకి లేఖ
- వారి స్థానంలో ఎవరెవరిని నియమించాలో కూడా సూచన
- ఎన్నికల ప్రక్రియకు సంబంధం లేని అధికారులపైనా ఆరోపణలు
- బెదిరింపు ధోరణిలో లేఖ రాయటం వెనక బాబు పాత్ర స్పష్టం
- చంద్రబాబు కేసులు విచారిస్తున్న సీఐడీ అధికారిపైనా కక్ష ధోరణి
- ఆయనకు ఎన్నికలతో సంబంధం లేకున్నా.. బదిలీ చేయాలని లేఖ
- మరిది కోసం పూర్తిగా దిగజారిన తీరు; పదవి తాకట్టుపై బీజేపీలోనే విస్మయం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆమెది శిఖండి పాత్ర



- మరిది కళ్లలో ఆనందమే ఆమె లక్ష్యం
- పురందేశ్వరి తీరుపై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం
- 22 మంది ఐపీఎస్ అధికారుల బదిలీకి ఆదేశాలివ్వడం విడ్డూరం
- బదిలీ స్థానాల్లో ఎవర్ని నియమించాలో ఏ హోదాలో సిఫార్సు చేస్తారు?
- బరితెగింపు రాజకీయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 5-4-2024

ఫ్యాషన్

తెలుగింటి వెలుగులు

ఏ సంప్రదాయ వేడుకైనా అమ్మాయిలను ముందుగా ఆకట్టుకునేది లంగాఓణీ, గాగ్రాచోలీలు. తెలుగు సంవత్సరాది సందర్భంగా ఎంచుకోదగిన హాఫ్‌శారీ కలర్ కాంబినేషన్స్, తక్కువ ఖర్చుతో డిజైన్ చేసుకోవడం ఎలా .. అనే విషయాలపై అవగాహన ఎప్పుడూ అవసరం ఉంటూనే ఉంటుంది.



పండగల సమయంలో ముదురు, కాంతిమంతమైన రంగులున్నవి ఎంచుకుంటే కళగా కనిపిస్తుంది. పెళ్లిళ్లకు కూడా పై విధంగానే ఎంచుకోవాలి. పుట్టినరోజులు, రిసెప్షన్ వంటి వెస్టన్ టచ్ ఉన్న వేడుకలకు పేస్టల్ షేడ్స్ రిచ్‌గా ఉంటాయి.

డార్క్ కలర్స్ లెహంగా చోలీలు ధరించినప్పుడు గోల్డ్, టెంపుల్ జ్యూయలరీ బాగుంటుంది. పేస్టల్ కలర్స్‌కి డైమండ్స్, కుందన్, ముత్యాలను కూర్చిన ఆభరణాల అలంకరణ అందంగా ఉంటుంది.

హాఫ్ శారీస్ ఫ్యాబ్రిక్, ఎంబ్రాయిడరీ వర్క్‌ను బట్టి ఖర్చు పెరుగుతుంటుంది. గ్రాండ్ లుక్‌తోనూ కావాలనుకుంటే ఫ్యాబ్రిక్ ఎంపిక సరైనదిగా ఉండాలి. పెద్ద పెద్ద జరీ బార్డర్స్ ఉన్న మెటీరియల్‌ను ఎంచుకుంటే బాగుంటుంది. మగ్గం వర్క్స్ డిజైన్స్ బట్టి ఖర్చు పెరుగుతుంటుంది.

పిల్లలు కూడా పండగలు, వివాహ వేడుకలలో ముదురు, కాంతిమంతమైన రంగులను ఇష్టపడుతున్నారు. పిల్లల డ్రెస్ డిజైన్స్‌లో కలర్స్, ఆభరణాల విషయంలో సింపుల్‌గా ఉంటేనే బాగుంటుంది.

సంయుక్తారెడ్డి,
ఫ్యాషన్ డిజైనర్,
హైదరాబాద్

న్యూస్‌మేకర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిహార్ నుంచి 25 ఏళ్ల శాంభవి చౌదరి ఎన్నికల్లో పోటీ చేయనుంది. దేశంలో అతి చిన్నవయసు మహిళా దళిత అభ్యర్థిగా శాంభవి వార్తల్లో నిలిచింది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా తాను వేయదగ్గ ముద్ర... తనదైన దృష్టికోణం ఉన్నాయంటున్నది శాంభవి.

అతి చిన్న వయసు దళిత అభ్యర్థి

‘నేను పనిచేసే చోట స్త్రీలు, యువతే నా లక్ష్యం. వీరికి ఆర్థిక స్వావలంబన, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది’ అంటోంది శాంభవి చౌదరి. 25 ఏళ్ల 9 నెలల వయసు వున్న ఈ డాక్టరెట్ స్టూడెంట్ బిహార్‌లోని ‘సమస్తిపూర్’ పార్లమెంట్ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) తరఫున పోటీ చేయనుంది. ఇది రిజర్వ్‌డ్ స్థానం. బహుశా శాంభవి దేశంలోనే అత్యంత చిన్న వయసు కలిగిన దళిత మహిళా అభ్యర్థి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో. అందుకే అందరూ ఆమెవైపు ఆసక్తిగా చూస్తున్నారు.

రాజకీయ కుటుంబం నుంచి

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎం.ఏ. సోషియాలజీ చేసి ఇప్పుడు ‘బిహార్ రాజకీయాల్లో కులం, జెండర్ ప్రాధాన్యత’ అనే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్న శాంభవి రాజకీయ కుటుంబం నుంచి వచ్చింది. ఈమె తండ్రి అశోక్ కుమార్ చౌదరి జెడి (యు)లో మంత్రి. తాత మహదేవ్ చౌదరి కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేశారు. శాంభవి భర్త సాయన్ కునాల్ సామాజిక రంగంలో ఉన్నాడు. ఈమె మామగారు మాజీ ఐ.పి.ఎస్ అధికారి ఆచార్య కిశోర్ కునాల్ దళితుల కోసం చాలా పోరాటాలే చేశాడు. చాలా గుడులలో దళిత పురోహితులను ఆయన నియమించాడు. వీరందరి మధ్యలో చదువు మీద దృష్టి పెట్టి, పరిశోధన కొనసాగిస్తున్న శాంభవి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో దిగింది.



శాంభవి చౌదరి

నాకంటూ వ్యక్తిత్వం ఉంది

శాంభవి పోటీ చేస్తున్న లోక్ జనశక్తి పార్టీ ఎన్‌డిఏ కూటమిలో ఉంది. బిజెపి కుటుంబ వారసత్వం గురించి అభ్యంతరం చెప్పడం తెలిసిందే. ‘మీ నాన్నగారు మంత్రి. మరి మీకు సీటిచ్చారు’ అనే ప్రశ్నకు ‘నిజమే. కాని నాకు సీటు రావడంలో ఆయన ప్రమేయం మాత్రం లేదు. చిన్నప్పటి నుంచి నేను మా తాత, నాన్న పేదవాళ్ల సమస్యలు వింటూ వారి కోసం పనిచేయడం చూస్తూ పెరిగాను. అది నామీద ఎక్కడో ప్రభావం చూపింది. దళితుల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా, చదువుకున్న మహిళగా దళితుల పట్ల నాకు అవగాహన ఉంది. రాజకీయ కుటుంబం నుంచి రావడం వల్ల ప్రజలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసు. ఎలక్షన్లు సమీపించేవరకూ నేను నిలబడాలని అనుకోలేదు. కాని సమీపించాక లోక్ జనశక్తి చీఫ్ చిరాగ్ పాశ్వాన్‌తో చెప్పాను. ఆయన నా భర్తను సొంత తమ్ముడిలా చూస్తారు. అంతేకాదు, బిహార్ రాజకీయాలలో యువత రాణించాలని భావిస్తారు. నాకు అన్ని అర్హతలు ఉన్నాయన్న కారణం రీత్యానే సీట్ ఇచ్చారు’ అని తెలిపిందామె.

అత్తగారి ఊరు

పట్నాలో పుట్టి పెరిగిన శాంభవి తన అత్తగారి ఊరైన సమస్తిపూర్‌లో గెలవడానికి సిద్ధమవుతోంది. ‘ఆ ఊరి గురించి నిజం చెప్పాలంటే నాకేమీ తెలియదు. ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. మొదట అక్కడ ఒక ఇల్లు కొని అక్కడే ఉంటానన్న భరోసా కల్పించాలి. ఆ ఊరి యువతతో ఇప్పటికే కాంటాక్ట్‌లోకి వెళ్లాను. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపిస్తారు. అవి వమ్ము చేయకుండా ఉండటమే నా ప్రథమ లక్ష్యం’ అంటున్న శాంభవి రాజకీయ జీవితాన్ని త్వరలో ఓటర్లు నిర్ణయిస్తారు.

ఉగాది వంటిల్లు

ఉగాది వస్తోంది... క్రోధి నామంతో కొత్త ఏడాదిని తెస్తోంది. కొత్తబెల్లంతో ఉగాది పచ్చడి ఎలాగూ కలుపుకుంటాం. పండుగ రోజు పచ్చడి తర్వాత ఇంకా ఏమేమి తిందాం. కొబ్బరి పాల గారెలు... మజ్జిగ వడలు చేసుకుందాం. మరికొంత సులువుగా ఓట్స్ స్మూతీ కూడా చేసుకుందాం.



ఉగాది పచ్చడి



కావలసినవి: మామిడి పిందె – ఒకటి; వేప పువ్వు – టేబుల్ స్పూన్; బెల్లం పొడి– టేబుల్ స్పూన్; చింతకాయ – ఒకటి (లేకపోతే కొత్త చింతపండు చిన్న గోళీ అంత); ఉప్పు – చిటికెడు; పచ్చిమిర్చి – ఒకటి (తరగాలి).

తయారీ: ● వేప పువ్వును తొడిమలు, ఈనెలూ తీసేసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి ●చింతపండును నీటిలో నానబెట్టి రసం తీసుకోవాలి ● మామిడికాయను శుభ్రంగా కడిగి తొక్క తీయకుండా సన్నగా తరగాలి ● ఒక పాత్రలో బెల్లం పొడి, చింతపండు రసం, మామిడికాయ ముక్కలు, వేపపువ్వు, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి కలిపితే ఉగాది పచ్చడి రెడీ. **గమనిక:** ఇష్టమైతే చెరుకు ముక్కలు, రుచి కోసం అరటిపండు గుజ్జు కలుపుకోవచ్చు.

ఓట్స్ స్వీట్ స్మూతీ



కావలసినవి
ప్లెయిన్ సఫోలా ఓట్స్ – అరకప్పు; అరటిపండు – 1; బాదం పాలు – అరకప్పు; నీరు – అర కప్పు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ఓట్స్‌ని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో బాదం పాలు, నీరు, అరటి పండు గుజ్జు, చక్కెర, ఓట్స్ పొడి వేసి బీటర్‌తో కలిపితే స్మూతీ రెడీ. గ్లాసులో పోసుకుని తాగడానికి వీల్లేనంత చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవచ్చు. స్మూతీని చల్లగా తాగాలనుకుంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి లేదా స్మూతీ కోసం వాడే నీటిని ముందుగా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరుచుకోవాలి. బాదం పాలు రెడీమేడ్‌వి తీసుకోవచ్చు లేదా బాదం పప్పులు– నీటిని కలిపి మిక్సీ వేసి పాలను తయారు చేసుకోవాలి. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.


పాల గారెలు



కావలసినవి: మినప్పప్పు – పావు కేజీ; నూనె – వడలు వేయించడానికి తగినంత; కొబ్బరిపాలు – లీటరు; యాలకుల పొడి– అర టీ స్పూన్; ఉప్పు– చిటికెడు; బాదం పప్పు – 10 (నానబెట్టి పొట్టు తీసి తరగాలి); జీడిపప్పు – 20; కిస్‌మిస్– టేబుల్ స్పూన్; పిస్తా– టేబుల్ స్పూన్; నెయ్యి– టేబుల్ స్పూన్; బెల్లం లేదా చక్కెర – అర కేజీ.

తయారీ: ● మినప్పప్పును శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు మంచినీటిలో నానబెట్టిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పప్పును ఒక గిన్నెలోకి తీసుకుని బీటర్ లేదా స్పూన్‌తో రెండు నిమిషాల పాటు చిలకాలి. ● స్టవ్ మీద అడుగు మందంగా ఉన్న పాత్రను పెట్టి కొబ్బరి పాలు పోసి మరిగించాలి. వేడెక్కుతున్నప్పుడు అందులో చక్కెర వేసి కలుపుతూ మరిగించాలి. చిక్కబడేటప్పుడు యాలకుల పొడి వేసి మరో నిమిషం పాటు మరిగించి దించేయాలి. ● ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాణలి పెట్టి నెయ్యి వేడి చేసి అందులో బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి కొబ్బరి పాలు బెల్లం మిశ్రమంలో కలపాలి ● బాణలిలో నూనె వేడి చేసి అందులో మినపపిండిని పాలిథిన్ పేపర్ మీద వేసి వత్తి (నిమ్మకాయంత గోళీలుగా కూడా వేసుకోవచ్చు) నూనెలో వేయాలి. రెండువైపులా కాలనిచ్చి తీసి టిష్యూపేపర్ మీద వేయాలి. అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకున్న వెంటనే (వేడిగా ఉండగానే) వడలను ఒక వెడల్పు పాత్రలో పరిచినట్లు అమర్చి కొబ్బరిపాల మిశ్రమాన్ని పోయాలి. వడలు ఐదు నిమిషాల్లో కొబ్బరి పాలను పీల్చుకుంటాయి. వడలు పీల్చుకున్న తర్వాత కూడా పాలు ఇంకా మిగులుగా ఉండాలి. సర్వ్ చేసేటప్పుడు కప్పులో ఒక వడ ఒక గరిటె కొబ్బరి పాలు వేసి ఇవ్వాలి.

మజ్జిగ వడ



కావలసినవి: అటుకులు – కప్పు; రవ్వ – పావు కప్పు; మజ్జిగ– అర కప్పు; పచ్చిమిర్చి – 2 (తరగాలి); అల్లం తరుగు – టేబుల్ స్పూన్; నువ్వులు – టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు (తరగాలి); కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; బియ్యప్పిండి లేదా ఓట్స్ – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; కొబ్బరి తురుము – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను వెడల్పు పాత్రలో వేసి నీటిని పోసి కడిగి వేరొక పాత్రలోకి తీసుకోవాలి. అటుకులను నీటి నుంచి వేరు చేయడానికి నీటిని వంపకూడదు. నీటిలో తేలుతున్న అటుకులను చేత్తో తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల అటుకుల్లో ఇసుక ఉంటే నీటి అడుగుకు వెళ్లిపోతుంది. అటుకులు శుభ్రంగా ఉంటాయి. ● పచ్చి శనగపప్పు కడిగి అటుకుల్లో వేయాలి. ● అందులో రవ్వ, ఉప్పు, మజ్జిగ వేసి కలిపి ఇరవై నిమిషాల సేపు నాననివ్వాలి. ● ఇప్పుడు నానిన అటుకుల్లో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, నువ్వులు, కరివేపాకు, కొత్తిమీర, కొబ్బరి తురుము, నువ్వులు, బియ్యప్పిండి వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. ● ఇప్పుడు మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని వడకు సరిపోయేటట్లు ఉందా లేదా అని సరి చూసుకోవాలి. మరీ జారుడుగా ఉంటే మరికొంత బియ్యప్పిండి కలుపుకుని పిండి అంతటినీ పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసి పక్కన పెట్టాలి. ● బాణలిలో నూనె వేడి చేసి అటుకుల గోళీని వత్తి మధ్యలో చిల్లు పెట్టి నూనెలో వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చి తీయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. వేడి వేడి వడల్లోకి పుదీనా చట్నీ రుచిగా ఉంటుంది.

యువర్స్

అరవింద్ భరద్వాజ్, అనుపమ్ కుమార్

ప్రమాదాల ప్రహేళిక

● గేమింగ్



ఆమె ఒకప్పుడు 'కల్ట్' మెంబర్. ఇప్పుడు అదే 'కల్ట్'ను నేల మట్టం చేయడానికి రెడీ అయింది. 'మెంబర్ బై మెంబర్ బుల్లెట్ బై బుల్లెట్' లక్ష్యంతో కదనరంగంలోకి దిగింది. అడుగడుగునా ఎదురయ్యే సవాళ్లకు సాహసంతో జవాబు చెబుతుంది. ఫాంటసీ రోల్ ప్లేయింగ్ గేమ్ 'చిల్డ్రన్ ఆఫ్ ది సన్' ఈ నెల 9న విడుదల కానుంది. ఈ బుల్లెట్-బెండింగ్ పజిల్ గేమ్‌లో మ్యాజిక్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ఎలిమెంట్స్ ఉంటాయి. గత ఫిబ్రవరిలో ఈ గేమ్ డెమో వచ్చింది. 'డెమో తరువాత ప్లేయర్స్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. సాహసాలతో కూడిన ప్రయాణంతో ఈ గేమ్ కచ్చితంగా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది' అంటున్నాడు గేమ్ డెవలపర్ రెనే రొథర్.

● **ప్లాట్‌ఫామ్:** మైక్రోసాఫ్ట్ విండోస్ ● **ఇంజిన్:** యూనిటీ
● **జానర్స్:** షూటర్ వీడియో గేమ్, ఇండీ గేమ్, పజిల్ వీడియో గేమ్, స్ట్రాటజీ

● టెక్... టాక్



గూగుల్ ఫొటోస్‌లో...

అబ్జెక్స్‌ను రిమూవ్ చేయడానికి 'మ్యాజిక్ ఎరేజర్'... సిమిలర్‌గా కనిపించే ఫొటోలను ఆటోమెటిక్‌గా గ్రూప్ చేయడానికి 'ఫొటో క్లిప్స్'.... ఫొటోలకు మ్యూజిక్‌ను జత చేసే ఫీచర్, గ్రూప్ ఫొటో ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేసే బెస్ట్ టేక్...మొదలైనవి గూగుల్ ఫొటోస్‌లో ఉన్నాయి. ఫేవరెట్ పర్సన్‌కు స్పీడ్‌గా ఫొటోలను షేర్ చేయడానికి గూగుల్ ఫొటోస్‌కు 'ఫేవరెట్ షార్ట్‌కట్'ను యాడ్ చేశారు.

శాంసంగ్ గెలాక్సీ ఏ 55

డిస్‌ప్లే	: 6.60 అంగుళాలు
రిజల్యూషన్	: 1080x2340 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్	: 120 హెచ్‌జెడ్
బరువు	: 213 గ్రా.
మెమోరీ	: 128 జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 8జీబిర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా	: 32 ఎంపీ
బ్యాటరీ	: 5000 ఎంఏహెచ్



హానర్ ప్యాడ్ 9



రిజల్యూషన్: 2,560X1,600 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జెడ్
బ్యాటరీ: 8,300 ఎంఏహెచ్

ఫేస్‌బుక్ ఎడిట్ మెసేజ్



రాంగ్ మెసేజ్‌లు పంపి ఇబ్బందిగా ఫీలైన సందర్భాలు ఉంటాయి. ఫేస్‌బుక్ మెసెంజర్ 'ఎడిట్ మెసేజ్'తో ఈ ఇబ్బందిని అధిగమించవచ్చు. మిస్‌స్పెల్ట్ మెసేజ్‌ను క్విక్‌గా కరెక్ట్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. వాట్సాప్, మెసెంజర్‌లలాగే పదిహేను నిమిషాల్లో మెసేజ్‌ను మెసెంజర్‌లో ఎడిట్ చేయవచ్చు. ఈ ఫీచర్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ డివైజ్‌లలో అందుబాటులో ఉంది. ఫేస్‌బుక్ మెసెంజర్‌లో మెసేజ్ ఎడిట్ చేయడానికి... ● స్పెసిఫిక్ చాట్‌లోకి వెళ్లి ఎడిట్ చేయాలనుకున్న మెసేజ్ లాంగ్ ప్రెస్ చేయాలి ● ఎడిట్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి ● అవసరానికి తగినట్లు మెసేజ్‌ను మాడిఫై చేసుకోవాలి.

● యంగ్ టాలెంట్



సాహో సహేలి

సోషల్ మీడియా మార్కెటింగ్ స్పెషలిస్ట్‌గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది బెంగళూరుకు చెందిన సహేలిఛటర్జీ.ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే...ఒక క్లయింట్‌కు ఇచ్చిన సలహాతో సహేలికి 110 రూపాయలు వచ్చాయి. చేతికి అందిన డబ్బు తక్కువే కావచ్చుగానీ మనసుకు అందిన ఆత్మవిశ్వాసం మరీ ఎక్కువ. ఆ కాన్ఫిడెన్స్‌తోనే కంటెంట్ రైటర్‌గా ప్రయాణం ప్రారంభించింది. ఫ్రీలాన్స్ కంటెంట్ రైటర్‌గా నెలకు ఇరవై వేల రూపాయల వరకు సంపాదించేది. ఆ తరువాత సొంత ఏజెన్సీని స్టార్ట్ చేసి నెలకు రెండు లక్షల రూపాయల వరకు సంపాదించేది. మార్కెటింగ్ స్పెషలిస్ట్‌గా స్వదేశీ క్లయింట్‌లతో పాటు విదేశీ క్లయింట్‌లకు కూడా సేవలు అందించడం మొదలు పెట్టింది. పర్సనల్ బ్రాండింగ్, కన్సల్టేషన్ సర్వీసులపై దృష్టి పెట్టి లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తోంది.



● క్లీన్ ఎనర్జీ అండ్ క్లైమెట్ చేంజ్

మినీ మైన్స్ డైనమైట్స్

'లో కాస్ట్-జీరో వేస్ట్' నినాదంతో 'మినీ మైన్స్' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టారు అనుపమ్ కుమార్, అరవింద్ భరద్వాజ్. ఈ-వ్యర్థాల నుంచి లిథియం ఎక్స్‌ట్రాక్షన్ చేస్తూ ఎలక్ట్రిక్ వెహికిల్(ఈవి) పరిశ్రమకు ఖర్చులు తగ్గిస్తున్నారు. దిగుమతులకు ప్రత్యామ్నాయంగా స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తూ విజనరీ ఫౌండర్స్‌గా పేరు తెచ్చుకున్నారు...

ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ)కి సంబంధించి అతి పెద్ద ఖర్చు లిథియం-అయాన్ బ్యాటరీ. మన దేశంలో లిథియం వోర్ తక్కువగా ఉంది. దీంతో దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి. మరోవైపు చూస్తే ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌ల బ్యాటరీలకు సంబంధించి ఈ-వ్యర్థాలు కొండలా పేరుకుపోయాయి. ఈ కొండల్లో నుంచి లిథియం వెలికి తీయగలిగితే నికెల్, కోబాల్టును సేకరించగలిగితే దిగుమతులపై అతిగా ఆధారపడాల్సిన అవసరం ఉండదు. బ్యాటరీల ఖర్చు తగ్గుతుంది.

బెంగళూరు కేంద్రంగా అనుపమ్ కుమార్, అరవింద్ భరద్వాజ్‌లు ప్రారంభించిన 'మినీ మైన్స్' మన దేశంలోని ఈ-వ్యర్థాల నుంచి లిథియం, నికెల్, కోబాల్ట్‌లను సేకరించి వాటిని బ్యాటరీ తయారీదారులకు విక్రయిస్తుంది. మైనింగ్ కంటే లీ-అయాన్ బ్యాటరీల నుండి భాగాలను వెలికితీయడం మంచి రాబడి ఇస్తుంది. ఒక టన్ను లిథియం ఖనిజాన్ని తవ్వి ప్రాసెసింగ్ చేయడం వల్ల 2-3 కిలోల లిథియం లభిస్తుందని, ఒక టన్ను బ్యాటరీలను రీసైక్లింగ్ చేయడం వల్ల 20-30 కిలోల లిథియం లభిస్తుందని, నీటిని ఆదా చేస్తుందని, కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తుందని అంటున్నారు అనుపమ్, అరవింద్.

'మన దేశంలోని స్పెంట్ బ్యాటరీల నుంచి 66 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలకు సరిపడా లిథియం అయాన్, నికెల్, కోబాల్ట్‌లను వెలికితీయవచ్చు' అంటున్నాడు అనుపమ్ కుమార్.

మొబైల్ ఫోన్, బటన్ సెల్స్, ల్యాప్‌టాప్ బ్యాటరీల తయారీకి కూడా లి-అయాన్‌ను ఉపయోగిస్తారు. లిథియం కార్బోనేట్‌ను ఫార్మాస్యూటికల్ రంగంలో, గ్లాస్ మాన్యుఫాక్చరింగ్‌లో ఉపయోగిస్తారు.

బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్ చేసిన అనుపమ్ కుమార్ బాబా ఆటోమిక్ రిసెర్చ్ సెంటర్‌లో కెరీర్ ప్రారంభించాడు. అక్కడ రియాక్టర్‌ల వ్యర్థాల నుంచి యురేనియం, నికెల్‌లను వేరు చేసేవాడు.

'లాగ్9 మెటరీయల్స్'లో అనపమ్, అరవింద్ భరద్వాజ్‌లకు పరిచయం జరిగింది. అక్కడ భరద్వాజ్ లిథియం-అయాన్ బ్యాటరీస్ డివిజన్ హెడ్‌గా ఉండేవాడు. వీరి మధ్య జరిగిన సంభాషణల్లో 'యురేకా' మూమెంట్ ఆవిష్కారం అయింది. అది 'మినీ మైన్స్' స్టార్టప్ అయింది. తమ పొదుపు మొత్తాలు 6.5 కోట్లతో కంపెనీ ప్రారంభించారు.

మినీమైన్స్ టెక్నాలజీని నీతి ఆయోగ్ ధృవీకరించింది. ఆయిల్ ఇండియా లిమిటెడ్, ది యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌లు గ్రాంట్ ఇచ్చాయి.

'ఎలక్ట్రిక్ వెహికిల్స్ రంగం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో మినీ మైన్స్ విలువైన లోహాలను పునర్వినియోగ రూపంలో ఈవీ పరిశ్రమకు మేలు చేస్తుంది' అంటున్నాడు ఆవాజ్ ఫౌండేషన్ కన్వీనర్ సుమైరా అబ్దులాలీ.

కమాడిటీ సేల్స్, లైసెన్సింగ్/రాయల్టీ....మొదలైన వాటితో కంపెనీకి సంబంధించిన రెవెన్యూ మోడల్‌ను రూపొందించుకుంది మినీ మైన్స్.

'ఈ-వ్యర్థాలను రీసైకిల్ చేయగలిగితే మన దేశం మరింత స్వావలంబన దిశగా పయనించడమే కాదు ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమకు ఖర్చును తగ్గించవచ్చు అనుకున్నాం' అంటాడు కంపెనీ సీయీవో అనుపమ్ కుమార్.

అతడి మాటలు వృథా పోలేదు అని చెప్పడానికి 'మినీ మైన్స్' సాధించిన విజయమే సాక్ష్యం.

English Idioms

పైప్ డ్రీమ్

అసాధ్యం, పగటికల...ఇలాంటి సందర్భంలో వాడే మాట పైప్ డ్రీమ్.

ఉదా: హిజ్ ప్లాన్స్ ఆఫ్ బికమింగ్ యాన్ ఆస్ట్రోనాట్ ఆర్ ఏ పైప్ డ్రీమ్. హి మడ్ బీ మోర్ రియలిస్టిక్.

స్లామ్ డంక్


ఒక పనిని అవలీలగా, త్వరగా పూర్తి చేసినప్పుడు ఉపయోగించే మాట... స్లామ్ డంక్.

ఉదా: ది న్యూ సాఫ్ట్‌వేర్ మేడ్ డాటా ఎంట్రీ ఏ స్లామ్ డంక్.

మూలం: 'బాస్కెట్ బాల్' నుంచి పుట్టిన మాట ఇది. బాస్కెట్ బాల్‌లో స్లామ్ డంక్ అనేది ఎనర్జిటిక్ అండ్ ఎగ్జయిటింగ్ షాట్. ఆ షాట్‌లో ప్లేయర్ బాల్‌ను హైస్పీడ్‌తో బాస్కెట్‌లో వేస్తాడు.

సినిమా

మాస్ డిష్యుం



● నాగచైతన్య

'తండేల్' సెట్స్‌లో డిష్యుం డిష్యుం అంటూ అదిరిపోయే మాస్ ఫైట్స్ చేస్తున్నాడు రాజు.

నాగచైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. నాగచైతన్యతో 'ప్రేమమ్ (2016)', 'సవ్యసాచి (2018)' సినిమాలను తెరకెక్కించిన చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ఓ భారీ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌ను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. 'యానిమల్' సినిమాకు చేసిన స్టంట్ కొరియోగ్రాఫర్ సుప్రీమ్ సుందర్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేస్తున్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న 'తండేల్'లో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి కనిపిస్తారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది.

స్వయంభూలో ఎంట్రీ



● నభా నటేష్

'కార్తికేయ 2'తో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ సంపాదించుకున్న నిఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభూ'. ఈ చిత్రం షూటింగ్‌లో జాయిన్ అయ్యారు హీరోయిన్ నభా నటేష్. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త ఓ కథానాయికగా నటిస్తుండగా, నభా నటేష్ కీలకమైన, శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నారు. 'ఠాగూర్' మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ పాన్ ఇండియా మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణలో నభా నటేష్ గురువారం జాయిన్ అయిన విషయాన్ని ప్రకటించి, ఆమె పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''స్వయంభూ' చిత్రంలో ఓ లెజెండరీ యోధుడిగా నిఖిల్ నటిస్తున్నారు. ఈ పాత్ర కోసం మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో ట్రైనింగ్ తీసుకున్నారాయన. నభా నటేష్ పాత్ర కూడా చాలా బాగుంటుంది. ఈ క్యారెక్టర్‌కి తగ్గట్టుగా ఆమె మారిన విధానం అద్భుతం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, సహ నిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్.

మళ్లీ వస్తున్నాడు లయన్ కింగ్

హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ది లయన్ కింగ్' (2019) కు ప్రీక్వెల్ రానుంది. 'ముఫాసా: ది లయన్ కింగ్' టైటిల్‌తో రానున్న ఈ ప్రీక్వెల్ ఈ ఏడాది క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుందని సమాచారం. 'ది లయన్ కింగ్' సినిమాకు జోన్ ఫావ్రూ దర్శకత్వం వహించగా, ప్రీక్వెల్‌ను ఆస్కార్ విన్నింగ్ డైరెక్టర్ బార్రీ జెన్కిన్స్ తెరకెక్కిస్తున్నారు. ఇక 'ది లయన్ కింగ్' సినిమాలో ముఫాసా పాత్ర ఓ దశలో చనిపోతుంది. ముఫాసా కొడుకు సింబా, అతని సోదరుడు, శత్రువు స్కార్‌ల దృష్టి కోణంలో ఈ చిత్రకథ సాగుతుంది. కానీ ముఫాసా రాజుగా ఎలా ఎదిగాడు? ఆ సమయంలో అతని సోదరుడు స్కార్ ఎలాంటి పన్నాగాలు పన్నాడు? అనే అంశాల నేపథ్యంలో 'ముఫాసా: ది లయన్ కింగ్' సినిమా కథ ఉంటుందని హాలీవుడ్ టాక్. ఈ సినిమా కొత్త పోస్టర్ విడుదలైంది. 'ది లయన్ కింగ్'కు రచయితగా చేసిన జెఫ్ నాథన్సన్ 'ముఫాసా: ది లయన్ కింగ్'కూ వర్క్ చేస్తున్నారు. ముఫాసా పాత్రకు ఆరోన్ పైర్రీ, స్కార్ పాత్రకు కెల్విన్ హారిసన్ వంటివారు వాయిస్ ఓవర్ ఇవ్వనున్నారని హాలీవుడ్ టాక్.



● 'ముఫాసా: ది లయన్ కింగ్' పోస్టర్

మంజుమ్మల్ బాయ్స్‌ని ఎంజాయ్ చేస్తారు - నిర్మాత నవీన్ యెర్నేని

''మంజుమ్మల్ బాయ్స్' సినిమాని అమెరికాలో చూశాను. ఈ మధ్య కాలంలో నేను చూసిన బెస్ట్ మూవీ ఇది. మలయాళంలో బిగ్ హిట్ అవడంతో పాటు రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. తప్పకుండా థియేటర్స్‌కి వచ్చి చూడండి. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు'' అని నిర్మాత నవీన్ యెర్నేని అన్నారు. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధాన పాత్రల్లో చిదంబరం ఎస్. పొదువల్ దర్శకత్వం వహించిన చిత్రం 'మంజుమ్మల్ బాయ్స్'. పరవ ఫిలింస్‌పై బాబు షాహిర్, సౌబిన్, షాహిర్, షాన్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రం మలయాళంతో పాటు తమిళంలో కూడా మంచి విజయం సాధించింది. ఈ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో తెలుగులో ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో చిదంబరం ఎస్. పొదువల్ మాట్లాడుతూ- ''తెలుగు ప్రేక్షకుల స్పందన కోసం ఎదురు చూస్తున్నాం'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, శశిధర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, నటులు శ్రీనాథ్ భాసి, అరుణ్ కురియన్, విష్ణు రవి తదితరులు మాట్లాడారు.



● 'మంజుమ్మల్ బాయ్స్' ఈవెంట్‌లో ఓ దృశ్యం

సీక్వెల్ స్టార్



యాక్షన్ హీరోగా, ఫ్యామిలీ హీరోగా అన్ని వర్గాల ప్రేక్షకులనూ మెప్పిస్తున్నారు అజయ్ దేవగన్. ఇప్పుడు ఈ హీరోకి 'సీక్వెల్ స్టార్' అని ట్యాగ్ ఇవ్వొచ్చు. ఎందుకంటే ఒకటి కాదు... రెండు మూడు కూడా కాదు... ఏకంగా ఎనిమిది చిత్రాల సీక్వెల్స్ అజయ్ దేవగన్ డైరీలో ఉన్నాయి. సీక్వెల్ చిత్రాల్లో నటించడం పెద్ద విషయం కాదు కానీ వరుసగా ఎనిమిది చిత్రాలంటే మాత్రం పెద్ద విషయమే. ఇక అజయ్ సైన్ చేసిన సీక్వెల్ చిత్రాల్లో ఇప్పటికే కొన్ని చిత్రాలు షూటింగ్ దశలో ఉండగా కొన్ని ఆరంభం కావాలి. ఆ చిత్రాల విశేషాలు తెలుసుకుందాం.

అజయ్ దేవగన్ కెరీర్‌లో 'సింగమ్' చిత్రానిది ప్రత్యేక స్థానం. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో పోలీసాఫీసర్ సింగమ్‌గా అజయ్ దేవగన్ విజృంభించారు. 2011లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత అజయ్ దేవగన్-రోహిత్ శెట్టి కాంబినేషన్‌లోనే 'సింగమ్'కి సీక్వెల్‌గా 'సింగమ్ రిటర్న్స్' (2014) రూపొంది, సూపర్‌హిట్‌గా నిలిచింది. 'సింగమ్ రిటర్న్స్' విడుదలైన దాదాపు పదేళ్లకు ఈ ఫ్రాంచైజీలో భాగంగా 'సింగమ్ ఎగైన్' పేరుతో ఓ మూవీ రూపొందుతోంది. అజయ్ దేవగన్ హీరోగా ఈ చిత్రానికి కూడా రోహిత్ శెట్టియే దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఆగస్టులో రిలీజ్ కానుందని సమాచారం. అదే విధంగా అజయ్ దేవగన్ హీరోగా రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వంలో వచ్చిన 'రైడ్' (2018) మూవీ ఘనవిజయం సాధించింది. దాదాపు ఆరేళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'రైడ్ 2' తెరకెక్కుతోంది. అజయ్ దేవగన్ హీరోగా డైరెక్టర్ రాజ్ కుమార్ గుప్తా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో వాణీ కపూర్, రితేశ్ దేశ్‌ముఖ్ కీలక పాత్రధారులు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నవంబర్ 15న రిలీజ్ కానుంది.



● 'సింగమ్ ఎగైన్'లో...

ఇదిలా ఉంటే.. 'సింగమ్' వంటి హిట్ సీక్వెల్స్ ఇచ్చిన హీరో అజయ్ దేవగన్-దర్శకుడు రోహిత్ శెట్టి కాంబినేషన్‌లో వచ్చిన మరో చిత్రం 'గోల్‌మాల్' (2006) ఘనవిజయం సాధించింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా అజయ్ దేవగన్-రోహిత్ శెట్టి కాంబినేషన్‌లోనే వచ్చిన 'గోల్‌మాల్ రిటర్న్స్' (2008) సూపర్ హిట్ అయింది. 'గోల్‌మాల్' ఫ్రాంచైజీలో 'గోల్‌మాల్ 3' (2010), 'గోల్‌మాల్ 4' (2017) కూడా వచ్చాయి. 'గోల్‌మాల్ 5' రానుంది. అజయ్ దేవగన్-రోహిత్ శెట్టి కాంబినేషన్‌లోనే రానున్న ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందట. ఇకపోతే అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్‌సింగ్, టబు ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'దే దే ప్యార్ దే'. అకివ్ అలీ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2019లో రిలీజై సూపర్ హిట్ అయింది. దాదాపు ఐదేళ్లకి 'దే దే ప్యార్ దే 2' సినిమాని ప్రకటించారు మేకర్స్. ఇందులోనూ అజయ్ దేవగన్ లీడ్ రోల్‌లో నటించనున్నారు. అయితే 'దే దే ప్యార్ దే'కి అకివ్ అలీ దర్శకత్వం వహించగా.. 'దే దే ప్యార్ దే 2' మూవీని కొత్త దర్శకుడు అన్షుల్ శర్మ తెరకెక్కించనున్నారు. ఈ చిత్రాన్ని 2025 మే 1న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. అలాగే అజయ్ దేవగన్ హీరోగా అశ్వినీ ధీర్ దర్శకత్వం వహించిన యాక్షన్ కామెడీ చిత్రం 'సన్ ఆఫ్ సర్దార్'. 2012లో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. సునీల్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'మర్యాద రామన్న' (2010) చిత్రానికి ఇది రీమేక్. ఇక 'సన్ ఆఫ్ సర్దార్' వచ్చిన పుష్కరం తర్వాత సీక్వెల్‌గా 'సన్ ఆఫ్ సర్దార్ 2' తెరకెక్కనుంది. తొలి భాగానికి అశ్వినీ ధీర్ దర్శకత్వం వహించగా, మలి భాగాన్ని డైరెక్టర్ విజయ్ కుమార్ అరోరా తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ మూవీ ఈ ఏడాదిలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. అలాగే 2025లో ఈ సినిమాని రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అదే విధంగా మలయాళ హిట్ మూవీ 'దృశ్యం' హిందీ రీమేక్‌లో అజయ్ దేవగన్ హీరోగా నటించారు. నిషికాంత్ కామత్ దర్శకత్వం వహించిన క్రైమ్ థ్రిల్లర్ 'దృశ్యం' (2015) హిట్‌గా నిలిచింది. ఈ చిత్రం విడుదలైన దాదాపు ఏడేళ్లకు 'దృశ్యం 2' రిలీజైంది. అజయ్ దేవగన్ లీడ్ రోల్‌లో నటించిన ఈ మూవీకి అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహించారు. ఇదే ఫ్రాంచైజీలో మలయాళంలో 'దృశ్యం 3' రానుంది. ఈ చిత్రం హిందీ రీమేక్‌లో కూడా అజయ్ దేవగన్ నటిస్తారని సమాచారం. ఇదిలా ఉంటే వికాస్ బాల్ దర్శకత్వంలో అజయ్ దేవగన్ హీరోగా నటించిన 'సైతాన్' చిత్రం గత నెల 8న రిలీజై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'సైతాన్ 2' రానుంది. ఇంకా ఇంద్రకుమార్ దర్శకత్వంలో అజయ్ దేవగన్ ఓ హీరోగా నటించిన 'ధమాల్' (2007)తో పాటు 'డబుల్ ధమాల్' (2011), 'టోటల్ ధమాల్' (2019) మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. 'ధమాల్ 4' కూడా రానుందని సమాచారం. ఇంద్రకుమార్ దర్శకత్వంలోనే అజయ్ దేవగన్ ఓ హీరోగా ఈ నాలుగో భాగం ఉంటుందని టాక్. ఇలా వరుసగా సీక్వెల్స్‌కి సైన్ చేసిన అజయ్ దేవగన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మైదాన్' ఈ నెల 10న విడుదల కానుంది. ఈ చిత్రంలో ఆయన ఫుట్‌బాల్ కోచ్‌గా కనిపించనున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	351	74,228
నిఫ్టీ ▲	80	22,515

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,425	▲ 147
డోజోన్స్	39,228	▲ 101
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,976	▲ 38
డాక్స్	18,403	▲ 35
షాంఘై (బుధవారం ముగింపు)	3,069	▼ 6
నికాయ్	39,773	▲ 321

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్లు)	68,750
బంగారం (22 క్యారెట్లు)	65,480
వెండి (కేజీ)	85,300

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	83.03	84.05
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.40	106.96
€	యూరో	[illegible]	89.38	91.74
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	54.46	55.68
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	53.98	55.90
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.81	64.07
SAR	సౌదీ రియాల్	[illegible]	21.36	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.82	23.60
¥	చైనా యువాన్	[illegible]	10.40	12.40

బంగారం ధగధగలు...

న్యూఢిల్లీలో ఒకేరోజు రూ.850 అప్ • రూ.70,050కి చేరిక



న్యూఢిల్లీ: బంగారం ధరల పరుగు కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో బుధవారం పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర ఒకేరోజు రూ.850 పెరిగి రూ.70,050 ఆల్‌టైమ్ హైకి ఎగసింది. అమెరికా ఫెడ్ ఫండ్ రేటు తగ్గ వచ్చన్న అంచనాలు, ఈజీ మనీ, ద్రవ్యోల్బణం భయాలు, డాలర్ బల హీనత, చైనా పసిడి డిమాండ్ అంశాలు భారత్‌లో పసిడి ధర పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఇక వెండి విషయానికి వస్తే ధర కేజీకి రూ.1,000 ఎగసి రూ.81,700కి చేరింది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో ధర స్పాట్ గోల్డ్ ఔన్స్ (31.1 గ్రాములు) 2,303 రికార్డు స్థాయిని తాకింది. ఇక జూన్ ఫ్యూచర్స్‌లో రికార్డు స్థాయి 2,322 డాలర్లకు చేరడం గమనార్హం.

పసిడి రుణాల్లోకి పిరమల్ ఫైనాన్స్



ముంబై: పిరమల్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పసిడి రుణాలు, సూక్ష్మ రుణాల విభాగాల్లోకి కార్యకలాపాలు విస్తరించనుంది. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి తమ ఏయూఎం (నిర్వహణలోని అసెట్స్)ను రూ. 1.3 లక్షల కోట్లకు, రిటైల్ వాటాను 70 శాతానికి, హోల్‌సేల్ వాటాను 30 శాతానికి పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు సంస్థ ఎండీ జైరామ్ శ్రీధరన్ తెలిపారు. ప్రస్తుతం రూ. 70,823 కోట్లుగా ఉన్న తమ ఏయూఎంలో మైక్రోఫైనాన్స్ విభాగం రూ. 1,000 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. చిన్న షాపులు, ప్రాపర్టీలను తనఖాగా ఉంచుకుని చిన్న మొత్తాల్లో రూ. 10 లక్షల లోపు రుణాలను ఇచ్చే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎక్స్‌యూవీ 300 ఫేస్‌లిఫ్ట్ వస్తోంది

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా ఎక్స్‌యూవీ 300 ఫేస్‌లిఫ్ట్‌ను ఏప్రిల్ 29న ప్రవేశపెడుతోంది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో పేరుతో దీనిని పరిచయం చేస్తోంది. ఈ మేరకు టీజర్‌ను విడుదల చేసింది. ఎక్స్‌యూవీ 300 మాదిరిగానే 1.2 లీటర్ టర్బో పెట్రోల్, 1.5 లీటర్ డీజిల్ ఇంజన్స్‌తో రూపుదిద్దుకుంది. కొత్త ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, డ్యూయల్ టోన్ అలాయ్ వీల్స్, సి–షేప్డ్ ఎల్‌ఈడీ టెయిల్, రీ–డిజైన్డ్ గ్రిల్స్, సన్‌రూఫ్ ఏర్పాటు చేశారు. డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, అడాస్, 10.25 అంగుళాల టచ్ స్క్రీన్ వంటి ఫీచర్లు జోడించే అవకాశం ఉంది. ఎక్స్‌షోరూంలో ప్రారంభ ధర రూ.9 లక్షల నుంచి ఉంటుందని సమాచారం.



మార్చిలో సేవలు బాగున్నాయ్



న్యూఢిల్లీ: తయారీ, సేవల రంగాలు గడచిన ఆర్థిక సంవత్సరం చివరి నెల– మార్చిలో మంచి ఫలితాలను నమోదుచేసుకున్నాయి. ఫిబ్రవరిలో 60.6 వద్ద ఉన్న హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ మార్చిలో 61.2కు ఎగసింది. ఇక సేవలు–తయారీ రెండింటికీ సంబంధించి హెచ్‌ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ సూచీ ఫిబ్రవరిలో 60.6 వద్ద ఉంటే, మార్చిలో 61.8కి ఎగసింది. గడచిన 13 సంవత్సరంలో ఇంత గరిష్ఠ స్థాయిలో సూచీల నమోదు ఇదే తొలిసారి. ఇక ఒక్క తయారీ రంగాన్ని చూస్తే– హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఫిబ్రవరిలో 56.9 వద్ద ఉంటే, మార్చిలో ఏకంగా 16 సంవత్సరాల గరిష్ఠ స్థాయి 59.1కి ఎగసింది. వ్యవస్థలో సానుకూల డిమాండ్, కొత్త ఆర్డర్‌లు, ఉత్పత్తి, ఇన్‌పుట్ స్టాక్‌ల బలమైన వృద్ధిని ఈ ఫలితాలను ప్రతిబింబిస్తుంది. కాగా ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆలోపునకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు.

స్పెక్ట్రం వేలం జూన్ 6కి వాయిదా

న్యూఢిల్లీ: బిడ్లను ఆహ్వానిస్తూ జారీ చేసిన నోటీసులో సవరణలకు అనుగుణంగా స్పెక్ట్రం వేలం తేదీని 17 రోజుల పాటు వాయిదా వేస్తూ టెలికం శాఖ (డాట్) నిర్ణయం తీసుకుంది. జూన్ 6న నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే, బిడ్డర్లకు నిధుల లభ్యత మెరుగ్గా ఉండేలా చూసే దిశగా బ్యాంక్ గ్యారంటీ, ధరావతు మొత్తాన్ని కూడా తగ్గించింది. నిజానికి మే 20న వేలం నిర్వహించాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం జూన్ 6కి వేలాన్ని మార్చారు. ఇక నమూనా వేలాన్ని మే 13, 14 తేదీల్లో కాకుండా జూన్ 3న నిర్వహించనున్నారు. మొబైల్ ఫోన్ సర్వీసుల కోసం రూ. 96,317 కోట్ల బేస్ ధరతో ఎనిమిది బ్యాండ్లలో (800 మెగాహెర్ట్జ్ నుంచి 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్ వరకు) స్పెక్ట్రంను వేలం వేయనున్నారు. 20 ఏళ్ల స్పెక్ట్రం కేటాయిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
5-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403–00
విజయవాడ	403–00
హైదరాబాద్	375–00
వరంగల్	377–00

బ్లూస్టార్ నుంచి కొత్త డీప్ ఫ్రీజర్ల శ్రేణి

ధర రూ. 16,000 నుంచి ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తదితర ఉత్పత్తుల తయారీ దిగ్గజం బ్లూస్టార్ తాజాగా విద్యుత్ ఆదా చేసే డీప్ ఫ్రీజర్ల శ్రేణిని మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. వీటి సామర్థ్యం 60 లీటర్ల నుంచి 600 లీటర్ల వరకు ఉంటుంది. ధర రూ. 16,000 నుంచి ప్రారంభమవుతుందని గురువారమిక్కడ విలేకరుల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా సంస్థ ఎండీ బి. త్యాగరాజన్ తెలిపారు. మేకిన్ ఇండియా నినాదానికి అనుగుణంగా వీటిని దేశీ పరిజ్ఞానంతో రూపొందించినట్లు వివరించారు. గతేడాది సీజన్‌తో పోలిస్తే 25 శాతం వరకు అమ్మకాల వృద్ధిని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, శ్రీసిటీ ప్లాంటులో రూమ్ ఏసీల ఉత్పత్తి సామర్థ్యాలను ఈ ఆర్థిక సంవత్సరం ఆరు లక్షల యూనిట్లకు, దశలవారీగా 12 లక్షల యూనిట్లకు పెంచుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీకి దగ్గర్లో తీసుకున్న 40 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు 2026–27లో ప్రారంభమవుతాయన్నారు.



భారత్‌లో ప్లాంటు ఏర్పాటు దిశగా టెస్లా

- స్థలాన్వేషణకు ఈ నెలాఖరుకు రానున్న కంపెనీ టీమ్
- రూ. 25,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా .. భారత్‌లో తయారీ ప్లాంటు ఏర్పాటు ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా స్థలాన్వేషణ కోసం ఏప్రిల్ నెలాఖరుకు అమెరికా నుంచి కంపెనీ బృందం భారత్ సందర్శించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వాహనాల తయారీకి ప్రధాన కేంద్రాలుగా ఉంటున్న మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడుపై టెస్లా దృష్టి పెట్టే అవకాశం ఉందని వివరించాయి. 2-3 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 16,500 – 25,000 కోట్లు) పెట్టుబడులతో భారత్‌లో ప్లాంటును ఏర్పాటు చేసే అంశాన్ని కంపెనీ పరిశీలిస్తోంది.

వాస్తవానికి ప్రధాన మార్కెట్లయిన అమెరికా, చైనాలో డిమాండ్ మందగిస్తుండటంతో టెస్లా భారత్ మార్కెట్లో ఎంట్రీ కోసం కొన్నాళ్లుగా ప్రయత్నాలు చేస్తోంది. కానీ, భారీ స్థాయి దిగుమతి సుంకాలు, దేశీయంగా తయారీ చేపట్టాలన్న నిబంధనలు అవరోధంగా నిలుస్తున్నాయి. అయితే, దేశీయంగా విద్యుత్ వాహనాల తయారీని ప్రోత్సహించే దిశగా కేంద్రం ఇటీవల పలు చర్యలు ప్రకటించిన నేపథ్యంలో భారత్‌లో టెస్లా తయారీ ప్లాంటు ప్రతిపాదనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కనీసం 500 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసి, మూడేళ్లలో దేశీయంగా వాహనాలను తయారు చేయడం మొదలుపెట్టే విదేశీ కంపెనీలు.. తక్కువ సుంకాలకే నిర్దిష్ట సంఖ్యలో కార్లను దిగుమతి చేసుకునేందుకు కేంద్రం అనుమతించిన సంగతి తెలిసిందే. గతేడాది భారత్‌లో అమ్ముడైన మొత్తం కార్లలో విద్యుత్ కార్ల వాటా 2 శాతంగానే నమోదైనప్పటికీ.. కానీ 2030 నాటికి దీన్ని 30 శాతానికి చేర్చాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించింది. దేశీయంగా ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో టాటా మోటార్స్ ఆధిపత్యం కొనసాగుతోంది. టెస్లా వస్తే ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు రాగలవని, స్థానిక ఆటో విడిభాగాల తయారీదార్లకు కూడా ప్రయోజనం చేకూరగలదని అంచనా.

సరికొత్త శిఖరాలపై సూచీలు

ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలకు ముందు కొనుగోళ్లు

- ఫైనాన్స్, బ్యాంకులు, ఆటో షేర్లకు డిమాండ్
- ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డుల నమోదు
- సూచీల ర్యాలీకి దన్నుగా హెచ్‌డీఎఫ్‌సీ, టీసీఎస్ షేర్లు



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన ప్రకటన(నేడు)కు ముందు ఇన్వెస్టర్లు ఫైనాన్స్, బ్యాంకులు, ఆటో, కన్జూమర్స్ షేర్లను కొనేందుకు ఆసక్తి చూపారు. ఫలితంగా గురువారం సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(3%), టీసీఎస్(2%) షేర్లు రాణించి సూచీల రికార్డు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఉదయం సెన్సెక్స్ 537 పాయింట్లు భారీ లాభంతో 74,414 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 626 పాయింట్లు ఎగసి 74,502 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 351 పాయింట్లు లాభపడి కొత్త రికార్డు స్థాయి 74,228 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నిఫ్టీ సైతం 184 పాయింట్లు దూసుకెళ్లి 22,619 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. ఆఖరి 80 పాయింట్లు పెరిగి సరికొత్త శిఖరం 22,515 వద్ద నిలిచింది. రికార్డు ర్యాలీలోనూ ఆయిల్ అండ్ గ్యాస్, ఇంధన, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు వరుసగా 0.34%, 0.54% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,136 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.893 కోట్ల షేర్లను విక్రయించాయి. జపాన్, సింగపూర్ సూచీలు 1% పెరిగాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు సైతం అరశాతం లాభంతో ట్రేడవుతున్నాయి. వివిధ వ్యాపార సంస్థల రూ.816 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకోవడంతో కేఈసీ ఇంటర్నేషనల్ 6% ఎగసి రూ.770 వద్ద ముగిసింది.

కరెన్సీ డెరివేటివ్స్ నిబంధనల వాయిదా

రూపాయి ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కరెన్సీ డెరివేటివ్స్‌పై జారీ చేసిన మార్గదర్శకాల అమలును ఆర్‌బీఐ మే 3వరకూ వాయిదా వేసింది. వివిధ వర్గాల అభిప్రాయాల నేపథ్యంలో తాజా నిబంధనల అమలును నెల రోజులపాటు వాయిదా వేసింది.

సాక్షి స్పోర్ట్స్



పంత్‌కు రూ. 24 లక్షల జరిమానా

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌పై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రూ. 24 లక్షల జరిమానా విధించింది. విశాఖపట్నంలో బుధవారం కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు బౌలర్లు నిర్ణీత సమయంలో కనీస ఓవర్ల కోటా పూర్తి చేయలేదు. ఈ సీజన్‌లో ఢిల్లీ జట్టు రెండోసారి స్లో ఓవర్‌రేట్ నమోదు చేసింది.

శ్రీజ, ఐనీ రెడ్డిలకు పతకాలు

జాతీయ సబ్ జూనియర్ క్యారమ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు రెండు పతకాలు లభించాయి. వారణాసిలో జరిగిన ఈ పోటీల్లో అండర్–14 బాలికల సింగిల్స్‌లో వి. ఐనీ రెడ్డి రజత పతకం... అండర్–12 బాలికల సింగిల్స్‌లో టి.శ్రీజ కాంస్య పతకం గెల్చుకున్నారు. పతక విజేతలకు తెలంగాణ క్యారమ్ సంఘం జనరల్ సెక్రటరీ ఎస్.మదన్‌రాజ్ అభినందించారు.



ఉబెర్ కప్ టోర్నీకి సింధు దూరం

గాయత్రి–ట్రెసా, అశ్విని–తనీషా జోడీలు కూడా అవుట్



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఉబెర్ కప్ మహిళల టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈసారి భారత ద్వితీయ శ్రేణి జట్టు బరిలోకి దిగనుంది. ఈ మెగా టోర్నీ ఏప్రిల్ 27 నుంచి మే 5 వరకు చైనాలోని చెంగ్డూలో జరగనుంది. సింగిల్స్ విభాగం నుంచి స్టార్ ప్లేయర్ పీవీ సింధు తప్పుకోగా... డబుల్స్ విభాగం నుంచి పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ; అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జోడీలు కూడా వైదొలిగాయి. పారిస్ ఒలింపిక్స్‌కల్లా తన ఆటలో మరింత పదును పెరిగేందుకు, పూర్తి ఫిట్‌గా ఉండేందుకు సింధు ఉబెర్ కప్ నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు దక్కించుకోవాలనే లక్ష్యంతో గాయత్రి–ట్రెసా, అశ్విని–తనీషా జోడీలు ఇతర క్వాలిఫయింగ్ టోర్నీలపై దృష్టి పెట్టాయి. భారత మహిళల జట్టు ఉబెర్‌కప్‌లో మూడుసార్లు (1957, 2014, 2016) సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు సాధించింది. మరోవైపు థామస్ కప్ పురుషుల టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ పూర్తి బలగంతో బరిలోకి దిగనుంది.

భారత మహిళల జట్టు: అన్‌మోల్, తన్వీ శర్మ, అష్మిత, ఇషారాణి బారువా (సింగిల్స్); శ్రుతి మిశ్రా, ప్రియా కొంజెంగ్‌బమ్, సిమ్రన్, రితిక (డబుల్స్). **భారత పురుషుల జట్టు:** ప్రణయ్, లక్ష్య సేన్, శ్రీకాంత్, ప్రియాన్షు, కిరణ్ జార్జి (సింగిల్స్); సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, అర్జున్, ధ్రువ్ కపిల, సాయిప్రతీక్ (డబుల్స్).

ఆసియా చాంపియన్‌షిప్ నుంచి వైదొలిగిన సాత్విక్ జోడీ



భుజం గాయం నుంచి సాత్విక్ పూర్తిగా కోలుకోకపోవడంతో... ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నుంచి సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ వైదొలిగింది. గత ఏడాది దుబాయ్‌లో జరిగిన ఈ మెగా టోర్నీలో సాత్విక్–చిరాగ్ శెట్టి ద్వయం పురుషుల డబుల్స్‌లో స్వర్ణ పతకం సాధించి కొత్త చరిత్ర సృష్టించింది. థామస్ కప్‌లో మాత్రం సాత్విక్–చిరాగ్ ద్వయం బరిలోకి దిగుతుందని భారత బ్యాడ్మింటన్ సంఘం తెలిపింది. ఆసియా చాంపియన్‌షిప్ ఈనెల 9 నుంచి 14 వరకు చైనాలో జరుగుతుంది.

క్వార్టర్ ఫైనల్లో రుత్విక జోడీ



అస్తానా: కజకిస్తాన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ క్రీడాకారిణి గద్దె రుత్విక శివాని క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రుత్విక–రోహన్ కపూర్ (భారత్) జోడీ 22–20, 21–17తో కెన్నెత్–గ్రోన్యా సోమర్‌విల్లె (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ ఆటగాడు తరుణ్ మన్నెపల్లి 22–24, 21–18, 21–13తో భారత్‌కే చెందిన శంకర్ ముత్తుస్వామిపై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మహిళల సింగిల్స్‌లో జాతీయ చాంపియన్ అన్‌మోల్ 21–11, 21–7తో నూరానీ అజారా (యూఏఈ)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

'డ్రా'తో గట్టెక్కిన శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ



కాస్టనెడా

షిల్లాంగ్: ఐ–లీగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఐదో 'డ్రా' నమోదు చేసింది. నెరోకా ఎఫ్‌సీతో గురువారం జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 1–1తో 'డ్రా' చేసుకుంది. నెరోకా తరఫున రోహిత్ (70వ ని.లో), శ్రీనిధి తరఫున డేవిడ్ కాస్టనెడా మునోజ్ (82వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ప్రస్తుతం శ్రీనిధి జట్టు 44 పాయింట్లతో రెండో స్థానంలో, మొహమ్మదాన్ స్పోర్టింగ్ 49 పాయింట్లతో తొలి స్థానంలో ఉన్నాయి. శ్రీనిధి జట్టుకు టైటిల్ దక్కాలంటే చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పనిసరిగా గెలవాలి. మరోవైపు మొహమ్మదాన్ స్పోర్టింగ్ జట్టు తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పనిసరిగా ఓడిపోవాలి.

శశాంక్ కిర్రాక్...

మెరుపు ఇన్నింగ్స్‌తో పంజాబ్‌ను గెలిపించిన బ్యాటర్

- 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61 నాటౌట్
- అశుతోష్ శర్మ కీలక ఇన్నింగ్స్
- గుజరాత్ టైటాన్స్‌కు రెండో ఓటమి
- గిల్ జిగేల్ ఇన్నింగ్స్ వృథా



శశాంక్ సింగ్

అహ్మదాబాద్: సొంతగడ్డపై మాజీ చాంపియన్లు ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌లను ఓడించిన గుజరాత్ టైటాన్స్‌కు పంజాబ్ కింగ్స్ చెక్ పెట్టింది. గురువారం ఆఖరి ఓవర్లో ఉత్కంఠ రేపిన ఐపీఎల్ పోరులో నిరుటి రన్నరప్ టైటాన్స్ 3 వికెట్ల తేడాతో ఓడింది. మొదట గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. కెప్టెన్, ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (48 బంతుల్లో 89 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. సాయి సుదర్శన్ (19 బంతుల్లో 33; 6 ఫోర్లు) ధాటిగా ఆడాడు. రబడకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ కింగ్స్ 19.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శశాంక్ సింగ్ (29 బంతుల్లో 61 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇంపాక్ట్ ప్లేయర్ అశుతోష్ శర్మ (17 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు బ్యాటింగ్‌తో పంజాబ్‌ను గెలిపించారు. నూర్ అహ్మద్ 2 వికెట్లు తీశాడు.

ఓపెనర్ గిల్ ఆఖరిదాకా...

వృద్ధిమాన్ సాహా (11)తో ఇన్నింగ్స్ ఓపెన్ చేసిన శుబ్‌మన్ ఆఖరిదాకా టైటాన్స్ స్కోరు పెంచే పనిలో పడ్డాడు. కేన్ విలియమ్సన్ (22 బంతుల్లో 26; 4 ఫోర్లు) నింపాదిగా ఆడగా, జట్టు పవర్‌ప్లేలో 52/1 స్కోరు చేసింది. కెప్టెన్ గిల్ ధాటికి సాయి సుదర్శన్ జోరు తోడయ్యాకే గుజరాత్ పుంజుకుంది. 12వ ఓవర్లో జట్టు స్కోరు 100 దాటింది. శుబ్‌మన్ 31 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. చకచకా పరుగులు జతచేస్తున్న సుదర్శన్‌కు హర్షల్ చెక్‌పెట్టగా, విజయ్ శంకర్ (8) నిరాశపరిచాడు. 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన రాహుల్ తెవాటియా డెత్ ఓవర్లలో బ్యాట్ ఝుళిపించాడు. 19వ ఓవర్ వేసిన హర్షల్ పటేల్ 3 వైడ్లు సహా 9 బంతులేయగా తెవాటియా 6, 4 బాదడంతో ఏకంగా 20 పరుగులు వచ్చాయి. అయితే ఆఖరి ఓవర్ వేసిన అర్ష్‌దీప్ తొలి నాలుగు బంతుల్లో 5 పరుగులే ఇచ్చాడు. అయితే చివరి రెండు బంతుల్ని తెవాటియా బౌండరీలకు తరలించడంతో టైటాన్స్ 199/4 స్కోరు చేసి సరిగ్గా 200 లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది.

మ్యాచ్ విన్నర్‌గా...

భారీ లక్ష్యఛేదనలో శిఖర్ ధావన్ (1) విఫలమైనా... బెయిర్‌స్టో (13 బంతుల్లో 22; 4 ఫోర్లు), ప్రభ్‌సిమ్రన్ (24 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా పరుగులు సాధించారు. 13వ ఓవర్లో సికందర్ రజా (15) అవుటైనప్పుడు పంజాబ్ స్కోరు 111/5. గెలుపుపై ఆశల్లేని స్థితిలో జితేశ్ శర్మ అండతో శశాంక్ సింగ్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. ఇద్దరు 3.1 ఓవర్లలోనే 39 పరుగులు జోడించారు. రెండు వరుస సిక్సర్లు కొట్టిన జితేశ్‌ను రషీద్ బోల్తా కొట్టించాడు. ఈ దశలో కింగ్స్ విజయానికి 27 బంతుల్లో 50 పరుగులు కావాలి. ఇంపాక్ట్ ప్లేయర్‌గా క్రీజులోకి వచ్చిన అశుతోష్... నిలదొక్కుకున్న శశాంక్‌తో కలిసి ధనాధన్ ఆటతో 19వ ఓవర్లోనే విజయసమీకరణాన్ని సులువు చేశాడు. ఆఖరి ఓవర్‌కు వచ్చేసరికి 6 బంతుల్లో 7 పరుగులు చేయాల్సివుండగా, తొలి బంతికే అశుతోష్ అవుటైనా... శశాంక్ మరో వికెట్ పడకుండా జట్టును గెలిపించాడు. గత డిసెంబర్‌లో జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో పంజాబ్ కింగ్స్ యాజమాన్యం శశాంక్ సింగ్‌ను కొనుగోలు చేసింది. అయితే వేలం జాబితాలో ఇద్దరు శశాంక్ సింగ్‌లు ఉండగా... తాము కోరుకున్న శశాంక్ సింగ్‌ను కాకుండా అదే పేరుతో ఉన్న మరో శశాంక్ సింగ్‌ను పొరపాటుగా తీసుకున్నామని పంజాబ్ కింగ్స్ సహ యజమాని ప్రీతి జింటా వ్యాఖ్యానించింది. ఇది కాస్తా వివాదం కావడంతో ఇద్దరు శశాంక్‌లు తమ దృష్టిలో ఉన్నారని, తాము పొరపాటు చేయలేదని వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది. ఆనాడు శశాంక్ సింగ్‌ను పొరపాటుగా తీసుకున్నామని భావించిన పంజాబ్ కింగ్స్ జట్టుకు నేడు మ్యాచ్ విన్నర్‌గా అవతరించడం విశేషం.



గిల్

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) ధావన్ (బి) రబడ 11; గిల్ (నాటౌట్) 89; విలియమ్సన్ (సి) బెయిర్‌స్టో (బి) హర్‌ప్రీత్ 26; సుదర్శన్ (సి) జితేశ్ (బి) హర్షల్ 33; విజయ్ శంకర్ (సి) హర్‌ప్రీత్ (బి) రబడ 8; తెవాటియా (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు)** 199. **వికెట్ల పతనం:** 1–29, 2–69, 3–122, 4–164. **బౌలింగ్:** హర్‌ప్రీత్ బ్రార్ 4–0–33–1, అర్ష్‌దీప్ 4–0–33–0, రబడ 4–0–44–2, స్యామ్ కరన్ 2–0–18–0, హర్షల్ పటేల్ 4–0–44–1, సికందర్ రజా 2–0–22–0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (బి) ఉమేశ్ 1; బెయిర్‌స్టో (బి) నూర్ అహ్మద్ 22; ప్రభ్‌సిమ్రన్ (సి) మోహిత్ (బి) నూర్ అహ్మద్ 35; స్యామ్ కరన్ (సి) విలియమ్సన్ (బి) అజ్మతుల్లా 5; సికందర్ (సి) సాహా (బి) మోహిత్ 15; శశాంక్ (నాటౌట్) 61; జితేశ్ (సి) దర్శన్ (బి) రషీద్ ఖాన్ 16; అశుతోష్ (సి) రషీద్ ఖాన్ (బి) దర్శన్; హర్‌ప్రీత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19.5 ఓవర్లలో 7 వికెట్లకు)** 200. **వికెట్ల పతనం:** 1–13, 2–48, 3–64, 4–70, 5–111, 6–150, 7–193. **బౌలింగ్:** అజ్మతుల్లా 4–0–41–1, ఉమేశ్ 3–0–35–1, రషీద్ ఖాన్ 4–0–40–1, నూర్ అహ్మద్ 4–0–32–2, మోహిత్ శర్మ 4–0–38–1, దర్శన్ 0.5–0–6–1.

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X చెన్నై
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	3	3	0	6	2.518
రాజస్తాన్	3	3	0	6	1.249
చెన్నై	3	2	1	4	0.976
లక్నో	3	2	1	4	0.483
పంజాబ్	4	2	2	4	-0.220
గుజరాత్	4	2	2	4	-0.580
హైదరాబాద్	3	1	2	2	0.204
బెంగళూరు	4	1	3	2	-0.876
ఢిల్లీ	4	1	3	2	-1.347
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.